www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

సోమవారం | 1-12-2025 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 226 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం, తిథి: ఏకాదశి రా.7:01 తదుపరి ద్వాదశి, నక్షత్రం: రేవతి రా.11:18 తదుపరి అశ్విని, వర్జ్యం: మ.12:14-1:42, దుర్ముహూర్తం: మ.12:26-1:10, మ.2:38-3:22, అమృతఘడియలు: రా.9:05-10:33, రాహుకాలం: ఉ. 7:30-9:00, సూర్యోదయం: 6:33, సూర్యాస్తమయం: 5:35 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఐటీలో హెచ్ఐవీ బగ్!

ఆ రంగానికి చెందినవారిలో ఇటీవల పెరుగుతున్న వైరస్ కేసులు

విచ్చలవిడి వీకెండ్ పార్టీలు, డ్రగ్స్, మత్తు ఇంజెక్షన్ల వినియోగంతో సమస్య

జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ హెచ్చరిక 12

వ్యవసాయ కార్మికుల్లో హెచ్ఐవీ విస్తృతి.. అవగాహనలేమి, వలసలతో రిస్క్

ఐటీ, వ్యవసాయ రంగాల వారికి హెచ్ఐవీ పరీక్షలు పెంచాలని సూచన

మొత్తం కేసుల్లో మహారాష్ట్ర తర్వాత రెండో స్థానంలో ఏపీ



నేడు వరల్డ్ ఎయిడ్స్ డే

చనిపోయిన ప్రియుడ్ని పెళ్లాడిన ప్రియురాలు

యువకుడిని దారుణంగా చంపిన యువతి తండ్రి, సోదరులు

కులాంతర వివాహానికి సిద్ధమైనందునే..

మహారాష్ట్రలోని నాందేడ్‌లో కులోన్మాద హత్య

స్థానిక సంప్రదాయం ప్రకారం.. ప్రియుడి మృతదేహంపై పసుపు పూసి పెళ్లాడిన యువతి

పోలీసుల అదుపులో నిందితులు 2



అక్క కళ్లల్లో ఆనందం కోసం బావ హత్య

అడ్డొచ్చిన అతడి తల్లినీ నరికేసిన మైనర్

మరో ఇద్దరు మైనర్లతో కలిసి ఘాతుకం

ధూళిపాళ్లలో తల్లీ కొడుకుల దారుణ హత్య





మృతిచెందిన తల్లీకొడుకులు కృష్ణకుమారి, సాంబశివరావు (ఫైల్)

11

ఆ డీల్ తర్వాతే.. ఈ డీల్!

అమెరికాతో వాణిజ్య ఒప్పందం తర్వాతే ఎస్‌యూ-57 ఒప్పందం

పుతిన్ పర్యటనలో డీల్ లేనట్టే?

రష్యా నుంచి మరో ఐదు ఎస్-400 రెజిమెంట్ల కొనుగోలు 2



17 నెలల్లో రూ.50,763 కోట్లు

'ఎన్టీఆర్ భరోసా పింఛన్ల'పై భారీ వ్యయం

దేశంలోనే అతిపెద్ద నగదు బదిలీ కార్యక్రమం: సీఎం

పేదల సేవలో ప్రతి నేతా పాల్గొనాలి

కూటమి చేసిన మంచిని ప్రజలకు చెప్పండి

ఆ తర్వాత వారు మరే పార్టీకీ ఓటేయరు

కొన్ని చోట్ల అనర్హులకూ పింఛన్లు

అర్హులకు అన్యాయం జరగనివ్వం

పార్టీలకతీతంగా పెన్షన్లు ఇస్తాం

ఉగాదికి మరో 5 లక్షల ఇళ్లు

నేతలు, ప్రజాప్రతినిధులతో సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్



● ప్రతి నెలా 1న ఎలాంటి ఆటంకమూ లేకుండా పింఛన్లు పంపిణీ చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో పార్టీలోని అన్ని స్థాయిల నేతలూ భాగస్వాములు కావాలి. దానిని పేదల సేవగా భావించాలి. - సీఎం చంద్రబాబు

అమరావతి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక గత 17 నెలల్లో కేవలం సామాజిక పింఛన్లకే రూ.50,763 కోట్లు ఖర్చు చేశామని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు వెల్లడించారు. 'ఎన్టీఆర్ భరోసా పింఛన్లు' దేశంలోనే అతిపెద్ద డీబీటీ (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్-ప్రత్యక్ష నగదు బదిలీ) కార్యక్రమంగా అభివర్ణించారు. 'పేదల సేవలో' కార్యక్రమంలో ప్రతి నేతా పాల్గొనాలని పిలుపిచ్చారు. ఆ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు, ముఖ్య నేతలతో ఆదివారం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏటా వృద్ధాప్య పింఛన్‌దారులకు రూ.48 వేలు, డయాలసిస్ రోగులకు రూ.1.20 లక్షలు, పూర్తిగా మంచానికే పరిమితమైన దీర్ఘకాలిక రోగులకు

మిగతా 11వ పేజీలో...

నెల్లూరు జిల్లాకు చెందిన నిడిగుంట అరుణ ఉదంతం ఇటీవల సంచలనం సృష్టించింది. ఆమె చేసిన దందాలు, అరాచకాలు అన్నీ ఇన్నీ కావు. తాజాగా అదే జిల్లాకు చెందిన గంజాయి డాన్ అరవ కామాక్షి.. గంజాయికి వ్యతిరేకంగా పోరాడిన సీపీఎం నేతను దారుణంగా హత్య చేయించింది. తెనాలి బుజ్జిది మరో నేరగాథ. సైనైడ్ కలిపిన పానీయాలు తాగించి హత్యలు చేయడం.. బంగారం, డబ్బుతో ఉడాయించిన నేపథ్యం. ఇక చీరాల మరియమ్మ గ్యాంగ్ దొంగతనాలు చేయడంలో ఆరితేరిపోయింది. ఇలా రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో లేడీ డాన్లు హడలెత్తిస్తున్నారు.

వామ్మో.. లేడీ డాన్లు!



వరుస నేరాలతో హడలెత్తిస్తున్న మహిళలు

దొంగతనాలు, దందాలు, దోపిడీలు, హత్యలు, గంజాయి-డ్రగ్స్, భూకబ్జాలలో తరచూ కేసులు

నెల్లూరులో సంచలనం సృష్టించిన కి'లేడీ' అరుణ

తాజాగా గంజాయి డాన్ అరవ కామాక్షి అరెస్ట్

సైనైడ్ మిస్టరీ హత్యల్లో తెనాలి బుజ్జి జైలుకు

విజయవాడలో ఇళ్లు కబ్జా చేసిన లేడీ డాన్

చీరాల మరియమ్మ, తాడేపల్లి ప్రమీల దొంగల ముఠా

నూజివీడు మాజీ బ్యాంకర్ ఘరానా మోసాలు

కామాక్షి ఇంట 25 కేజీల గంజాయి, పత్రాలూ స్వాధీనం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఒకప్పుడు సినిమాల్లోనే లేడీ డాన్లు కనిపించేవారు. ఇప్పుడు పలు ప్రాంతాల్లో ప్రత్యక్షంగా దాదాగిరి చేస్తున్నారు. రాష్ట్రంలో జరుగుతున్న నేరాల్లో ఇటీవల తరచూ మహిళల పేర్లు వినిపిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. దొంగతనాలు, దందాలు, దోపిడీలు, హత్యలు, గంజాయి-డ్రగ్స్ రవాణా, విక్రయాలు, గ్యాంగ్ వార్, భూకబ్జాలు, రియల్ దందాలు.. అన్నింటా నేరసామ్రాజ్యంలో మహిళలు హల్‌చల్ చేస్తున్నారు. వరుసగా వెలుగుచూస్తున్న లేడీ డాన్ల ఉదంతాలు సరికొత్త చర్చకు దారి తీస్తున్నాయి. పోలీసు శాఖకు, ప్రభుత్వానికి సవాల్‌గా మారుతున్నాయి. నెల్లూరు జిల్లాకు చెందిన నిడిగుంట అరుణ అత్యంత సామాన్య కుటుంబంలో జన్మించింది. వైసీపీ నేతలతో పరిచయాలతో పాటు బ్యూరోక్రాట్లతో అత్యంత సన్నిహిత సంబంధాలు నెరిపే స్థాయికి చేరింది. వైసీపీ నేతలతో పాటు ఏకంగా మాజీ సీఎం జగన్‌కు

మిగతా 12వ పేజీలో...

బలహీనపడిన దిత్వా తుఫాన్

అయినా పూర్తిగా తొలగని ముప్పు



చిరుజల్లులు కురుస్తుండడంతో తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో హైవేపై ధాన్యానికి పట్టాలు కప్పుతున్న రైతులు

ఉత్తర తమిళనాడుకు సమీపంలో తీవ్ర వాయుగుండంగా కేంద్రీకృతం

నేడు దక్షిణ కోస్తాంధ్రకు వచ్చి మరింత బలహీనం

కోస్తా, సీమలకు భారీ వర్ష సూచన

నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు రెడ్ అలర్ట్

అన్నదాతల్లో ఆందోళన

దక్షిణ కోస్తా రేవుల్లో 3వ నంబరు హెచ్చరిక

అమరావతి, విశాఖపట్నం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మూడు రాష్ట్రాలను దడ పుట్టించిన 'దిత్వా' తుఫాన్ బలహీనపడింది. ఉత్తర దిశ నుంచి వీస్తున్న పొడి చలిగాలులు, సముద్రంలో తుఫాన్ పరిసరాల్లో ఉన్న మేఘాలు విచ్ఛిన్నం కావడంతో ఆదివారం సాయంత్రానికి

మిగతా 11వ పేజీలో...

తమిళనాట భారీ వర్షాలు.. ఆరుగురి మృతి

ఇదేంది సారూ.. ఇలా చేశారు?!

సబ్‌రిజిస్ట్రార్ ఆనందరెడ్డికి పోస్టింగుపై వివరణ పేరిట అసలు గుట్టు రట్టు!

రిజిస్ట్రేషన్ ఐజీ అంబేడ్కర్ వివరణపై అనేక అనుమానాలు

పేర్వేరు జిల్లాల డీఐజీలు ఆనందరెడ్డి అక్రమాలు నిర్ధారించారు 11

ఆయన సస్పెన్షన్‌ను హైకోర్టు ఆపేస్తే ఎందుకు అప్పీల్‌కు వెళ్లలేదు?

ప్రభుత్వ నిర్ణయం కోసం ఎందుకు ఎదురుచూడలేదు.. రిజిస్ట్రేషన్ వర్గాల్లో చర్చ



తలారి రంగయ్య

నకిలీ మద్యం కేసులో మరో అరెస్టు

ఏ14 రంగయ్యను అరెస్టు చేసిన ఎక్సైజ్

2023 నుంచి 2 లక్షల 'నకిలీ' లేబుళ్ల ముద్రణ 12

ఒక్కో షీట్‌కు రూ.45 చెల్లించిన అద్దేపల్లి

తెలీదు.. గుర్తులేదు.. మరిచిపోయా! 12

జోగి బద్రర్స్ సమాధానాలివి

4 రోజుల కస్టడీలో 250 ప్రశ్నలడిగిన అధికారులు

అన్నీ డొంక తిరుగుడు జవాబులే

'శీతాకాలం'.. గరంగరమే! 2

నేడే పార్లమెంటు సమావేశాలు

'సర్', పలు అంశాలపై సర్కార్‌ను నిలదీసేందుకు విపక్షాలు సిద్ధం

15 బిల్లులు పెట్టనున్న కేంద్రం!

ఒకరి తీర్పును మరొకరు కొట్టివేయడం ఆందోళనకరం 2

సుప్రీంలో పెరుగుతున్న ధోరణి

జస్టిస్ నాగరత్న వ్యాఖ్యలు

సర్ గడువు వారం పొడిగింపు

- 9 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో సాగుతున్న ప్రక్రియ
- ఫిబ్రవరి 14న ఓటర్ల తుది జాబితా విడుదల

న్యూఢిల్లీ, నవంబరు 30: తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సర్వే(సర్) ప్రక్రియ గడువును ఎన్నికల కమిషన్(ఈసీ) ఒక వారం పొడిగించింది. చాలా తక్కువ వ్యవధి ఇవ్వడం వల్ల క్షేత్రస్థాయి ఎన్నికల అధికారులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ప్రతిపక్ష పార్టీలు ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో ఈసీ ఆదివారం ఈ నిర్ణయం తీసుకుంది. గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఎన్యూమరేషన్ ఫారాలను ఈనెల(డిసెంబరు) 4వ తేదీ వరకు పంపిణీ చేయాల్సి ఉండగా, దాన్ని 11వ తేదీ వరకు పొడిగించినట్టు ఆదివారం ఒక ప్రకటనలో ఈసీ వెల్లడించింది. అలాగే, ముసాయిదా ఓటర్ల జాబితాను డిసెంబరు 9న ప్రచురించాల్సి ఉండగా, 16న ప్రచురించనున్నట్టు తెలిపింది. ఓటర్ల తుది జాబితాను వచ్చే ఏడాది ఫిబ్రవరి 7న విడుదల చేయాల్సి ఉండగా, ఫిబ్రవరి 14న విడుదల చేయనున్నట్టు వెల్లడించింది.

సోనియా, రాహుల్‌పై మరో ఎఫ్ఐఆర్

న్యూఢిల్లీ, నవంబరు 30: నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంబంధించిన అక్రమాల కేసులో కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా, రాహుల్‌లపై పోలీసులు మరో ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. ఈ వ్యవహారంలో మనీ ల్యాండరింగ్ జరిగిందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అందజేసిన వివరాల ఆధారంగా.. సోనియా, రాహుల్‌తోపాటు సుమన్‌దూబే, శామ్‌పిట్రోడా, మోతీలాల్ వోరా, ఆస్కార్ ఫెర్నాండెజ్, యంగ్ ఇండియా, డాటెక్స్ మర్చండైజ్, అసోసియేటెడ్ జర్నల్స్ సంస్థలు, మరికొందరిపై ఢిల్లీ ఆర్థిక నేరాల విభాగం (ఈవోడబ్ల్యూ) పోలీసులు ఈ ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఢిల్లీ కోర్టులో ఈడీ దాఖలు చేసిన చార్జిషీటులో వీరందరినీ నిందితులుగా పేర్కొనడం గమనార్హం. ఆ చార్జిషీటుపై కోర్టు డిసెంబరు 16న విచారణ జరపనుంది.

నన్ను క్షమించండి..!

- ఇజ్రాయెల్ దేశాధ్యక్షుడికి నెతన్యాహు అభ్యర్థన

టెల్ అవీవ్, నవంబరు 30: అవినీతి కేసులో తనపై జరుగుతున్న సుదీర్ఘ విచారణను ముగించేందుకు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు దేశాధ్యక్షుడిని క్షమాపణ కోరారు. ఈ మేరకు అధ్యక్ష కార్యాలయ న్యాయ విభాగానికి తన అభ్యర్థనను సమర్పించారని ప్రధాని కార్యాలయం ఆదివారం తెలిపింది. అయితే ఇది 'అసాధారణ అభ్యర్థన'గా అభివర్ణించిన అధ్యక్ష కార్యాలయం.. దీనితో పాటు పలు ముఖ్యమైన చిక్కులున్నట్లు పేర్కొంది. ఇక ఇజ్రాయెల్ చరిత్రలో విచారణకు హాజరైన ఏకైక ప్రధానిగా నెతన్యాహు నిలిచారు. తన సంపన్న రాజకీయ మద్దతుదారుల కోసం నెతన్యాహు అక్రమాలకు పాల్పడ్డారని.. మూడు వేర్వేరు కేసుల్లో ఆయనపై మోసం, నమ్మక ద్రోహం, లంచాలు స్వీకరించడం వంటి అభియోగాలున్నాయి. అయితే ఇంకా ఏ కేసులోనూ ఆయన దోషిగా తేలలేదు.

క్షిపణులకు ఏఐ పవర్..: డీఆర్‌డీవో కసరత్తు

న్యూఢిల్లీ, నవంబరు 30: రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీవో) కూడా క్షిపణులకు కృత్రిమ మేధ(ఏఐ)ను జోడించనుంది. శత్రు దాడులను ముందస్తుగానే పసిగట్టి స్వయంప్రతిపత్తితో జట్టుగా దాడిచేసే అధునాత మిస్సైల్స్‌ను అందుబాటులోకి తీసుకురానుంది. జీపీఎస్ పనిచేయని వాతావరణంలోనూ ఇవి అత్యంత కచ్చితత్వంతో శత్రు టార్గెట్లపై దాడిచేసే 'స్వీయ అవగాహన క్షిపణులు' రూపొందించడమే లక్ష్యంగా డీఆర్‌డీవో సాఫ్ట్‌వేర్ అభివృద్ధి పనులు మొదలుపెట్టిందని ఉన్నతస్థాయి అధికారులు వెల్లడించినట్టు తెలిసింది. సాఫ్ట్‌వేర్ అభివృద్ధి దశలో ఉన్న ఈ అధునాతన క్షిపణులకు 2027 నాటికి ట్రయల్స్ నిర్వహించాలని డీఆర్‌డీవో భావిస్తోంది. 2032నాటికి వాయుసేనకు అందుబాటులోకి రానున్నాయి.

నెల రోజుల వ్యవధిలో ఇద్దరు శాస్త్రవేత్తల మృతి

జైపూర్, నవంబరు 30: నెల రోజుల వ్యవధిలో భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో)కు చెందిన ఇద్దరు శాస్త్రవేత్తలు మరణించడం చర్చనీయాంశంగా మారింది. గత అక్టోబరు 21న ఆకాశ్‌దీప్ గుప్తా ఇంట్లో డిన్నర్ చేసిన తర్వాత అకస్మాత్తుగా కుప్పకూలి మరణించగా.. తాజాగా ఆదిత్య వర్మ (28) అనే మరో శాస్త్రవేత్త రాజస్థాన్‌లో అల్వార్‌లోని తన నివాసంలో మరణించారు. ఆయన పెళ్లైన రెండు రోజులకే ఇంట్లోని బాత్‌రూమ్‌లో విగతజీవిగా కనిపించారు. ఆదిత్య వర్మ మైసూర్‌లోని డీఆర్‌డీవోలో జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఆదిత్య తన భార్య నవ్యతో కలిసి గతనెల 29న హనీమూన్‌కు కూడా వెళ్లాల్సి ఉంది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిత్య వర్మకు గత నెల 25న ఓ పోలీసు అధికారి కుమార్తెతో వివాహమైంది. 26న కొత్త పెళ్లికూతురు వారి ఇంటికి వచ్చింది. తర్వాతి రోజు 27న ఉదయం ఆదిత్య వర్మ ఇంట్లోని బాత్‌రూమ్‌కు వెళ్లి.. ఎంత సేపటికీ బయటకు రాలేదు. దీంతో కుటుంబసభ్యులు తలుపు పగలకొట్టి చూడగా.. ఆదిత్య అపస్మారక స్థితిలో కనిపించారు. ఆస్పత్రికి తరలించగా మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు.

ఒక్క కిడ్నీతో పుట్టినా ఆరోగ్యంగానే..!

న్యూఢిల్లీ, నవంబరు 30: సాధారణంగా మనిషికి రెండు కిడ్నీలు ఉంటాయి. కానీ.. ప్రపంచవ్యాప్తంగా ఎపెడిమియోలాజికల్ డేటా ప్రకారం ప్రతి 1000 నుంచి 2000 మంది పిల్లల్లో ఒకరు ఒకే మూత్రపిండంతో జన్మిస్తున్నారు. ఈ పరిస్థితిని యూనిలేటరల్ రెనాల్ అజెనిసిస్(యూఆర్ఏ) అని పిలుస్తారు. ఇలా ఒక కిడ్నీతో పుట్టిన పిల్లల తల్లిదండ్రులు సహజంగానే ఆందోళన చెందుతారు. అయితే వైద్య నిపుణులు మాత్రం ఒక్క కిడ్నీతో పుట్టినంతమాత్రాన భయపడాల్సిన అవసరం లేదని.. సరైన జాగ్రత్తలు, పోషకాహారం తీసుకుంటే వారు కూడా సాధారణ పిల్లల్లాగే చురుకుగా, ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. 'ఒక్క కిడ్నీతో పుట్టిన చిన్నారుల్లో చాలామందిలో ఇది పెద్దదిగా మారుతుంది. రెండు కిడ్నీలు చేసే పనిని ఇదొక్కటే చేసేలా ఇది సహకరిస్తుంది.' అని గురుగావ్‌లోని మేదాంత ఆస్పత్రిలో పీడియాట్రిక్ యూరాలజీ డైరెక్టర్ డాక్టర్ సందీప్ కుమార్ సిన్హా తెలిపారు.

చనిపోయిన ప్రియుణ్ని పెళ్లాడిన ప్రియురాలు



నాందేడ్, నవంబరు 30: ప్రేమకు కులం, మతం, దేశం వంటి హద్దులు లేవంటారు. కానీ, మహారాష్ట్రలోని నాందేడ్‌లో జరిగిన ఓ ఘటన ప్రేమకు ఏకంగా చావు కూడా అడ్డంకి కాదని నిరూపించింది. తన ప్రియుడిని కుటుంబసభ్యులే దారుణంగా హత్య చేసినప్పటికీ ఆ 21 ఏళ్ల యువతి.. ప్రాణం పోయినా అతడే తన భర్త అంటూ మృతదేహాన్ని వివాహమాడింది. నవంబరు 27న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నాందేడ్‌కు చెందిన అంచల్ మామిడ్వార్ తన సోదరుని స్నేహితుడైన సాక్షమ్ తాతేతో ప్రేమలో పడింది. ఇద్దరూ కలిసి బతకాలని కలలు కన్నారు. ఇరువురి కులాలు వేరు కావడంతో ఆంచల్ తండ్రి, ఇద్దరు సోదరులు ఈ బంధాన్ని వ్యతిరేకించారు. ఆంచల్ కుటుంబం నుంచి తీవ్ర బెదిరింపులు ఉన్నా, పెళ్లి చేసుకోవడానికి సిద్ధమయ్యారా ప్రేమికులు. వేరే కులం వాడిని పెళ్లి చేసుకుంటే పరువుపోతుందని భావించిన ఆంచల్ కుటుంబ సభ్యులు.. సాక్షమ్‌ను ఎలాగైనా చంపాలని నిర్ణయించుకున్నారు. నాలుగు రోజుల క్రితం ఆంచల్ తండ్రి గజానన్, ఇద్దరు సోదరులు సాహిల్, హిమేశ్ మరో ఇద్దరితో కలిసి సాక్షమ్‌పై దాడి చేశారు. తుపాకీతో కాల్పులు జరిపి.. ఆ తర్వాత రాయితో మోది దారుణంగా హత్య చేశారు. విషయం తెలుసుకున్న ఆంచల్ గుండెలవిసేలా రోదించింది. గత నెల 28న సాయంత్రం అంత్యక్రియలకు ఏర్పాట్లు జరుగుతున్న సమయంలో సాక్షమ్ ఇంటికి చేరుకుంది. ప్రియుడిని చంపి తన తండ్రి, సోదరులు గెలిచామని భావిస్తున్నారని.. తన ప్రేమకు మర ణం లేదని లోకానికి చాటాలని భావించింది. చనిపోయినా, బతికున్నా అతడే తన భర్త అంటూ.. ప్రియుడి మృతదేహంపై పసుపు పూసి, తన నుదుటిపై సిందూరం దిద్దుకుని.. జీవితాంతం సాక్షమ్ భార్యగా అతని ఇంట్లోనే బతుకుతానని ప్రతిజ్ఞ చేసింది. తన తండ్రి, సోదరులను ఉరి తీయాలని ఆమె డిమాండ్ చేసింది.

భారత అంతరిక్ష రంగానికి

'ఇన్ఫినిటీ' ఉత్సాహం

దేశ యువశక్తికి 'స్కైరూట్ ఇన్ఫినిటీ' క్యాంపస్ ప్రతిబింబం

- 'మన్ కీ బాత్'లో హైదరాబాద్ స్టార్టప్‌పై మోదీ ప్రశంసలు




న్యూఢిల్లీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): భారత దేశ అంతరిక్ష పర్యావరణ వ్యవస్థకు.. హైదరాబాద్ స్టార్టప్ 'స్కైరూట్ ఏరోస్పేస్'కు చెందిన ఇన్ఫినిటీ క్యాంపస్ కొత్త ఉత్సాహాన్ని ఇస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. ఈ కేంద్రం దేశంలోని నవీన ఆలోచన, ఆవిష్కరణ, యువశక్తికి ప్రతిబింబంగా నిలిచిందని కొనియాడారు. 128వ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఆయన.. హైదరాబాద్‌కు చెందిన ఈ స్టార్టప్ సంస్థపై ప్రసంశలు కురిపించారు. అలాగే.. ప్రపంచంలోనే అతిపెద్ద లీప్ ఇంజిన్ 'మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్‌హాల్ (ఎంఆర్‌వో)' సౌకర్యాన్ని ఇటీవలే హైదరాబాద్‌లో ప్రారంభించినట్టు వెల్లడించారు. విమాన నిర్వహణ, మరమ్మత్తు, పునఃపరిశీలన రంగంలో మనదేశం కీలక ముందడుగు వేసిందన్నారు. అలాగే.. 'వోకల్ ఫర్-లోకల్'ను ప్రోత్సహించే క్రమంలో.. పలు దేశాల ప్రధానులకు కరీంనగర్ సిల్వర్ ఫిలిగ్రీ నైపుణ్యాన్ని పరిచయం చేశానని, వివిధ కళాకృతులను వారికి బహూకరించానని వెల్లడించారు. "మీరంతా 'వోకల్ ఫర్ లోకల్' అనే మంత్రాన్ని పాటించాలి" అని జి-20 శిఖరాగ్ర సమావేశాల్లో వివిధ దేశాల ప్రతినిధులు, నాయకులను కోరినట్టు తెలిపారు. "మన దేశప్రజల తరఫున వారికి బహుమతులు అందించేటప్పుడు ఈ భావనను దృష్టిలో ఉంచుకున్నాను. జి-20 సందర్భంగా జపాన్ ప్రధానికి వెండి బుద్ధుడి ప్రతిరూపాన్ని బహూకరించాను. అది తెలంగాణలోని కరీంనగర్‌కు చెందిన ప్రసిద్ధ సిల్వర్ క్రాఫ్ట్ నైపుణ్యాన్ని ఆవిష్కరిస్తుంది. అలాగే.. ఇటలీ ప్రధానికి పూల ఆకృతులతో కూడిన వెండి అద్దం బహుమతిగా ఇచ్చాను. అది కరీంనగర్ సంప్రదాయ లోహ శిల్పకళా నైపుణ్యానికి నిదర్శనం. ఇలా పలు దేశాధి నేతలకు దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన అద్భుతమైన కళా రూపాలను బహూకరించాను. భారతీయ హస్తకళలు, కళలు, సంప్రదాయాల గురించి ప్రపంచానికి అవగాహన కల్పించడం, మన చేతివృత్తులవారి ప్రతిభను ప్రపంచానికి అందించడం నా లక్ష్యం. రాబోయే రోజుల్లో క్రిస్మస్, నూతన సంవత్సర షాపింగ్‌లో 'వోకల్ ఫర్ లోకల్' అనే మంత్రాన్ని గుర్తుంచుకోండి. దేశంలో తయారు చేసిన వాటిని మాత్రమే కొనండి. దేశప్రజలు కష్టపడి తయారుచేసిన వాటిని మాత్రమే అమ్మండి' అని మోదీ పిలుపునిచ్చారు.

అదే.. గొప్ప బలం

యువత అంకితభావం వికసిత్ భారత్‌కు గొప్ప బలమని నరేంద్ర మోదీ తెలిపారు. "సోషల్ మీడియాలో ఒక వీడియో కొన్ని రోజుల కిందట నా దృష్టిని ఆకర్షించింది. ఈ వీడియో ఇస్రో నిర్వహించిన ఒక ప్రత్యేకమైన డ్రోన్ పోటీకి సంబంధించింది. ఈ వీడియోలో దేశ యువత ముఖ్యంగా మన జెన్-జీ అంగారక గ్రహ వాతావరణంలో డ్రోన్‌లను ఎగరవేసేందుకు ప్రయత్నిస్తోంది. వారి ప్రయత్నాలు ఫలించలేదు. కానీ, పుణె నుంచి వచ్చిన యువకుల బృందం ఈ పోటీలో కొంతమేరకు విజయాన్ని సాధించింది. వారి డ్రోన్ కూడా చాలాసార్లు పడిపోయి కూలిపోయినా పట్టు వదలలేదు. చాలా ప్రయత్నాల తర్వాత ఈ బృందం డ్రోన్ అంగారక గ్రహ వాతావరణంలో కొంతసేపు ఎగరగలిగింది. ఈ వీడియో చూస్తున్నప్పుడు నాకు మరొక దృశ్యం గుర్తుకు వచ్చింది. చంద్రయాన్-2తో సంబంధం తెగిపోయినప్పుడు.. యావద్దేశం.. ప్రధానంగా శాస్త్రవేత్తలు కొద్దిక్షణాలు నిరాశకు లోనయ్యారు. కానీ, ఆ వైఫల్యం వారిని నిలువరించలేదు. చంద్రయాన్-3 విజయగాథను అదే రోజు రచించడం మొదలుపెట్టారు. చంద్రయాన్-3 ల్యాండ్ అయిన క్షణం.. వైఫల్యాన్ని అధిగమించిన తర్వాత సాధించిన ఆత్మవిశ్వాస విజయం. సోషల్ మీడియాలో చూసిన ఆ వీడియోలో కనిపించిన యువకుల కళ్లలోనూ నేను అదే మెరుపును చూశాను. యువతరం చూపే ఈ అంకితభావం 'వికసిత్ భారత్'కు గొప్ప బలం' అని ప్రధాని మోదీ ప్రశంసించారు.

లోకం తీరు



ఒకరి తీర్పును మరొకరు కొట్టివేయడం ఆందోళనకరం

- జస్టిస్ నాగరత్న వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, నవంబరు 30: ఒక ధర్మాసనం ఇచ్చిన తీర్పును కొంత కాలం తరువాత మరో ధర్మాసనం కొట్టివేస్తున్న సంఘటనలు ఇటీవల కాలంలో సుప్రీంకోర్టులో చోటు చేసుకుంటుండడంపై న్యాయమూర్తి జస్టిస్ బి.వి.నాగరత్న ఆందోళన వ్యక్తంచేశారు. తీర్పు రాసిన న్యాయమూర్తి పదవీ విరమణ చేశారనో, స్థానాన్ని మారారనో చెప్పి తీర్పులను కొట్టివేయకూడదని సూచించారు. దేశంలో చట్టబద్ధ పాలన అమలు చేయాల్సిన బాధ్యత న్యాయ వ్యవస్థపై ఉం దని స్పష్టం చేశారు. హరియాణాలోని సోనీపట్‌లో ఉన్న ఓపీ జిందాల్ గ్లోబల్ వర్సిటీలో న్యాయ వ్యవస్థ స్వతంత్రతపై శనివారం నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ఆమె ఈ అంశాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. న్యాయమూర్తి ఒకసారి ఇచ్చిన తీర్పు స్థిరంగా ఉంటుందంటూ చట్టవ్యవస్థ ఇచ్చిన భరోసా మేరకే న్యాయ వ్యవస్థ స్వతంత్రత అన్న భావన వృద్ధి చెందిందని తెలిపారు. న్యాయమూర్తులు సిరాతో తీర్పులు రాస్తారని, ఆ తీర్పును గౌరవించాల్సిన బాధ్యత న్యాయవ్యవస్థలోని అందరు భాగస్వాములు, ప్రభుత్వ యంత్రాంగంపై ఉందని చెప్పారు. ఒకవేళ ఏవైనా అభ్యంతరాలు ఉంటే అది సంప్రదాయ విధానాలకు అనుగుణంగా జరగాల్సి ఉంటుందని ఆమె తెలిపారు.

ఆ డీల్ తర్వాతే.. ఈ డీల్!



అమెరికాతో వాణిజ్య ఒప్పందం తర్వాతే ఎస్‌యు-57 ఒప్పందం

రష్యా అధ్యక్షుడు పుతిన్ 4-5 తేదీల్లో ఇండియా పర్యటనకు వస్తున్నారు! ఈ పర్యటనలో రష్యా నుంచి స్టెల్త్ సామర్థ్యం ఉన్న ఐదోతరం యుద్ధ విమానాలు 'ఎస్‌యు-57'లను కొనుగోలు చేసేందుకు భారత్ ఒప్పందం కుదుర్చుకునే అవకాశం ఉందన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఈ విమానాల విక్రయానికి, 100 శాతం సాంకేతిక పరిజ్ఞానాన్ని బదిలీ చేసేందుకు రష్యా ఇప్పటికే ఆమోదం తెలిపింది. వాటిని భారత్‌లో తయారుచేయడానికే కాక.. వేరే దేశాలకు ఎగుమతి చేయడానికి కూడా అనుమతిస్తామని మరో బంపర్ ఆఫర్ ఇచ్చింది. రెండు దేశాలూ కలిసి ఈ విమానాలను తయారుచేయడానికి.. రష్యా నుంచి వచ్చిన బృందం ఒకటి నాసిక్‌లో 'హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్'కు చెందిన ఎస్‌యు-30ఎంకే విమానాల తయారీ కేంద్రాన్ని పరిశీలించింది. ఎస్‌యు-57ల తయారీకి అక్కడున్న సదుపాయాలు దాదాపు 50శాతం దాకా సరిపోతాయని, మిగతా ఏర్పాట్లు తాము చేస్తామని పేర్కొంది. అయినప్పటికీ.. ఈ డీల్ పుతిన్ పర్యటనలో కుదరకపోవచ్చని రక్షణ రంగ నిపుణులు కొందరు విశ్లేషిస్తున్నారు. భారత్-అమెరికా నడుమ చాలాకాలంగా జరుగుతున్న వాణిజ్య ఒప్పందం ప్రస్తుతం తుది దశలో ఉండడమే ఇందుకు కారణం.

అమెరికాతో సత్సంబంధాల కోసం..

సుఖోయ్-57 కాకుండా ఐదో తరం యుద్ధవిమానాలకు సంబంధించి భారత్ ముందున్న మరో ప్రత్యామ్నాయం అమెరికాకు చెందిన ఎఫ్-35లు. వాటిని భారత్‌కు అమ్మడానికి అమెరికా ఇంతవరకూ అధికారికంగా ముందుకు రాలేదు. ట్రంప్ మాత్రం ఒకసారి.. ఎఫ్-35లను భారత్‌కు విక్రయించడానికి సిద్ధమని నోటిమాటగా అన్నారు. ఒకవేళ అమెరికా వాటిని అమ్మజూపినా.. రష్యాకు చెందిన క్షిపణి రక్షణ వ్యవస్థలైన ఎస్-400లు ఉన్నచోట వాటిని నియోగించొద్దని ఆంక్షలు విధిస్తుంది. ఆ విమానాలకు సంబంధించిన 100శాతం సాంకేతిక పరిజ్ఞానాన్ని మనకు బదిలీ చేయదు. కాబట్టి వాటిని కొన్నా వాటి ఉపయోగం పరిమితమే అవుతుంది. కాబట్టి అవి వద్దనుకుంటే.. రష్యా నుంచి ఎస్‌యూ-57లను కొనడం ఒక్కటే ప్రత్యామ్నాయం. కానీ, అమెరికాతో వాణిజ్య ఒప్పందం చర్చలు తుదిదశకు చేరుకున్న సమయంలో రష్యాతో ఎస్‌యు-57 డీల్ కుదుర్చుకుంటే అగ్రరాజ్యంతో వ్యవహారం చెడుతుందన్న ఆందోళన ఉంది. కాబట్టి అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదిరి.. ఆ దేశంతో సానుకూల సంబంధాలు ఏర్పడిన తర్వాత రష్యాతో ఎస్‌యు-57 డీల్ కుదుర్చుకోవచ్చన్నది భారత ప్రభుత్వ యోచనగా చెబుతున్నారు. ఈ క్రమంలోనే.. అమెరికాతో చర్చలు సానుకూలంగా సాగేందుకు, ఆ దేశంతో సంబంధాలు దెబ్బతినకుండా ఉండేందుకే.. ఎఫ్-35 యుద్ధవిమానాల కొనుగోలును పరిశీలిస్తున్నామంటూ భారత వాయుసేన వర్గాలు ప్రకటనలు చేస్తున్నట్టు చెబుతున్నారు. దీంతోపాటు.. రక్షణ రంగానికి సంబంధించి అమెరికాతో ఇతరత్రా ఒప్పందాలపై భారత్ దృష్టి సారించింది. భారత వాయుసేన అమెరికాకు చెందిన బోయింగ్ కేసీ-135 స్ట్రాటో ట్యాంకర్‌ను (గాలిలోనే యుద్ధవిమానాల్లో ఇంధనం నింపే ట్యాంకర్)ను లీజుకు తీసుకుంది. అలాగే.. నౌకాదళం కోసం కొన్న 24 ఎంహెచ్-60ఆర్ సీహాక్ హెలికాప్టర్లకు వచ్చే ఐదేళ్లపాటు అవసరమయ్యే సర్వీసింగ్ సపోర్ట్ అందించేందుకు రూ.7995 కోట్లతో 'ఫాలో ఆన్ సపోర్ట్' ఒప్పందాన్ని ఇటీవలే కుదుర్చుకుంది. అలాగే.. నేవల్ గస్తీ కోసం అత్యంత శక్తిమంతమైన రేడార్లు కలిగిన ఆరు 'పీ-8ఐ' లాంగ్ రేంజ్ మారిటైమ్ పెట్రోల్ ఎయిర్‌క్రాఫ్ట్‌ల కొనుగోలుకు సంబంధించి 4 బిలియన్ డాలర్ల ఒప్పందంపై ఇరుదేశాల మధ్య చర్చలు జరుగుతున్నాయి. ఇప్పటికే మన నేవీ వద్ద 12 'పీ-8ఐ' విమానాలున్నాయి. మరో 10 విమానాల కోసం నేవీ అడిగినప్పటికీ.. ఆరు విమానాల కొనుగోలుకు ఆమోదం లభించింది. వీటన్నింటికంటే పెద్దది.. అమెరికా నుంచి బీ-1బీ లాన్సర్ అనే దీర్ఘ శ్రేణి సూపర్‌సానిక్ బాంబర్ కొనుగోలు లేదా లీజు ప్రతిపాదన పెట్టారు. ఈ ఒప్పందం కుదిరితే అది చాలా పెద్ద డీల్ అవుతుంది. ఇలా.. ఎస్‌యు-57 డీల్‌ను పక్కన పెట్టడం, ఇతరత్రా పలు ఒప్పందాలు కుదుర్చుకోవడం ద్వారా అమెరికాతో సత్సంబంధాలను కొనసాగించాలని భారత్ భావిస్తోంది.

- సెంట్రల్ డెస్క్

రష్యాతోనూ..

ఎస్‌యు-57 డీల్‌ను ప్రస్తుతానికి పక్కన పెట్టినప్పటికీ.. పుతిన్ పర్యటనలో కొన్ని మేజర్ ఒప్పందాలు కుదుర్చుకునే అవకాశం ఉంది. వాటిలో ముఖ్యమైనది.. ఎస్-400 డీల్. ఇప్పటికే మన గగనతల రక్షణ వ్యూహంలో ఎస్-400లు కీలకపాత్ర పోషిస్తున్నాయి. అదనంగా మరో ఐదు ఎస్-400 ఎయిర్ డిఫెన్స్ రెజిమెంట్ల కొనుగోలుకు ఈ పర్యటనలో ఒప్పందం కుదుర్చుకునే అవకాశం ఉన్నట్టు సమాచారం. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో ఎస్-400 వ్యవస్థల ద్వారా వాడిన క్షిపణుల స్థానంలో కొత్త మిస్సైళ్లను కొనుగోలు చేయడానికి భారత్ ప్రణాళికలు రచించింది. వీటితో పాటు.. ధ్వని కంటే ఆరు రెట్ల వేగంతో దూసుకెళ్లి 300 కిలోమీటర్ల అవతల ఉన్న లక్ష్యాలను సైతం తుత్తునియలు చేయగల అల్ట్రా లాంగ్ రేంజ్ ఎయిర్ టు ఎయిర్ మిస్సైల్స్ 'ఆర్-37ఎం యాక్స్ హెడ్'ల కొనుగోలుకు కూడా రష్యాతో భారత్ చర్చలు జరుపుతోంది. అవి కూడా పుతిన్ పర్యటనలో తుదిరూపు దాల్చే అవకాశం ఉంది. ఇలా ఒకవైపు అమెరికాతో సత్సంబంధాలకు ప్రయత్నిస్తూనే.. రష్యాతోనూ సంబంధాలను కాపాడుకునే దిశగా భారత్ అడుగులు వేస్తున్నట్టు సమాచారం.

'శీతాకాలం'.. గరంగరమే!



నేటి నుంచి పార్లమెంటు సమావేశాలు

న్యూఢిల్లీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు శీతాకాల సమావేశాలు వాడీవేడిగా సాగే సూచనలు కనిపిస్తున్నాయి. బిహార్‌లో భారీ విజయంతో దూకుడు మీదున్న అధికారపక్షం ఒకవైపు.. ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ(సర్), ఢిల్లీ పేలుళ్లు, వాయు కాలుష్యం, అదానీ కంపెనీలో ఎల్ఐసీ పెట్టుబడులు వంటి అంశాలపై నిలదీసేందుకు ప్రతిపక్షం మరోవైపు సమావేశాలకు సిద్ధమయ్యాయి. సోమవారం ఉదయం 11 గంటలకు పార్లమెంటు సమావేశాలు ప్రారంభమై ఈ నెల 19వ తేదీ వరకు కొనసాగుతాయి. సెలవు దినాలు మినహాయించి మొత్తం 15 రోజులు సమావేశాలు జరుగుతాయి. కొత్తగా 10 బిల్లులతోపాటు నాలుగు ఆర్థిక సవరణ బిల్లులు, కాలం చెల్లిన మొత్తం 120 చట్టాలను రద్దు చేసే మరో కీలక బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టడానికి కేంద్రం సిద్ధమైంది. ప్రధానంగా అణుశక్తి, ఉన్నత విద్యా కమిషన్ ఏర్పాటు, కార్పొరేట్, బీమా, సెక్యూరిటీస్ మార్కెట్స్ కోడ్, జాతీయ రహదారులు, మధ్యవర్తిత్వం- రాజీ చట్టాల సవరణ బిల్లులు ఉన్నాయి. వీటిలో అణుశక్తి రంగంలో ప్రైవేట్ రంగ భాగస్వామ్యాన్ని అనుమతించే అణుశక్తి బిల్లు-2025, యూనివర్సిటీలు, ఉన్నత విద్యా సంస్థలకు స్వయం ప్రతిపత్తి, కేంద్ర విద్యా కమిషన్ ఏర్పాటు లక్ష్యంగా రూపొందించిన ఉన్నత విద్యా కమిషన్ బిల్లు- 2025 కీలకమైనవి. పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టి సెలెక్ట్ కమిటీల పరిశీలనకు పంపిన మరో రెండు బిల్లులను ఈ సెషన్‌లో ఆమోదించే అవకాశం ఉంది.

సజావుగా సాగేందుకు సహకరించండి: కేంద్రం

పార్లమెంట్ శీతాకాల సమావేశాలు సజావుగా సాగేందుకు సహకరించాలని విపక్షాలను కేంద్రం కోరింది. ఆదివారంరక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అధ్యక్షతన న్యూఢిల్లీలో అఖిలపక్ష సమావేశం జరిగింది. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు, కేంద్రమంత్రులు జేపీ నడ్డా, అర్జున్‌రామ్ మేఘవాల్, ఎల్. మురుగన్, అనుప్రియ పటేల్‌తోపాటు జైరామ్ రమేశ్ (కాంగ్రెస్), లావు శ్రీకృష్ణ దేవరాయలు (తెలుగుదేశం), మిథున్‌రెడ్డి (వైసీపీ), సురేశ్‌రెడ్డి (బీఆర్ఎస్), బాలశౌరి (జనసేన) సహా 36 పార్టీల నుంచి 50 మంది నేతలు పాల్గొన్నారు. అయితే ఓటర్ల జాబితాల సవరణ, విదేశాంగ విధానం, అమెరికా టారిఫ్‌లు, అరుణాచల్ ప్రదేశ్ తమదేనని చైనా ప్రకటించడం, ఎర్రకోట వద్ద ఉగ్రవాద దాడి సహా పలు అంశాలపై పార్లమెంటులో చర్చించాలని విపక్షాల ప్రతినిధులు ఈ భేటీలో డిమాండ్ చేశారు. భేటీ అనంతరం కిరణ్ రిజిజు, విపక్ష నేతలు మీడియాతో మాట్లాడారు. విపక్షాలు పార్లమెంట్ సజావుగా సాగేందుకు సహకరించాలని, ఆటంకాలు సృష్టించవద్దని కిరణ్ రిజిజు కోరారు. టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు కూడా కృష్ణా జలాల వినియోగం, కేటాయింపులపై పార్లమెంట్‌లో చర్చించాలని డిమాండ్ చేశారు. అమెరికా టారిఫ్‌లతో ఏపీలోని 'ఆక్వా' రైతులకు ఇబ్బంది కలుగుతోందని, దీనిపై చర్చించాలని కోరారు. పార్లమెంటు సమావేశాల నేపథ్యంలో కాంగ్రెస్ సీనియర్ నేతలు ఆదివారం సోనియాగాంధీ నివాసంలో సమావేశమయ్యారు. ప్రభుత్వాన్ని ఏయే అంశాలపై నిలదీయాలనే దానిపై వ్యూహాన్ని ఖరారు చేసుకున్నారు. రాజ్యసభలో ప్రతిపక్ష నేత అయిన ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే చాంబర్‌లో సోమవారం ఉదయం ఇండి కూటమి పార్టీల ప్రతినిధులు సమావేశం కానున్నారు. సమావేశాల్లో లేవనెత్తాల్సిన అంశాలపై చర్చించనున్నారు.

90% డిగ్రీ పట్టాలు చిత్తుకాగితాలతో సమానం

నైపుణ్యాలు అందించని డిగ్రీలు నాలుక గీసుకోవడానికీ పనికిరావు

- ప్రభుత్వ ఉద్యోగమే సర్వస్వం అనుకునేవాళ్లు మూర్ఖులు
- వదాన్య స్వచ్ఛంద సంస్థ వార్షికోత్సవంలో జయప్రకాశ్ నారాయణ
- వదాన్య సేవలను కొనియాడిన ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామకృష్ణప్రసాద్



వదాన్య 15 వసంతాల వేడుకను ప్రారంభిస్తున్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామకృష్ణప్రసాద్, రామేశ్వరరావు, జయప్రకాశ్ నారాయణ, గాలి మాధవీలత, హను రాఘవపూడి, బీవీఎస్ రవి, సువర్ణ, వదాన్య వ్యవస్థాపకుడు అశోక్ పడపాటి

హైదరాబాద్ సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మన దేశంలో నూటికి 90శాతం మంది డిగ్రీ పట్టాలు చిత్తుకాగితాలతో సమానమని, అవి నిరర్థకమైనవని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారాయణ అన్నారు. నైపుణ్యాలు అందించని డిగ్రీ పట్టాలు నాలుక గీసుకోవడానికీ పనికిరావని చెప్పారు. సమాజ పురోగతికి కావాల్సింది పట్టాలుకాదని.. సృజనాత్మకత, ఉత్పత్తి సామర్థ్యాలు, క్రిటికల్ థింకింగ్, సమస్య పరిష్కారం వంటి నైపుణ్యాలన్నారు. దేశంలో 24 కోట్ల మంది పాఠశాలల్లో ఉన్నారని, వారిలో నూటికి ఎనభై మంది భవిష్యత్తు ప్రశ్నార్థకమేనని పేర్కొన్నారు. విద్యా వ్యవస్థంటే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, కోర్టుకేసులేనా అని ఆయన ప్రశ్నించారు. పిల్లల పేరుతో దేశంలో ఒక డ్రామా నడుస్తోందని మండిపడ్డారు. ఒక్కో విద్యార్థిపై ప్రభుత్వం రూ.లక్షకుపైగా వెచ్చిస్తున్నా, కనీస విద్యాప్రమాణాలు అందడంలేదని జేపీ ఆవేదన వ్యక్తం చేశారు. బట్టీయం లేదా కాపీ కొట్టడమే తప్ప ఉత్తీర్ణత పొందినవారిలో 20శాతంమందికి మించి మిగతా విద్యార్థులకు సబ్జెక్టుల్లో కనీస పరిజ్ఞానం ఉండడం లేదన్న పలు అధ్యయనాలను ఉదహరించారు. వదాన్య స్వచ్ఛంద సంస్థ 15వ వార్షికోత్సవం ఆదివారం గచ్చిబౌలిలోని ఈఎస్‌సీఐ ఆడిటోరియంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరైన జేపీ మాట్లాడుతూ..ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే సర్వస్వంగా భావించేవారంతా పరమమూర్ఖులు అన్నారు. జిల్లా కలెక్టరుకన్నా మరుగుదొడ్డిలో తూము పూడికతీసే ప్లంబరు మిన్న అన్న విషయాన్ని గుర్తించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామకృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. పేదవర్గాల్లోని ప్రతిభావంతులను గుర్తించి, వారి చదువుకు ఆర్థిక సహాయం అందిస్తున్న వదాన్య జనసొసైటీ సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. విద్యాదానాన్ని ఒక బృహత్ కార్యక్రమంగా చేపట్టిన అశోక్ పడపాటి బృందం యువతకు ఆదర్శనీయమని పేర్కొన్నారు. ప్రముఖ సినీ దర్శకుడు హను రాఘవపూడి, సినీ రచయిత బీవీఎస్ రవి.. వదాన్యతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. వదాన్య వ్యవస్థాపకుడు అశోక్ పడపాటి మాట్లాడుతూ ఇప్పటివరకు తమ సంస్థ సేవలు పొందిన వారిలో 100 మందికిపైగా యువత ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారని, వారిలో 50మంది ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైనట్టు తెలిపారు. ఉన్నత చదువుకు ఆర్థిక సహకారం, ల్యాప్‌టాప్‌ల పంపిణీతోపాటు పోటీపరీక్షల అభ్యర్థులకు శిక్షణా తరగతులు, పాఠశాల స్థాయిలో టాలెంట్ టెస్టులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఈసీఎస్ఐ) డైరెక్టర్ జి.రామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టెండర్లు అనర్హులకేనా?!

- ఏపీటీడీసీలో అడ్డగోలు టెండర్లు
- ఏ టెండరైనా నాలుగుసార్లు పిలవాల్సిందే
- 'సింహాచలం' సాఫ్ట్‌వేర్ టెండర్లలో ఇష్టారాజ్యం
- రూ.2.36 కోట్ల చిన్న టెండర్ సైతం 4 సార్లు..
- అర్హత లేని కంపెనీకి కట్టబెట్టేందుకు ప్రయత్నాలు
- ఇంతకుముందు 'అన్నవరం' టెండర్లలోనూ మతలబు
- 'ప్రసాద్' పథకంలో ఏపీటీడీసీ అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

టెండర్ ఏదైనా అధికారులు అనుకున్న కంపెనీకే దక్కాలి.. అందుకోసం ఎంత దూరమైనా వెళ్తారు.. ఏదైనా చేస్తారు.. ఎంత పెద్ద కంపెనీ అయినా డిస్‌క్వాలిఫై చేసేస్తారు.. చివరికి అవసరం లేకున్నా టెండర్లను రద్దు చేసేస్తారు. ఇదీ ఆంధ్రప్రదేశ్ టూరిజం అభివృద్ధి కార్పొరేషన్ అధికారుల తీరు! టెండర్లను మతలబు చేయడంలో వారు ఆరితేరిపోయారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో అన్నవరంలో పలు నిర్మాణాల విషయంలోనూ.. తాజాగా.. సింహాచలం ఆలయ సాఫ్ట్‌వేర్ నిర్వహణ కోసం కంపెనీ ఎంపికకు పిలిచే టెండర్ల విషయంలోనూ ఇదే రీతిన వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి! ఒక అర్హత లేని కంపెనీని తీసుకువచ్చి రూ.2.36 కోట్ల విలువైన సాఫ్ట్‌వేర్ సేవలకు సంబంధించిన పని అప్పగించేందుకు అధికారులు అడ్డదారులు తొక్కుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో అభివృద్ధి పనుల నిమిత్తం కేంద్ర ప్రభుత్వం 'ప్రసాద్' (పిలిగ్రిమ్ రెజువెంటేషన్ అండ్ స్పిరిచ్యువల్ అగ్మెంటేషన్ డ్రైవ్) పథకంలో భాగంగా కోట్లాది నిధులు కేటాయిస్తోంది. ఎక్కువ శాతం సివిల్ వర్కులకు నిధులను కేటాయించే కేంద్రం.. తొలిసారి భక్తుల సౌకర్యార్థం సాఫ్ట్‌వేర్ సేవలను కూడా ఈ పథకంలో అందించాలని నిర్ణయించింది. ఇందుకు ఏపీలోని సింహాచలం దేవస్థానాన్ని ఎంపిక చేసింది. రూ.2.36 కోట్ల వ్యయంతో వెబ్‌సైట్ డిజైన్, హ్యాండ్ యాప్, ఐవోఎస్ యాప్‌లను సిద్ధం చేయడంతో పాటు వాటి నిర్వహణను ప్రయివేటు సంస్థకు అప్పగించాలని నిర్ణయించింది. ఈ ఎంపిక బాధ్యత తీసుకున్న ఆంధ్రప్రదేశ్ టూరిజం అభివృద్ధి కార్పొరేషన్ (ఏపీటీడీసీ) అధికారులు.. గత ఏడాది జూలై నుంచి టెండర్లు పిలవడం, రద్దు చేయడం.. మళ్లీ పిలవడం.. రద్దు చేయడం.. ఇలా నాలుగుసార్లు చేశారు. అర్హత కలిగిన కంపెనీని మాత్రం ఎంపిక చేయడం లేదు. దీనికి కారణం.. ఏపీటీడీసీలో ప్రాజెక్టు విభాగం చూసే ఒక ఉన్నతాధికారి.. రాజమండ్రికి చెందిన ఒక కంపెనీకి సాఫ్ట్‌వేర్ టెండర్ కట్టబెట్టేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. అయితే.. ఇప్పటి వరకూ నాలుగు సార్లు టెండర్లు ఆహ్వానించినా అధికారి అనుకున్న ఆ రాజమండ్రి కంపెనీకి అర్హత లభించడం లేదు. ఇప్పటి వరకూ పిలిచిన టెండర్లల్లో ఐదు కంపెనీలు వచ్చినా.. టెండర్లు రద్దు చేయడంతో వెనక్కి వెళ్లిపోయాయి. దీనిపై పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి, ఏపీటీడీసీ ఎండీకి పలువురు ఫిర్యాదులు చేసినా ఫలితం మాత్రం శూన్యం.

అన్నవరం నిర్మాణాల్లోనూ ఇలానే.. !

టీడీపీ కూటమి ప్రభుత్వం చొరవతో.. ఆ మధ్య కాలంలో అన్నవరం దేవస్థానంలో అన్నదాన భవనం, క్యూ కాంప్లెక్స్, రిటైనింగ్ వాల్‌తో పాటు మరికొన్ని పనులు చేపట్టేందుకు కేంద్రం అనుమతిచ్చింది. ప్రసాద్ స్కీమ్‌లో భాగంగా రూ.20 కోట్లతో వీటి నిర్మాణం చేపట్టేందుకు అధికారులు సిద్ధమయ్యారు. దీనికి కూడా ఏపీటీడీసీ అధికారులు నాలుగుసార్లు టెండర్లు పిలిచారు. మంచి గుర్తింపు, అర్హతగల ఆరు కంపెనీలు ముందుకు వచ్చినా.. అధికారులు ఆయా కంపెనీల యజమానులందరికీ ఏపీటీడీసీ కార్యాలయం నుంచి మంత్రి పేరుతో ఫోన్లు చేసి తప్పించారు. చివరికి అధికారులు తాము అనుకున్న కంపెనీకే టెండరు కట్టబెట్టారు. ఇప్పుడు సింహాచలం సాఫ్ట్‌వేర్ టెండర్ల విషయంలోనూ.. ఏపీటీడీసీ అధికారులు మంత్రి పేరు చెప్పి అర్హత ఉన్న కంపెనీలను తప్పించాలని విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. వాస్తవానికి సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన టెండర్లల్లో పాల్గొనాలంటే కనీసం రూ.6 కోట్లపైన టర్నోవర్ చూపించాలి. అధికారులు సహకరిస్తున్న కంపెనీకి రూ.50 లక్షల టర్నోవర్ కూడా లేదు. పైగా గతంలో ఇలాంటి సాఫ్ట్‌వేర్‌ను నిర్వహించిన అనుభవం కూడా లేదు. అయినా మిగిలిన కంపెనీలను పక్కకు తప్పించి, సదరు కంపెనీకి అప్పగించాలని గట్టి ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పుకొంటున్నారు!.

'క్వాలిటీ తనిఖీల' టెండరుదీ అదే తీరు!

ఏపీటీడీసీ ఇంజనీరింగ్ విభాగంలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. అన్ని సివిల్ వర్కులనూ ఉన్న తక్కువ మంది సిబ్బందితో పర్యవేక్షణ చేయడం కష్టంగా మారింది. దీంతో క్వాలిటీ తనిఖీల వరకూ ప్రయివేటు కంపెనీతో చేయించాలని నిర్ణయించారు. ఇందుకోసం ఏడాదికి దాదాపు రూ.3 కోట్లు వ్యయం చేయాలని నిర్ణయించారు. ఇందుకు టెండర్ల ప్రక్రియ ద్వారా ప్రయివేటు కంపెనీని ఎంపిక చేయాలని నిర్ణయించారు. ఈ టెండర్ ప్రక్రియను కూడా అడ్డగోలుగా చేస్తున్నారు. ముందుగానే ఒక కంపెనీతో బేరాలు కుదుర్చుకుని, టెండర్ ప్రక్రియను ఇష్టారాజ్యాంగా నిర్వహిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి టెండర్ ప్రక్రియలోనూ ఎందుకింత గందరగోళం చేస్తున్నారన్న దానిపై ప్రభుత్వం దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది.

సిక్కోలు తీరానికి 13 మంది బంగ్లాదేశీయులు

- స్థానిక మత్స్యకారులు గుర్తించి పోలీసులకు సమాచారం
- కళింగపట్నం మెరైన్‌స్టేషన్‌కు తరలింపు

ఎచ్చెర్ల, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం బడివానిపేట పంచాయతీ మూసవానిపేట సముద్ర తీరానికి బంగ్లాదేశ్‌కు చెందిన 13 మంది మత్స్యకారులు ఆదివారం చేరారు. చేపలవేటకు వచ్చిన వారు సముద్రంలో వాతావరణం అనుకూలించకపోవడం, బోటు పాడైపోవడంతో దారి తప్పి ఇక్కడకు చేరినట్టు మెరైన్, పోలీసులు గుర్తించారు. మూసవానిపేట తీరం వద్ద సముద్రంలో బోటు లంగరు వేసి ఉండిపోయారు.



బంగ్లాదేశ్‌కు చెందిన మత్స్యకారులు

వీరిని ఆదివారం మధ్యాహ్నం స్థానిక మత్స్యకారులు గమనించి స్థానిక, మెరైన్ పోలీసు స్టేషన్‌కు సమాచారం అందజేశారు. కళింగపట్నం మెరైన్ సీఐ బి.ప్రసాదరావు, ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్ ఎస్ఐ జి.లక్ష్మణరావు, సిబ్బంది సముద్ర తీరానికి చేరుకుని మూడు బోట్ల సాయంతో సముద్రంలోనికి వెళ్లి వారిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. ఆ మత్స్యకారుల వేషధారణ, భాష ఆధారంగా వారంతా బంగ్లాదేశీయులుగా గుర్తించారు. స్థానిక మత్స్యకారులు, పోలీసులు వారితో మాట్లాడేందుకు ప్రయత్నించినప్పటికీ కొద్దిరోజులుగా ఆహారం లేకపోవడం, భయంతో వివరాలు చెప్పేందుకు ఇబ్బంది పడ్డారు. వీరికి స్థానిక మత్స్యకారులు ఆహారం అందించారు. అనంతరం కళింగపట్నం మెరైన్ స్టేషన్‌కు తరలించారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఇక్కడికి చేరిన బంగ్లాదేశీయులపై కేసు నమోదు చేస్తున్నట్టు మెరైన్ సీఐ ప్రసాదరావు తెలిపారు.

- 'శ్రీభాగ్య' అతిథిగృహం





అతిథిగృహాన్ని ప్రారంభిస్తున్న తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి..చిత్రంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, దాత ఏజే శేఖర్

తిరుమలలో 'శ్రీభాగ్య' అతిథిగృహం ప్రారంభం

- రూ.25 కోట్లతో 13 గదులతో నిర్మాణం

తిరుమల, నవంబరు30(ఆంధ్రజ్యోతి): తిరుమలలో రూ.25 కోట్లతో నిర్మించిన 'శ్రీభాగ్య' అతిథిగృహాన్ని ఆదివారం తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి ప్రారంభించారు. టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు, మాజీ ఎల్ఏసీ చెన్నై చైర్మన్ ఏజే శేఖర్ ఈ అతిథిగృహాన్ని నిర్మించారు. అత్యంత నాణ్యమైన కొయ్యతో తయారు చేసిన ఫర్నిచర్, తలుపులు, కిటికీలతో 13 గదులను నిర్మించారు. తమిళనాడు గవర్నర్ రవి అతిథిగృహాన్ని పరిశీలించారు. అలాగే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ కూడా అతిథిగృహాన్ని సందర్శించి నిర్మాణాన్ని పరిశీలించారు. త్వరలోనే ఈ అతిథిగృహం భక్తులకు అందుబాటులోకి రానుంది.

ఆరోగ్య వరప్రసాదిని స్కీంకు రూ.50 లక్షల విరాళం

తిరుమల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): టీటీడీ బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని పథకానికి ఆదివారం రూ.50 లక్షలు విరాళంగా అందింది. ముంబైకు చెందిన జీన్ అండ్ బొమ్మాన్జీ దుబాష్ ఛారిటీ ట్రస్టు సీఎఫ్‌వో చంద్రశేఖర్ కృష్ణమూర్తి ఆలయంలో విరాళం డీడీని టీటీడీ అధికారులకు అందజేశారు.

ఫిబ్రవరి 28, మార్చి 1 తేదీల్లో మూడో ప్రపంచ తెలుగు మహాసభలు

అమలాపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మూడో ప్రపంచ తెలుగు మహాసభలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలోని కిమ్స్ ప్రాంగణం వేదిక కానుంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 28, మార్చి 1వ తేదీల్లో జరగనున్న తెలుగు మహాసభలకు సంబంధించి కిమ్స్ కళాశాలలో ఆదివారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిమ్స్ విద్యా సంస్థల చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు మాట్లాడుతూ 10వేల మందితో ఫిబ్రవరి 28న పట్టణంలో శోభాయాత్ర జరుగుతుందని, వెయ్యి మందికిపైగా కవులతో సమ్మేళనం నిర్వహిస్తామని తెలిపారు. వివిధ రాష్ట్రాల గవర్నర్లు, ముఖ్యమంత్రులు, డిప్యూటీ సీఎంలు మహాసభల్లో పాల్గొంటారని తెలిపారు.

బ్లేడు లోపలే ఉంచి సర్జరీ చేసిన డాక్టర్ సస్పెండ్

అమరావతి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తుని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సర్జికల్ బ్లేడును లోపలే ఉంచి సర్జరీ చేసిన డాక్టర్ సత్యసాగర్, స్టాఫ్ నర్సు పద్మావతిని సస్పెండ్ చేసినట్లు వైద్య ఆరోగ్యశాఖ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు ఈ చర్య తీసుకున్నట్లు వెల్లడించింది. రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ యువకుడు గతంలో సర్జరీ ద్వారా స్టీల్ రాడ్డు వేయించుకున్నాడు. నొప్పి ఎక్కువగా ఉందని ఇటీవల తుని ఏరియా ఆసుపత్రికి రాగా, ఆర్థోపెడిక్ డాక్టర్ సత్యసాగర్ ఈనెల 27న మళ్లీ సర్జరీ చేసి లోపల ఉన్న స్క్రూను తొలగించారు. అయితే ఆ సమయంలో ఉపయోగించిన సర్జికల్ బ్లేడును లోపలే వదిలేశారు. నొప్పి ఇంకా పెరగడంతో ఎక్స్‌రే తీయించగా సర్జికల్ బ్లేడు లోపలే ఉందని తేలింది. బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించిన వైద్యుడిపై మంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు. దీనిపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

ఆప్టా అధ్యక్షుడిగా కాకి ప్రకాశ్‌రావు

అమరావతి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఉపాధ్యాయుల సంఘం(ఆప్టా) రాష్ట్ర అధ్యక్షుడిగా కాకి ప్రకాశ్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ సంఘం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. ఇప్పటివరకూ అధ్యక్షునిగా కొనసాగిన ఏజీఎస్ గణపతిరావు ఉద్యోగ విరమణ చేయడంతో ప్రధాన కార్యదర్శిగా ఉన్న ప్రకాశ్‌రావును అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు వివరించింది. నూతన ప్రధాన కార్యదర్శిగా కృష్ణా జిల్లాకు చెందిన ఎంజీ మహిడిని ఎన్నికయ్యారని పేర్కొంది.

ఎన్ఎంఎంఎస్ నమూనా పరీక్షకు 30 వేల మంది

అమరావతి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్కూల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ నమూనా పరీక్షకు 30వేల మంది హాజరయ్యారని ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చింతల సుబ్బారావు, పి.నరోత్తమరెడ్డి తెలిపారు. 45 కేంద్రాల్లో పరీక్ష జరిగిందన్నారు. గత ఎనిమిదేళ్లుగా విద్యార్థులకు ఉచితంగా ఈ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు.

పరకామణి కేసులో నిందితులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి: సీపీఐ నారాయణ

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి పరకామణి కేసులో నిందితులు ఎంతటి వారైనా క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని సీపీఐ జాతీయ కంట్రోల్ మిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ డిమాండు చేశారు. ఈ కేసులో అవినీతి బాగోతాన్ని బట్టబయలు చేయాలన్నారు. తిరుపతిలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కోట్లాది మంది భక్తుల విశ్వాసంతో శ్రీవారికి సమర్పించే కానుకల్లో పెద్ద స్థాయిలో అవినీతి జరగడం తీవ్ర విచారకరమన్నారు. టీటీడీలో 30 ఏళ్లుగా సేవలందించిన ఉద్యోగి రవికుమార్ రూ.14 కోట్ల అవినీతికి పాల్పడటం వెనుక పెద్దల హస్తం ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. ఈ చోరీపై ఫిర్యాదు చేసిన అప్పటి ఏవీఎస్వో సతీష్‌కుమార్ మృతిపై అనుమానాలు ఉన్నాయన్నారు. ఈ మృతి వెనుక సూత్రధారులను బయటపెట్టి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండు చేశారు.

ఇచ్చిన హామీలే కాదు.. 17నెలల్లో ఎంతో చేశాం

- మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి

అమరావతి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జగన్‌లా ఇచ్చిన హామీలను తాము ఎగ్గొట్టి ప్రజలను మోసం చేయలేదని, రాజకీయాలకు అతీతంగా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇచ్చిన హామీలే కాకుండా, హామీ ఇవ్వని వాటిని కూడా ఈ 17నెలల్లో అమలు చేశామని ఆయన పేర్కొన్నారు. రాయితీలు, ప్రోత్సాహకాలు ఇవ్వకుండా రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు ఎలా వస్తాయని ప్రశ్నించారు. విశాఖకు 40 కి.మీ దూరం కూడా లేని భోగాపురంలో ఎయిర్‌పోర్ట్ ఎందుకని ఆనాడు జగన్ మాట్లాడిన మాటల్ని బొత్స సత్యనారాయణ మరిచిపోయారా? అని ప్రశ్నించారు. భూములివ్వొద్దనిన రైతుల్ని రెచ్చగొట్టడం తప్ప భోగాపురం ఎయిర్‌పోర్టుకి జగన్ చేసిందేమీ లేదని విమర్శించారు.

ఏపీ కో-ఆపరేటివ్ సర్వీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

విజయవాడ (గాంధీనగర్), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఏపీ కో-ఆపరేటివ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా టీవీ ఫణి పేర్రాజు, జి.సురేష్ నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం రాష్ట్ర మహాసభ విజయవాడలోని రెవెన్యూ భవన్‌లో ఆదివారం జరిగింది. కోశాధికారిగా కోటేశ్వరరావు, సహాధ్యక్షుడిగా పి.నాగ రమణయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కె.రవి శంకర్ తదితరులతో నూతన కార్యవర్గం ఎన్నికైంది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను అభినందించారు.

అన్ని జిల్లా కేంద్రాల్లో వాజపేయి కాంస్య విగ్రహాలు

- కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ



వాజపేయి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి



వాజపేయి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, ఎంపీ హరీష్‌మాధుర్

మండపేట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): దేశ మాజీ ప్రధాని, భారతరత్న అటల్‌బిహారీ వాజపేయి శత జయంతి వేడుకలను పురస్కరించుకుని రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో ఆయన కాంస్య విగ్రహాలను ఏర్పాటు చేస్తామని కేంద్ర పరిశ్రమల శాఖా మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట లో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కె.సాయిరామ్ నేతృత్వంలో బీజేపీ శ్రేణులు ఏర్పాటు చేసిన వాజపేయి విగ్రహాన్ని తొలుత బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ మాధవ్, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, మండపేట, అనపర్తి ఎమ్మెల్యేలు వేగుళ్ల జోగేశ్వరరావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ వాజపేయి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంత్రి మాట్లాడుతూ దేశాభివృద్ధికి పరితపించిన వాజపేయి నేటి తరాలకు స్ఫూర్తి ప్రదాత అని అన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు ఏపీఐడీసీ రాష్ట్ర చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ, బీజేపీ జాతీయ కౌన్సిల్‌సభ్యులు వేటుకూరి సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.



పద్మశ్రీ కొలకలూరి ఇనాక్‌కు గురజాడ విశిష్ట పురస్కారం అందిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ తదితరులు

సమాజాన్ని మేల్కొలిపిన గురజాడ రచనలు

- హైకోర్టు సీనియర్ జడ్జి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్
- ఆచార్య ఇనాక్‌కు గురజాడ పురస్కారం ప్రదానం

విజయనగరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మహాకవి గురజాడ ఒక శక్తి అని, ఆయన రచనలు, గేయాలు సమాజాన్ని మేల్కొలిపాయని హైకోర్టు సీనియర్ జడ్జి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ అన్నారు. గురజాడ అప్పారావు వర్ధంతి సందర్భంగా విజయనగరంలో ఆదివారం పీవీజీ రాజు క్షత్రియ పరిషత్ కల్యాణ మండపంలో గురజాడ సాహితీ చైతన్యోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ హాజరై మాట్లాడారు. గురజాడ రాసిన గేయాలు, పద్యాలు చదివి ఎంతో మంది మహానుభావులుగా ఎదిగారని కొనియాడారు. ఇటువంటి మహనీయుల స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆచరించి సమాజంలో అత్యున్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. అనంతరం ప్రముఖ సాహితీవేత్త, పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్‌కు గురజాడ విశిష్ట పురస్కారాన్ని ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా న్యాయాధికారి బబిత, కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి, ఎస్పీ దామోదర్, గురజాడ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వెంకటేశ్వరరావు, కాపుగంటి ప్రకాష్, ఎ.గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరులో వైద్య విద్యార్థి ఆత్మహత్య

- కళాశాల వసతిగృహంలో ఘటన



నాగమహేశ్వర్

నెల్లూరు(క్రైం), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు ఏసీఎస్ఆర్ గవర్నమెంట్ మెడికల్ కళాశాల వసతిగృహంలో వైద్యవిద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. కర్నూలు జిల్లా కోవెలకుంట్ల మండలం కలుగోట్ల గ్రామానికి చెందిన ఆర్.నాగమహేశ్వర్(21) నెల్లూరు ఏసీఎస్ఆర్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ తృతీయ సంవత్సరం చదువుతూ కళాశాల వసతి గృహంలో ఉంటున్నాడు. అతనితోపాటు అదే గదిలో ముగ్గురు విద్యార్థులు ఉంటున్నారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో అతను గదిలో ఉండగా సహచర విద్యార్థులు ముగ్గురు బయటకు వెళ్లారు. సాయంత్రం ఇద్దరు గదికి వచ్చి తలుపులు తట్టగా లోపల నుంచి ఎలాంటి అలికిడి లేదు. దీంతో అక్కడున్న వారితో కలిసి తలుపులు బలవంతంగా తెరిచారు. గదిలో నాగమహేశ్వర్ ఫ్యానుకు లుంగీతో ఉరివేసుకుని వేలాడుతూ ఉన్నాడు. విద్యార్థులు కళాశాల వైస్ ప్రిన్సిపల్‌కు సమాచారం అందించారు. ఆయన దర్గామిట్ట పోలీసులకు తెలియజేయడంతో ఇన్‌స్పెక్టర్ బీ. కళ్యాణరాజు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడు ఎవరితో మాట్లాడే వాడు కాదని, ఇటీవల ఆరోగ్య సమస్యలతో వైద్యశాలలో చూపించుకొని చికిత్స పొందుతున్నాడని తోటి విద్యార్థులు తెలిపారు. పోలీసులు విద్యార్థి మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు.

ఏపీలో వన్నియకుల క్షత్రియ, అగ్నికుల క్షత్రియ వర్గాలకు 6 % రిజర్వేషన్లు కల్పించాలి

- చంద్రబాబుకు పీఎంకే విజ్ఞప్తి

చెన్నై, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో విద్య, ఉపాధిలో అత్యంత వెనుకబడిన వన్నియకుల క్షత్రియ, అగ్నికుల క్షత్రియ వర్గాలకు ఆరు శాతం ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని 'పాట్టాలి మక్కల్ కట్చి' (పీఎంకే) ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు పీఎంకే అధ్యక్షులు డాక్టర్ అన్బుమణి ఆదివారం చంద్రబాబుకు లేఖ రాశారు. ఏపీలో గణనీయమైన సంఖ్యలో ఉన్న వన్నియ కుల, అగ్నికుల క్షత్రియ వర్గాలకు సామాజిక న్యాయం కల్పించాల్సిన అవసరముందని ఆ లేఖలో అభిప్రాయపడ్డారు.

దంతేవాడలో 37 మంది మావోయిస్టుల లొంగుబాటు

- వారిలో 12 మంది మహిళలు
- 27 మందిపై రూ.65 లక్షల రివార్డు
- 24 నెలల్లో లొంగిపోయిన 2200 మంది నక్సల్స్

న్యూఢిల్లీ/ రాయిపూర్/ దంతేవాడ/ చర్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని దంతేవాడ జిల్లాలో 37 మంది మావోయిస్టులు ఆదివారం లొంగిపోయారు. వారిలో 12 మంది మహిళలున్నారు. లొంగిపోయిన వారిలో 27 మందిపై రూ.65 లక్షల రివార్డు ఉంది. ఈ సందర్భంగా జరిగిన మీడియా సమావేశంలో దంతేవాడ ఎస్పీ గౌరవ్ రాయి మాట్లాడుతూ లొంగిపోయిన వారిలో మిలీషియా, పార్టీ సభ్యులున్నారన్నారు. ఆదివారం లొంగిపోయిన వారిలో కుమాలి అలియాస్ అనిత మండవి, గీత అలియాస్ లక్ష్మి మడకం, రంజన్ అలియాస్ సోమ మాండవి, భీమ అలియాస్ జహజ్ కల్ములలో ఒక్కొక్కరిపై రూ.8 లక్షల రివార్డు ఉందన్నారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం చేపట్టిన 'పూన మార్గెం (పునరావాసం నుంచి సామాజిక పునః సమ్మేళనం)' కార్యక్రమంలో భాగంగా వీరంతా లొంగిపోయారన్నారు. మావోయిస్టుల లొంగుబాటులో బస్తర్ ప్రాంతం మావోయిస్టుల రహిత ప్రాంతంగా మారుతోందని గౌరవ్ రాయి తెలిపారు. ప్రభుత్వ పునరావాస పథకం కింద లొంగిపోయిన మావోయిస్టులకు తక్షణ సాయంగా రూ.50 వేల నగదును అందిస్తారు. వ్యవసాయ భూమి కేటాయింపు, నైపుణ్య అభివృద్ధిలో శిక్షణనిస్తారని చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల చొరవతో రాష్ట్ర వ్యాప్తంగా గత 24 నెలల్లో అగ్ర నేతలు సహా 2200 మందికి పైగా మావోయిస్టులు జన జీవన స్రవంతిలో కలిశారని వెల్లడించారు. గత 20 నెలల్లో దంతేవాడ జిల్లాలోనే 508 మందికి పైగా మావోయిస్టులు లొంగిపోగా, వారిలో 165 మందిపై రివార్డు ఉందన్నారు.



లొంగిపోయిన మావోయిస్టులు

అబూజ్‌మడ్‌లో ఐటీబీపీ వ్యూహాత్మక బేస్

మరోవైపు, వచ్చే మార్చి నాటికి వామపక్ష తీవ్రవాదాన్ని అంతం చేయాలని లక్ష్యం దిశగా కేంద్రం వడివడిగా సమగ్ర ప్రణాళికతో సాగుతోంది. మావోయిస్టులకు పెట్టని కోటగా ఉన్న అభూజ్‌మడ్‌పై పట్టు సాధించిన ఐటీబీపీ జవాన్లు అదే ప్రాంతంలో నారాయణపూర్ జిల్లా కేంద్రానికి 140 కి.మీ దూరంలోని లంక గ్రామంలో 44వ బెటాలియన్ ఆపరేషనల్ బేస్‌ను నవంబరు 28న ఏర్పాటు చేశారు. తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని నక్సల్స్‌కు కారిడార్‌గా మారిన అబూజ్‌మడ్ ప్రాంతంతో లంకెను విడగొట్టడమే దీని లక్ష్యం. ఛత్తీస్‌గఢ్-మహరాష్ట్ర సరిహద్దుకు 3 కి.మీ దూరంలో ఏర్పాటు చేసిన లంక బేస్ ద్వారా మహరాష్ట్రలోని గడ్చిరోలి, బీజాపూర్ జిల్లాలోని బెద్రె ప్రాంతంలోని నక్సల్స్ కదలికలను, వారికి సరుకుల సరఫరాను నిరోధించనున్నారు. 3 నెలల్లో ఐటీబీపీ ఏర్పాటు చేసిన 9వ బెటాలియన్ ఇది. లంకతోపాటు ఎడ్జుమ్, ఇద్వాయ, అడెర్, కుడ్మెల్, జటుల్గార్, ధోబె, దొది మక్కా, పద్మెట ప్రాంతాల్లోనూ ఐటీబీపీ క్యాంపులున్నాయి.

పోలీసు వలయంలో.. మావోయిస్టు నేత చెల్లూరు నారాయణరావు..?



చెల్లూరు నారాయణరావు

వజ్రపుకొత్తూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మరో మావోయిస్టు నేత పోలీసు వలయంలో చిక్కుకున్నట్టు తెలిసింది. శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం బాతుపురం గ్రామానికి చెందిన మావోయిస్టు చెల్లూరు నారాయణరావు అలియాస్ సురేశ్ పోలీసుల వలయంలో ఉన్నట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో మావోయిస్టు పార్టీ ఏవోబీ కార్యదర్శిగా చెల్లూరు నారాయణరావు వ్యవహరిస్తున్నారు. ఈయనపై రూ.20 లక్షల రివార్డు ఉంది. నారాయణరావు 1989లో అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్లు కుటుంబ సభ్యులు, గ్రామస్థులు చెప్పారు. ఇదే గ్రామానికి చెందిన మెట్టూరు జోగారావు అలియాస్ టెక్‌శంకర్ ఇటీవల ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన విషయం తెలిందే. అప్పటి నుంచి నారాయణరావు ఆచూకీ కోసం ఇంటెలిజెన్స్ పోలీసులు ఆరా తీస్తున్నారు. ఆంధ్రా-ఒడిశా సరిహద్దు అటవీ ప్రాంతంలో కేంద్ర బలగాల చక్రబంధంలో నారాయణరావు ఉన్నట్లు తెలుస్తోంది. శనివారం రాత్రి, ఆదివారం ఉదయం పోలీసులు బాతుపురం వచ్చి గ్రామపెద్దలు, నారాయణరావు కుటుంబ సభ్యులతోనూ మాట్లాడారు. నారాయణరావు లొంగుబాటుకు సహకరించాలని కోరినట్టు తెలిసింది.

దేవ్‌జీని కోర్టులో హాజరు పరచాలి

- ఏపీ డిప్యూటీ సీఎంకు దేవ్‌జీ తమ్ముడి కుమార్తె లేఖ

కోరుట్ల, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శి దేవ్‌జీ అలియాస్ తిప్పిరి తిరుపతిని కోర్టులో హాజరు పరచాలంటూ ఆయన తమ్ముడి కుమార్తె సుమ ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణకు ఎక్స్‌లో లేఖను పోస్టు చేశారు. ఆ లేఖలో వివరాలు... 'మా పెద్దనాన్న తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ మావోయిస్టు పార్టీ చీఫ్‌గా ఉన్నారు. ఇటీవల ఆయన పోలీసుల కస్టడీలో ఉన్నారనే వార్తలు వైరల్ అవుతున్నాయి. ఈ వార్తలు నిజామా? కాదా? అనేది మా కుటుంబానికి స్పష్టంగా తెలియడం లేదు. కానీ ప్రతి రోజు వినిపించే ఈ సమాచారం మా కుటుంబాన్ని తీవ్ర కలిచివేతకు గురి చేస్తోంది. ఒకవేళ ఈ వార్త లు నిజమే అయితే దయచేసి ఆయనను కోర్టులో హాజరుపరిచేలా చూడాలి లేదా లొంగిపోవడానికి అవకాశం ఇవ్వాలని మా కుటుంబం తరఫున మిమ్మ ల్ని వేడుకుంటున్నా. 40 ఏళ్లుగా మా కుటుంబం ఆయన కోసం ఎదురు చూడని రోజు లేదు. సర్ మీపై మాకున్న నమ్మకం చాలా పెద్దది. ఒక అభిమానిగా, జనసేన పార్టీ కార్యకర్తగా మిమ్మల్ని చేతులెత్తి వేడుకుంటున్నాం. మా కుటుంబానికి మీరు తప్పకుండా న్యాయం చేస్తారని విశ్వసిస్తున్నాం.' ఈలేఖ సోషల్ మీడియాలో వైరల్ అయింది.



కవిత్వం ముందు బతుకు బోనమెత్తిన కవి

"నా విన్నవి కన్నవి విన్నవించగా మాటలకై వెదుకాడగబోతే అవి..." - (శ్రీశ్రీ 'కవితా ఓ కవితా' నుంచి)

1.


ఈ విశ్వం ఒక బిందువు నుండి పెను విస్ఫోటనంతో (big bang) ఉద్భవించిందని నేటి శాస్త్రవేత్తల నమ్మకం. కొంత మంది శాస్త్రవేత్తలు అనూహ్యంగా విస్తరిస్తోన్న ఈ విశ్వం మళ్ళీ సంకోచించి బిందువులోకే నిష్క్రమిస్తుందని కూడా నమ్ముతారు. సిద్ధార్థ గారి కొత్త కవితా సంపుటి 'మల్లెల తీర్థం – మహా ఖననం' చదవగానే భావావేశంతో ఉక్కిరిబిక్కిరయి కొన్నాళ్ళకు నిమ్మళించి ఆలోచించగా నాకు ఈ విషయమే జ్ఞప్తికి వచ్చింది. ఎందుకంటే జీవితాన్ని ఆవిష్కరించుకోవడం వ్యాకోచం వంటిదయితే, ఆవిష్కృతానంతర మానసికస్థితి సంకోచం వంటిది.

ఈ సంపుటిలో సిద్ధార్థ జీవంతమైన ఆకుపచ్చని భావాలు సిద్ధార్థ జీవంతమైన తెలంగాణా మాండలికంతో పాలూతేనెల వలె కలిసిపోయాయి. కవి visceral ప్రతీకల బలిమీ, అంత రంగపు నైర్మల్యమూ దేహాత్మల్లాగ కలిసి మనగలగడమొక wonder! ఎప్పుడో ప్రాచీనకాలంలోనే దేవతలైన అమ్మ తల్లులు అమ్మలై తల్లులై ఈ సంపుటిలో పునర్దర్శనమిచ్చి మన వారౌతారు. పాఠకులు తాము మెడ పైకెత్తి అంతెత్తు చూస్తేనే తప్ప కనిపించని archetypes ఈ స్త్రీలు, అలాగే పక్కకు తిరిగి చూసినా గతుక్కుమనిపించే స్వబాంధవులు. ఈ సంపుటి టైటిల్, "మల్లెల తీర్థం-మహాఖననం" అనడంలో Freudian దేవతాద్వయి – Eros & Thanatos – కదిలించిన శక్తులు పాఠకుల మనసుల్లో ఛాయలవలే జంటనృత్యాలు చేస్తూ వర్త మానం మొదలుకొని భవిష్యత్పథం మీదుగా సాగిపోతాయి. ఇది కవి మనకు అందిచ్చిన చేయూత.

సిద్ధార్థ గొంతు అనన్యం. ఏ సమకాలీన కవీ ఇటువంటి డిక్షన్‌తో ఇటువంటి వీధి గాలిలో తేలుతూన్న nuancesని ఒడిసిపట్టుకొని కవిత్వంగా మలచలేదు. జీవన వాస్తవికతను ఛిద్రశకలాల్లో ఆవిష్కరించిన కవులు చాలామందే ఉన్నారు గానీ సిద్ధార్థలా ethnic pluralismను గుర్తిస్తూ గుర్తింపు నిస్తూ పదపదానా గుంపు అస్తిత్వవేదనను ప్రశ్నలతో వెతుక్కుని వాస్తవికతను వడబోసి అందీ అందని భాషను దాని పరిమితుల్ని పునర్వచించిన వారు మనకు లేరు. ఈ సంపుటిలో ఆధునికానంతరవాదులకు కావలసినంత ఉంది – Self-reflexivity, fragmentation సరైన మోతాదులో కనిపిస్తాయి. Intertextuality తళుక్కుమంటుంది, కొన్ని స్వరాల్ని వినిపిస్తుంది. సిద్ధార్థగారు వాదాల వెనుకా ఈ post-modern మాయాజలం వెనుకా నక్కి దాక్కోలేదు. జీవితాన్ని గౌరవిస్తూ బతుకు బోనాన్నే కవిత్వం ముందు ఎత్తేరు.

2.

సిద్ధార్థ కంటి ముందే నగరం మహానగరమయింది. మహా నగరం గల్లీల్ని, పల్లెల్ని మింగేసి భూమిని తప్ప దేనినీ జీర్ణించుకోలేక మనుషుల్ని విసర్జించేసింది. చెట్టూ చేమా చెరువూ దొరువూ మాయమయ్యాయి. నగరం గర్భంలోనే మనిషి మర మనిషయ్యాడు. ఈ dehumanizing urbanizationలో "కోకిలలకు వనాల్లేక", "పిట్టలకు గూడు లేక", "కౌగిలికి దేహమూ లేక" బాల్యాన్ని గడిపిన కవి తన చుట్టూ ఉన్న తనవారిని చూస్తూ తనను చూస్కుంటూ ఆక్రందిస్తూ ఏరుకున్న existential scraps ఈ కవిత్వమని తనే చెప్పుకున్నారు, స్వీయలిఖితమైన మున్నుడిలో. అస్తిత్వం అంటూ ఒకటుందా అనే సంశయమూ కవికి కలిగినట్టుంది. దాన్ని గురించి ఏ తర్జన భర్జనలు పడ్డారో గాని అదే మున్నుడిలో "అమ్మ గుండె చప్పుడును పిల్ల మాయి నుంచి అతికించి తెచ్చుకున్న నీ సోయి ఎప్పటికీ నీది కాదు" అన్న కవి రచనల్లో visceral ప్రతీకలు ('మాయి' అంటే placenta) మిక్కిలిగా కనిపించడం మానవాళిది ఒకే అస్తిత్వమనీనూ వ్యక్తులు తమ తమ time & spaceలో ఒకే తారను మీటుతూ అస్తిత్వచింతననూ అన్వేషణనూ అలా కొనసాగించాల్సిందే అన్న శాపం వంటి వరాన్ని తోడు తీసుకొని పిడికెడు బూడిదయ్యేదాకా బతకాలి అనీనూ చెప్పినట్టే. ఈ స్పృహ ఈ సంపుటిలో పదే పదే పాఠకులను ఆవహించేదే. "నువ్వు మాత్రం చెప్పకుండానే ఒక రాత విప్పినవ్/ కొసవరకల్ల కర్మము తప్పదని/ చేసిన తప్పులు గోశిలవెట్టుకుని/తోకవీకాలెవ్వడైనా... అని" అన్న స్పృహ, "You are condemned to exist", అన్న దేవత దీవెన.





సిద్ధార్థ గొంతు అనన్యం. ఏ సమకాలీన కవీ ఇటువంటి డిక్షన్‌తో ఇటువంటి వీధి గాలిలో తేలుతూన్న nuances ని ఒడిసిపట్టుకొని కవిత్వంగా మలచలేదు.

మహాఖననం అన్నమాట కేవలం మృత్యువుకే సంకేతం కాదు, తవ్విపారెయ్యడం అర్బన్ అమానవీయ ఆక్రమణ. "నీ వూరు లేదు. కాగితాలలో ఉరికొయ్యకు వేలాడుతూంది", లీగల్ కాగితాలే ఉరికొయ్యలు. "మోసపు వినయం మోసపు కారుణ్యం మోసపు లంజడితనం.../సినిమాను తిని సినిమాను తాగి సినిమాను షిట్ చెయ్యడం... కరెన్సీ రతి...", ఇదీ మహానగరంలో ఇవాళ్టి రియాలిటీ. "మా ఊరికి చేరుకోలేనిప్పుడు దారి పరాయిదయ్యింది", ఇది కవి పరాయీకరణ. ఈ అర్బన్ భూతానికి మంత్రోపచారంలా సాగే ప్రచారాల బాకా ఇలా ఉంటుంది, "ప్రచారమంతా/నగరాన్ని కరిచి/ రేబిస్ సోకి.. బతుకంతా పిచ్చెక్కి పాడుతుంది/ మీడియా... దాండియా ఆడుతుంది/ ఎవ్వని సిన్మా వానికి/ ఎవ్వని పంకా వానికి/ పగలగొట్టే.. తల్లి.. పగలగొట్టు/ నన్ను నీ కడుపులోకి మళ్ళీ తీసుకొని/ తగలబెట్టు", అని అన్నప్పుడు ఎందుకో సీత రాముడ్ని విడిచి భూమాత గర్భంలోకే వెళ్ళిపోయిన వైనం గుర్తొస్తుంది. "కడియాలకు పట్నం పాము సుట్టుకుంది/ బొట్టునూ బట్టనూ కాటేసింది/ ఏం బతుకయ్యిందిరా కొడకా/ మనమంతా బతికే ఉన్నామా/నీ దర్మంగ జెప్పు/", అన్నదొక తల్లి కవితో, మహానగరంలో బతుకీడ్వలేక.

"చిన్న దెబ్బకే నెత్తొరోడే ప్రతీకను.", అనుకున్న కవికి చుట్టూ ఉన్న తనవారే సగం బలం, దెబ్బ తగుల్తే పరుగెత్తి వచ్చి మందు వేసే దిక్కూ మొక్కూ వారే. "కష్టాలను పాములై పెంచుకుని/ కాటేయించుకుంటావ్/ విషమే ఎక్కడేందే నీకు/ మత్తెక్కించే గాయం నీ పొయెమ్", విషాదానికి ఉన్నది వికర్షణ కాదు, ఏదో ఆకర్షణే. దీన్ని కవితీకరించడం కవుల బలహీనతో బలమో గానీ, ఏ కవీ విషాదాన్ని ప్రస్తావించకుండా ఉండలేడు. "నీలాంటోడు ఒకడో.. ఎవడో ఉంటాడు/కొన్ని దినాలల్ల/ వాడూ పోతాడు". ఇది కవిలోని మృత్యునిర్లిప్తతా లేక, genetic continuity ఉన్నదనే భరోసానా? మృత్యువు ఎలాగూ తప్పదు కనుక మృత్యుస్పృహను మాలిమి చేసుకోవడమే మంచిది. "ఏయ్... ఆగాగు నిన్నే.../ వెళ్ళకు... ముఖం తిప్పుకోకు/ కిటికీని సగం మాత్రమైనా తెరువ్/ బార్లా తెరవడం... చావు/ అది అందరిదీ.../ అంతిమంగా అందరమూ బార్లా తెరుచుకుని/ అమ్మ భూమిపై/ చేతులూ కాళ్ళు విరుచుకుని కూలిపోవాల్సిందే...", ఇది బతికినన్నాళ్ళూ ఉండాల్సిన జీవత్-స్పృహ. "నేను చావును చీమనై సమీపిస్తాను/ నా పాత గల్లీల్లోకి పారిపోతాను/ అది కొసవూపిరి ఊది పంపుతుంది." మనిషి జీవచ్ఛవమై చావకూడదు. చచ్చేందుకూ జీవముంచుకోవాలి. "భూమ్మీద అందరికంటే ఎక్కువ ప్రేమించే/ పుణ్యాత్ముల వరుసలో/ ముందు నేనే ఉంటాను/ ఎవరూ ప్రేమించని శాపగ్రస్తుల/ వరుసలో వెనుక నేనే ఉంటాను.", గుంపు, గుంపు, గుంపు. గుంపే ముందు పుట్టి ఈ కవికి జన్మనిచ్చి ఇతన్ని తమ ప్రతినిధిగా ఇటు పంపింది. "నా లోపల ఒక స్త్రీ దేహముందని తెలుసు", అని జెండర్‌ను జయించినవాడే అనగలిగేది. ఈ కవి మున్నుడిలోనూ కవితల్లోనూ జీన్ మెమొరీల ప్రసక్తీ డీఎన్ఏల ప్రసక్తీ ఉన్నాయి. ఇది మందితో తాదాత్మ్యత. కవి కొన్నేళ్ళకు పెద్దవాడై ఏ బోధివృక్షపు నీడనో ఇలా ఉద్బోధిస్తున్నాడు:

"నా మాటను/ నువ్వు భాషలేకుండా వాక్యం తోడు లేకుండా/ అక్షరంతో కాలయాపన చెయ్యకుండా/ జరుగు/ వెనుదిరుగు/ వొక కాంతి కాలిబాటై పరుచుకుంటుంది/ జీవ ధార కురుస్తుంది/ అక్కడికి పో..పోపో/ వృత్త రాగద్వానంగా నగ్న నిశ్శబ్దంగా/ కనువిప్పని కలింకాయ మొగ్గలాగ/ దాన్లోకి పోయి కూకో.../ నా మాటను/కవిత్వం దొరుకుతుంది." ఎక్కడ కవిత్వం దొరుకుతుందో కవి చెప్పినా, అక్కడికి ఎలా వెళ్ళాలో కవులే స్వయం కృషితో తెలుసుకోవాలి. కవితను రాయడమంటే కవితను చంపెయ్యడమేననీ, అచ్చు వెయ్యడమంటే దానికి సమాధి కట్టడమనీ నమ్మిన అజంతాను ఇక్కడ పాఠకులు తల్చుకుంటారు.

"ఎగిరే సున్నానే నేను/మండే వానముబ్బుని/గంధపు చెదను", కవికి తనను తాను ఎలా నిర్వచించుకున్నా తనివి తీరకపోవడానికి కారణం ఈయన తన గుంపుకి ప్రతినిధి కావడమే.

"తాటిచెట్ల నరాల్లో ప్రవహిస్తున్న ఆదిసూక్తాన్ని", ఈ వాక్యం చదివి పాఠకులు భూతభవిష్యత్కాలాలకున్న మామూలు అర్థాన్ని దాటి ఏ మహర్షి కల్పించిన time warp లోనో వేదమంత్రం వింటారు. ఎంత తియ్యగా ఉంది! అసలా తాటి చెట్టులో కల్లుందా అమృతముందా అని!

పుస్తకం పూర్తిచేశాక మనసులో సిద్ధార్థకి ప్రియమైన ఆడా, మగా, పిల్లా, పీచూ, ఇల్లూ, జాగా, బైరాగీ, పరివ్రాజకులూ – ఇవే కాక అందంగా ముక్కుపుల్లలూ మిగిలిపోతాయి. కవికి ముక్కుపుల్లలంటే ఎంతో ఇష్టమయినట్టుంది. ఎంతైనా నాసాభరణాలు స్త్రీలకు భర్తృవాల్లభ్యసూచకాలు. ఆ అందం ఇలా ఉంటుంది.

"ఆమె కళ్ళు మూసుకుని నిద్రిస్తూంటే/ మెటఫర్‌నై జాగారం చేస్తున్నాను"

"చాలా సార్లు ఆమె దేహాన్ని పుస్తకంగా చదివాను/ వొక మత్తుకు లోనయ్యాను"

3

మనిషి కేంద్రంగా గల్లీల నుంచి మహానగరంలో కాంక్రీట్ జంగల్ వరకూ జీవితాన్ని కవితాత్మకంగా ఆవిష్కరించిన ఈ సంపుటిని కవి సొంత గొంతుతో ఈ కవితలను చదివి పెట్టిన ఆడియోఫైల్స్‌తో పాటుగా మన కళాశాలల్లో విశ్వవిద్యాలయాల్లో పాఠ్యాంశంగా చేస్తే ఆధునిక తెలుగు కవిత ఇంకా బాగా బతుకుతుంది. అప్పుడు విద్యార్థినీవిద్యార్థులు ఇది చదివి ఎవరి విశ్వాన్ని వారు ఆవిష్కరించుకుంటారు. ఎవరి ethnic spiritual centreను వారు కనుక్కుంటారు. అవన్నీ ఒకే బిందువులోకి నిష్క్రమిస్తాయని నేననుకుంటున్నాను.

■ వాసు

✆ 99011 55133

'పచ్చడం' వ్యాస సంపుటి

రాజాం రచయితల వేదిక 11వ వార్షికోత్సవం డిసెంబర్ 7 సా.5 గంటలకు విజయనగరం జిల్లా రాజాంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతుంది. ఈ సందర్భంగా పిల్లా తిరుపతిరావు వ్యాస సంపుటి 'పచ్చడం'ను గోరటి వెంకన్న ఆవిష్కరిస్తారు. అనంతరం గోరటి మాట, పాట ఉంటుంది. అధ్యక్షత గార రంగనాథం.

రాజాం రచయితల వేదిక

'నువ్వు గింజవైతే' కవిత్వ సంపుటి

తెలంగాణ సాహిత్య అకాడమి ప్రతి నెలా ఒకటవ, మూడవ శనివారాల్లో నిర్వహిస్తోన్న 'సాహిత్యవారం' కార్యక్రమంలో భాగంగా హనీఫ్ కవిత్వ సంపుటి 'నువ్వు గింజవైతే' ఆవిష్కరణ సభ డిసెంబరు 6 సా.5గంటలకు రవీంద్రభారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. అధ్యక్షత ఎన్. బాలాచారి, ముఖ్య అతిథి & ఆవిష్కర్త జయధీర్ తిరుమల్ రావు, విశిష్ట అతిథి సంగిశెట్టి శ్రీనివాస్, పరిచయం రూపుమార్ డబ్బీకార్, సమన్వయం ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్.

నామోజు బాలాచారి

పలమనేరు బాలోత్సవం

పలమనేరు బాలోత్సవం డిసెంబర్ 6న జరుగుతుంది. ఇందులో 'తెలుగులోనే మాట్లాడుదాం', 'కథలు చెబుదాం', 'శాస్త్రీయ నృత్యం', 'పద్యాలు చెబుదాం', 'తెలుగు ఉక్త లేఖనం' తదితర 15 రకాల పోటీలు జరుగుతాయి. ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి, స్థానిక శాసనసభ్యులు తదితరులు హాజరవుతారు.

పి. తులసినాథం నాయుడు

సోమవారం 1 డిసెంబరు 2025

వివిధ

vividha@andhrajyothy.com

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

'ఏకాంతం ఒక అతిథి' కవిత్వ సంపుటి

పసునూరు శ్రీధర్‌బాబు మూడవ కవిత్వ సంపుటి 'ఏకాంతం ఒక అతిథి' ఆవిష్కరణ సభ డిసెంబర్ 7 సా.6 గంటలకు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్, హైదరాబాద్‌లో జరుగుతుంది. ఆవిష్కర్త లక్ష్మణ్ ఏలె, అధ్యక్షత బి. నర్సింగరావు. ప్రధాన వక్తలు: వాడ్రేవు చినవీరభద్రుడు, విమల మోర్తాల, పిల్లలమర్రి రాములు, సిద్ధార్థ పాల్గొంటారు.

అక్షర్ మీడియోస్

సాహిత్య పోటీ ఫలితాలు

బాదం మాధవరావు జ్ఞాపకార్థం నిర్వహించిన పోటీలో ఏనుగు నరసింహారెడ్డి 'ఏడు కోలల బాయి' కావ్యం, కాఫ్కా 'మెటమార్ఫసిస్'కు మెహెర్ అనువాదం ఎంపికయ్యాయి. అవార్డ్ ప్రదానం డిసెంబరు 25న పిఠాపురంలో ఉంటుంది.

ర్యాలి ప్రసాద్

కథ 2024 ఆవిష్కరణ

సిద్ధార్థ కళాపీఠం, విజయవాడ నిర్వహణలో కథా సాహితి సంకలనాలలో 35వ కథ సంకలనం 'కథ-2024' ఆవిష్కరణ సభ డిసెంబరు 7 ఉ.10.15కి సిద్ధార్థ కాలేజీ ఆడిటోరియం, విజయవాడలో జరుగుతుంది. అధ్యక్షత పి. లక్ష్మణరావు, ఆవిష్కరణ సి. మృణాళిని, ఆత్మీయ అతిథి ఎ.వి. గురవారెడ్డి, పుస్తక సమీక్ష ఆర్.ఎమ్. ఉమామహేశ్వరరావు. కథా సాహితి సంపాదకులుగా వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్ పాల్గొంటారు. కథా రచయితలతో ముఖాముఖీ ఉంటుంది.

బండ్ల మాధవరావు

జనజీవన కవనకళతో కట్టుకున్నది నా 'దూదిమేడ'


నా మొదటి పుస్తకం

నాళేశ్వరం శంకరం



మా ఊరిపేరు నాళేశ్వరం. అదే నా ఇంటిపేరు. అది నిజామాబాదు జిల్లాలో మారుమూల గ్రామం. మేము జంగాలం. బిక్షాటన మా కులవృత్తి. బిక్షాటన లేకపోతే జీవించలేని కుటుంబం మాది. బాల్యం నుంచే బిక్షాటన చేయడం వల్ల మా ఊరి ఇంటింటి దుఃఖం తెలిసి వచ్చింది. పిడికెడు బియ్యం నా జోలెలో వేయడమే కాదు, కుతిక దీరా రాసుకునే కవితా వస్తువును మా ఊరే ఇచ్చింది. దుఃఖ నిలయంగా ఉన్న మా ఊరును వెన్నెల నిలయంగా మలచాలనుకున్నాను గానీ నా పేదరికం ముప్పుతిప్పలు పెట్టింది. నాలోని నిత్యచైతన్య శీలమే నాకో రహస్య రహదారిని నేర్పింది. ఇంటికి దూరమైనా ఎదురీదుతూ డిగ్రీ దాకా వచ్చాను. కె. వివేకానందరెడ్డి, సునీతమ్మగార్లు చేసిన ఆర్థిక సహాయం వల్ల ఎం.ఏ చదవటానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం వచ్చాను. నా జీవితంలోని ఈ మలుపు నాకెంతో శక్తినిచ్చింది. నా కవిత్వానికి జీవం పోసింది. ఉద్యమాల, పోరాటాల, విప్లవాల రాజకీయ కవిత్వంలా కాక అవి జనజీవన తాత్త్విక స్వభావంలోకి సింకయ్యే స్వభావాన్ని అలవర్చుకున్నాను. సరళీకరణ ఆర్థిక విధానాలు, ప్రపంచీకరణ సృజిస్తున్న తుపాను నాలోకి ప్రవేశించింది. భూస్వామ్య, పెట్టుబడిదారీ, పాలక వర్గాలు మిళితమై జనజీవనాన్ని ఎలా దెబ్బతీస్తున్నాయో చాలా కవితల్లో వ్యక్తపరిచాను. ఎంఏ చదువుతున్న రోజుల్లో 'భారతి'తో కవిత అచ్చయితేనే కవి అన్న భావన ఉండేది. ఓమారు మా గురువుగారు సి. నారాయణరెడ్డి కవితా, నా కవిత ఒకేచోట అచ్చయినాయి. సినారె తరగతి గదిలోనే నన్ను నిలుచోబెట్టి అభినందించారు. ఎంఏ చదువుకున్న రోజుల్లో నందిని సిధారెడ్డి, గుడిహాళం రఘునాథం సీనియర్లు. నేను, ఎస్వీ సత్యనారాయణ, వసంతరావు దేశపాండె, సుంకిరెడ్డి నారాయణరెడ్డి జూనియర్స్‌ము. రాయాలన్న తపన తప్ప ఇంకేదీ దరి చేరేది కాదు. ఈ కాలంలో రాసిన కవితల్లో నుంచి కొన్ని ఏర్చి కూర్చిన కవితా సంపుటమే నా 'దూదిమేడ'.

'దూదిమేడ' ఆవిష్కరణ ఏప్రిల్ 30, 1997, బుధవారం సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. దేవిప్రియ సభాధ్యక్షులు, కె.శివారెడ్డి ఆవిష్కర్త. జ్వాలాముఖి 'దూదిమేడ' లోని లోతుపాతులు ఎత్తిచూపారు. ఆప్తవాక్యం ఎన్. గోపి, బైస దేవదాసు. కందుకూరి శ్రీరాములు వేదిక పైకి ఆహ్వానించారు. వీరందరి ప్రసంగాలతో నాలో నయాగార జలపాతం. ఇంతలో మా అవ్వ సంగవ్వ, సహచరి సుభద్రదేవి, పుస్తకాన్ని అచ్చు వేసిన చిక్కడ్‌పల్లి బాలప్రసాదును తగిన విధంగా గౌరవించి తలా ఓ కాపీ ఇచ్చాను. మా అమ్మ సంబరంతో హేలుహేలంతా మురిసిపోయింది. తెల్లవారి మేడే. 'దూదిమేడ' హైదరాబాద్‌లోనే గాక, గుంటూరులోను రెండవరోజు రెండవసారి ఆవిష్కరింపబడింది. గుంటూరులోని పెనుగొండ లక్ష్మీనారాయణ ఆకాంక్ష మేరకు అవగాహన సామాజిక సాంస్కృతిక వేదిక పైన మే డే సభలో ఈ ఆవిష్కరణ జరిగింది. పాపినేని శివశంకర్, కడియాల రామ్మోహనరావుతోపాటు కె.శివారెడ్డి, దేవిప్రియ, జ్వాలాముఖి రెండవసారి మాట్లాడారు. హైదరాబాద్‌లోను, గుంటూరులోను నేను ఆశ్చర్యపోయేలా అమ్ముడుపోయింది. దేవిప్రియ 200 కాపీలు తీసుకురమ్మంటే 250 కాపీలతో గుంటూరుకు వెళ్లాను. వచ్చేటప్పుడు నా దగ్గర ఒక్క కాపీ మిగలలేదు. ఇక "కవిని కడతేర్చేది కవిత్వమొక్కటే" అన్న నా కవితా పాదాన్ని శీర్షికగా పెట్టి దేవిప్రియ 'దూదిమేడ'కు ముందుమాట రాశారు. అది 'దూదిమేడ'కు యోగ్యతాపత్రం లాంటిది.



ఆంధ్రజ్యోతి దినపత్రిక, వారపత్రిక 'దూదిమేడ'కు గౌరవాన్నిచ్చింది. పొనుగోటి కృష్ణారావు సాహిత్య పేజీలో నా చేత నన్ను గూర్చి రాయించి ప్రచురించారు. వారపత్రిక సంపాదకులు దాట్ల ఏకంగా 'దూదిమేడ'పై సంపాదకీయం రాశారు. డా. రంగయ్య 'దూదిమేడ'ను 'కపాస్‌కి అటారి' పేరుతో హిందీలోకి అనువదించారు. సోమసుందర్, ఎన్.గోపి, నాగభైరవ కోటేశ్వరరావు, జయధీర్ తిరుమలరావు, పి.వి. రమణ, గుడిపాటి, దర్భశయనం, ధింసా, పెన్నా శివరామకృష్ణ, పసునూరి శ్రీధర్‌బాబు, కొండేపూడి నిర్మల... మరికొందరు 'దూదిమేడ'లోని కవిత్వాన్ని విశ్లేషిస్తూ రాశారు. 'దూదిమేడ'కు ఫ్రీవర్స్ ఫ్రంట్ అవార్డుతో పాటు పలు అవార్డులు వచ్చాయి. ఉత్తమ విమర్శకులు ఉత్తరాలు కూడా రాశారు. కె.కె. రంగనాథాచార్యులు 'మధ్యవర్తి చేతిలో రైతు, కవి' కవిత చదివి ఉత్తరం రాశారు. వారి ఉత్తరం వల్లనే ఆ కవిత అచ్చయిన పత్రికను తర్వాత సంపాదించుకున్నాను.



శీలా వీర్రాజు గారు అత్యంత ఆత్మీయులు. ప్రతి పది ఇరవై రోజులకు ఒకమారు మా ఇంటికి ప్రొద్దున పూట వచ్చేవారు. ఎన్నో మార్లు పుస్తకం వేయమని అన్నాడు. పుస్తకం వేస్తేనే మీ ఇంటికి వస్తానన్నాడు. నేను పుస్తకం వేయలేదు. ఆయన మా ఇంటికి రావడం మానేశారు. ఓ ఆరు నెలలు అయిందనుకుంట. మా నాన్న చనిపోయాడు. ఆ సందర్భంలో ఆయన మా ఇంటికి వచ్చాడు. చలించిపోయాను. ఆయన వల్లనే నా కవితలను నేనే ఎన్నుకుని 'దూదిమేడ'గా ప్రచురించి ఆయనకే అంకితమిచ్చాను. నా 'దూదిమేడ' వీర్రాజును మళ్ళీ మా యింటికి వచ్చేట్లు చేసిన సంపుటం.

✆ 94404 51960


చదువు ముచ్చట

రాజీ కన్నా

ప్రేమ కథలు నచ్చవు

ఈమధ్య చదివి ఇష్టపడిన పుస్తకం?

ఈ నడుమ అంటే సోలోమన్ విజయ్ కుమార్ 'సన్ ఆఫ్ జోజప్ప' కోసం ఆత్రంగ ఎదురు చూసిన. అంతకు ముందు 'ముని కాంతపల్లి' కథల పుస్తకం నన్ను ఒకరకమైన ట్రాన్స్‌ల పడేసింది. ఆ కథలన్నీ ఎదో మా ఊర్లో, నా కళ్ళ ముందు జరిగినట్టున్నయ్. ఆ నెల్లూరు మాండలికం అయితే.. దానికోసమే ఆ బుక్ ఎన్నిసార్లు సదివిన్నో లెక్క లేదు. అంటే నాకు మాండలికాల మీద ఉన్న విపరీతమైన ఇష్టం తోని ఇంక ఎక్కువ నచ్చినట్టుంది.



తొలిసారి బాగా ఇష్టపడిన పుస్తకం?

నాది పూర్తిగా గవర్నమెంట్ స్కూల్ చదువు. అక్కడ అన్ని ల్యాబులకు, లైబ్రరీకి కలిపి ఒకటే రూమ్ ఉండేది. అందులో ఉన్న ఓ చెక్క బీరువలో మస్తు పుస్తకాలుండేవి. ఇగ అయిట్లల్ల.. పేర్లు గుర్తులేవు గాని, కథలు గుర్తున్నాయి. టీనేజ్ దాటిన తర్వాత చదివిన పుస్తకం కేశవరెడ్డి 'అతడు అడవిని జయించాడు.' నాన్‌స్టాప్‌గా చదివిన ఆ బుక్‌ను. తర్వాత అట్ల వదలకుండ చదివింది బిభూతి భూషణ్ బందోపాధ్యాయ రాసిన 'వనవాసి'. ఇవి రెండు నా ఆల్ టైం ఫేవరేట్ బుక్స్

ఒకప్పటికీ ఇప్పటికీ పుస్తకాలు చదివే తీరులో వచ్చిన మార్పులు?

పుస్తకాలు చదవడం మొదలు పెట్టిన కొత్తలో పుస్తకాల మీద దండయాత్ర చేసేది. మొదలుపెట్టి అన్నం, నీళ్లు, నిద్ర మాని చదివేదాన్ని. నాకు బాగా గుర్తుంది.. ఒకసారి ఇంట్లోవాళ్ళు ఊరికి వెళ్తే, తలుపులు పెట్టుకొని బయటికి రాకుండా రెండు రోజులు దాక పుస్తకాలు చదువుతనే ఉన్న. ఎప్పుడు తిన్ననో ఎప్పుడు నిద్రపోయిన్నో.. దెబ్బకు ఇంటి పక్కనోళ్లు 'ఏమైంది.. బయటికే రావడం లేదు.. ఆల్ ఓకేనా' అని అడిగిన్రు.

పుస్తకాల్లో రచనల్లో మీరు అంతగా ఇష్టపడని ధోరణి?

ప్రేమ కథలు.. ఎందుకో తెలియదు మరి.

సాహిత్యంలో మీకు ఆల్టర్ ఈగో అనిపించిన పాత్ర?

నేను అంత పెద్దగ సాహిత్యం చదవలేదు. గాని ఒక్కోసారి చలం స్త్రీ పాత్రలు అలా అనిపిస్తయి.

రాయటానికి వాడే భాష విషయంలో మీకు మోడల్‌గా నిలిచిన రచయితలు?

రాయడం స్టార్ట్ చేసినప్పుడు ఇంకా ఎవరి రచనలు చదవలేదు. ఆ తర్వాత మాత్రం అల్లం రాజయ్య, నామినిలా పాఠకులను కట్టిపడేయాలనుకుంట.

ఏ గత కాలం రచయితతోనైనా మాట్లాడగలిగితే?

'వోల్గా సే గంగా' రాసిన రాహుల్ సాంకృత్యాయన్‌తో మాట్లాడతా. భూమి మీద ఐదు వేల ఏళ్లకు ముందు.. మంచు యుగం చివరి దశలో మాతృస్వామ్యం ఉందని ఎలా ఊహించారో అడుగుతా.



(రాజీ కన్నా కథల సంపుటి 'అర్రాసు' ఇటీవల విడుదలైంది.)



వర్షాకాలపు రాత్రి

నేను:
జమ్ముగడ్డి ఇంట్లో
ఒట్టినేల మీద బొంత పరచుకుని
ఇంటికప్పు మీద వర్షం చేసే సంగీతం వింటూ
చల్లటి రాత్రి ఇద్దరం
వెచ్చగా
ఒకే దుప్పటిలో నిద్రపోదామా

తాను:
దుప్పటి లోనున్న నిశ్శబ్దంలో
నీ హృదయ స్పందన వింటూ,
వాన చినుకులు మన కలలకి తాళం వేస్తూ,
మనిద్దరం ఒకరినొకరు కౌగిలించుకుని,
వెచ్చని శ్వాసల్లో మునిగిపోతూ,
ఆ ఉదయం మెలకువ వచ్చే వరకు
ప్రపంచం మొత్తాన్ని మరచిపోదాం

నేను:
గుండె కోసి ఇవ్వనా
ఈ రాత్రి కోసం
భూమ్మీద బంగారం అంతా
చాలునా నీ ముద్దుకోసం
ప్రాణాలు వదలనా
నీ కౌగిలింతలోని సుఖం కోసం

తాను:
ఇవన్నీ ఏవీ జరగాల్సిన అవసరమే లేదు
నీ ముద్దుల్లో మునిగిపోతూ
శ్వాసలు కలిసే వేడి తాకిడిలో
గుండె తాళం తప్పిపోయే
వేళ కోసమే ఎదురుచూస్తుంటా

నేను:
నది ఒడ్డున నీకోసం నావతో సిద్ధంగా ఉన్నాను
ఈ జన్మలోనైనా నువ్వు వస్తావేమోనని
నువ్వు రాగానే మన కలల దీవికి వెళ్ళిపోదాం
అక్కడ జమ్ముగడ్డి ఇల్లు ఉంది
మా అమ్మ పాతచీరతో కుట్టిన బొంత ఉంది
కుంచెడు బియ్యానికి బేరం ఆడి కొన్న
కొత్త దుప్పటి ఉంది.
ఏం కావాలి ఓ కల కనడానికి?

తాను:
ఈ కల నిజమైన నాడు,
నేను మొత్తానికే నీ సొంతం అవుతాను

నేను:
నేను ఎప్పుడో నీ సొంతం.
ఇది ఇంకో జన్మ అంతే

■ ప్రసాద్ సూరి



గందరగోళం

ఇదంతా బయల్దేరిన చోటికి చేర్చే గోళమే
దాన్ని తెలియనివ్వని గందరగోళం కూడా
ఇదంతా ఒక తిక్క. నాకొడుకు ప్రేలాపనే
ఐనా పదాల్ని తెంపి దండలు కట్టి చూడు!

అసలీ ప్రయాసంతా ఎందుకు? ఏమో తెలియదు!
రెండు విషయాలు నాకు ఎప్పటికీ తెలియవు
విశ్వావరణానికి బయట ఏముందో తెలియదు
మెదడుకు బయట ఏముందో కూడా తెలీదు!

మాటలు తుప్పపట్టి తెరుచుకోని తలపులు
అంతిమ సత్యం అంటూ ఒకటి లేదు గనుక,
మరీ బరి తెగించి అనకూడదు గాని; విశ్వానికి,
మస్తిష్కానికి బయటివి మనకెప్పటికీ తెలీవు

ఉన్న సత్యాలన్నీ ఛందస్సుల్లా, వాస్తుశిల్పాల్లా
ఏదో దొరికిన కాస్త స్థలంలో నిర్మించబడినవే;
అవి సహజాతాలు కావు; వస్తువులతో పాటు
పుట్టినవి కావు, పుట్టాక రూపాలు పొందినవే;

'అదే అదే అదేర నాన్నా, అదే శంకరుడన్న మాయ'
అంటావా సహవాసీ! నా ఆవేదన సహభోగీ! వేదాంతీ!
ఆగు ఆగు, కుదరదు! ఆలోచన ఇంకా అయిపోలేదు
బయటి మాయ సంగత్సరే, లోని పీడన సంగతేంటి?


ఆకలేసినా అన్నానికి వెళ్లనివ్వని పని సంగతేమిటి?
నీ మనసు కట్టిన పాటను నిన్ను పాడుకోనివ్వని
రాజదండాల సంగతేమిటి? మనిషిపై మనిషి స్వారీకి,
రేసు మైదానాల సంగతి, బుక్కీ కిటికీల వద్ద మన
మధ్యతరగతి పడిగాపుల సంగతేమిటి? నీచస్థితిని
వొదిలేసి చేయాల్సి ఉన్న దీర్ఘయాత్ర సంగతేమిటి?

మాయ అనేది మాయ అని కూడా మనకు తెలీదు
తెలిసింది ఏదో అదే తెలుసు, అన్నీ తెలుసు అని
ఉపదేశ ముద్రతో హస్తం చాచకు, పోజులు కొట్టకు,
ఏదీ తెలియదని రాత్రంతా చిడతలు మోగించి
పొద్దున్నే దొరగాని చేనిలో కలుపు తీయడానికి
మాత్రమే, దానికి మాత్రమే చూరులోని కొడవలి
పదును గురించి చాల దిగులు పడిపోతూ
ఆకలికి బానిసగా బతికి, మరణించ వద్దు!

పనికీ పనికి మధ్య విరామాల్లోనైనా నీకు నువ్వు బతుకు,
గుహల గోడల మీద బొమ్మలుగా, వేట కేకల కవితలుగా

■ హెచ్చార్కె

✆ 95023 45716

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5

ఎన్.టి.ఆర్ జిల్లా వార్తలు
సోమవారం 1 డిసెంబరు 2025

ఉమ్మడి కృష్ణాజిల్లాలో రేషన్ దందా భారీ స్థాయిలో నడుస్తోంది. మండల స్థాయి స్టాక్ పాయింట్లకు సొంత గోడౌన్లు లేకపోవడంతో నాన్ సైంటిఫిక్ గోడౌన్లనే వినియోగిస్తున్నారు. ఇక్కడకు వచ్చే బియ్యం తూకంలో భారీగా తేడాలు ఉంటున్నాయి. తూకం, నాణ్యతా ప్రమాణాలు నిర్ధారణ పరీక్షలను గాలికి వదిలేశారు. ఆయా పాయింట్లలో వేబ్రిడ్జిల జాడ లేకపోవడంతో మిల్లుల నుంచి వచ్చే సరుకు, కాగితాలపై ఉన్న సంఖ్యకు మధ్య వ్యత్యాసం ఉన్నా సర్దుకోవాల్సిన పరిస్థితి. ఎవరి స్థాయిలో వారు అక్రమాలకు పాల్పడుతూ పేదల బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

రేషన్ మాయ!

మండల స్థాయి స్టాక్ పాయింట్లకు గోడౌన్ల కరువు

బఫర్ గోడౌన్లకు వచ్చే బియ్యం తూకంలో భారీగా తేడాలు

- తూకం, నాణ్యతా ప్రమాణాల నిర్ధారణ పరీక్షలు గాలికి..
- ఎంఎల్ఎస్ పాయింట్లలో జాడలేని వేబ్రిడ్జిలు
- వచ్చే సరుకు, కాగితాలపై ఉన్న సంఖ్యకు మధ్య వ్యత్యాసం
- భారీస్థాయిలో పక్కదారి పడుతున్న పేదల బియ్యం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఉమ్మడి కృష్ణాజిల్లాలో మండల స్థాయి స్టాక్ (ఎంఎల్ఎస్) పాయింట్ల ద్వారా ప్రజలకు అందించాల్సిన బియ్యం పక్కదారి పడుతోంది. చాలా చోట్ల ఎంఎల్ఎస్ పాయింట్లకు సొంత గోడౌన్లు లేవు. నాన్ సైంటిఫిక్ గోడౌన్లలో ఎంఎల్ఎస్ పాయింట్లు నడుస్తున్నాయి. బందరులో పేర్ని నాని సతీమణికి చెందిన గోడౌన్‌లో ఇలాగే బియ్యం బస్తాలు మాయం అయ్యాయి. అవి ఎక్కడికి పోయాయన్నది ఇప్పటి వరకు తెలియదు. ఇలాంటివి ఒక ఎత్తు అయితే బఫర్ గోడౌన్లకు వచ్చే బియ్యానికి సరైన తూకం ఉండటం లేదని తెలిసింది. మిల్లర్లతో కుమ్మక్కైన ఫలితంగా బఫర్ గోడౌన్లకు మిల్లర్లు ఎంత పరిమాణంలో బియ్యం ఇస్తే అంతే దిగుమతి చేసుకుంటున్నారు. రైస్ మిల్లుల నుంచి బఫర్ గోడౌన్లకు వచ్చే బియ్యం బస్తాలు ఒక్కొక్కటి 51 కేజీలను కలిగి ఉండాలి. ప్రభుత్వం ఇచ్చే కొత్త గోనె సంచి పరిమాణం 580 గ్రాములు ఉంటుంది. ఇది కాకుండా పోషకాలతో కూడిన కెర్నెల్స్‌ను ప్రభుత్వం రైస్ మిల్లర్లకు అందిస్తుంది. ఒక్కో బస్తాకు ఒక కేజీ చొప్పున ప్రభుత్వం ఇచ్చిన కెర్నెల్స్‌ను కలపాల్సి ఉంటుంది. కాబట్టి రైస్ మిల్లరు ఖచ్చితంగా 51 కేజీల పరిమాణంతో ఉన్న బస్తాను మిగతా 6లో..

ప్రక్షాళన అవసరం!

బఫర్ గోడౌన్లు, ఎంఎల్ఎస్ పాయింట్లలో పారదర్శక విధానాలు తీసుకురావటానికి వీలుగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎంఎల్ఎస్ పాయింట్లలో టెక్నికల్ స్టాఫ్ అంతా కూడా కాంట్రాక్టు ప్రాతిపదికన వచ్చిన వారే ఉన్నారు. పూర్తి స్థాయిలో కూడా సిబ్బంది ఉండరు. కాటా వేయటంతో పాటు, క్వాలిటీ చెక్ కూడా వీరే చేయాలి. ఇవన్నీ ఎక్కడా పెద్దగా జరుగుతున్న దాఖలాలు లేవని సమాచారం. కాంట్రాక్టు సిబ్బంది బియ్యం బస్తాలన్నింటినీ ఓకే చేయించి లాట్ వేయిస్తారు. ఎలా ఓకే చేస్తున్నారు? లాట్ చేయించే విధానాల మీద తనిఖీలు లేవని తెలిసింది. మిల్లు నుంచి బఫర్ గోడౌన్‌కు వస్తున్న బియ్యం అసలైనవేనా ? బయటి నుంచి వస్తున్నాయా ? అన్న అంశాలు పరిశీలించటం లేదని సమాచారం. క్రమం తప్పకుండా తనిఖీలు ఉంటే గతంలో కైకలూరు ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి వేలాది బియ్యం బస్తాలు, బందరులో మాజీ మంత్రి పేర్ని నాని సతీమణి గోడౌన్‌లో భారీ స్థాయిలో బియ్యం బస్తాలు పక్కదారి పట్టేందుకు అవకాశం ఉండేది కాదని విమర్శలు ఉన్నాయి.

రెడ్డిగూడెం మండలం రంగాపురంలో ధాన్యం రాశులపై టార్పాలిన్ పట్టాలు కప్పిన అన్నదాతలు



అన్నదాతల్లో దిత్వా గుబులు

జిల్లా వ్యాప్తంగా జల్లులు

- మిల్లులకు ధాన్యం తరలించేందుకు పరుగులు
- భారీ వర్షాలు పడితే పంట చేతికి రాదని ఆందోళన
- నేడు మోస్తారు వర్షాలు కురిసే అవకాశం

ఇబ్రహీంపట్నం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాను ప్రభావంతో పరుడుతున్న చిరు జల్లులు అన్నదాతల్లో గుబులు రేపుతున్నాయి. యంత్రాలతో కోసి రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం మిల్లులకు తరలించేందుకు పరుగులు పెడుతున్నారు. భారీ వర్షాలు పడితే పంట చేతికి రాదని ఆందోళన చెందుతున్నారు. నైరుతి బంగాళాఖాతంలోని దిత్వా తుఫాను ఉత్తర తమిళనాడు - పుదుచ్చేరి తీరాలకు సమాంతరంగా కదులుతూ తీవ్ర వాయుగుండంగా బలహీనపడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తుఫాను ప్రభావంతో దక్షిణ కోస్తా తీరం వెంబడి గంటకు 45 - 65 కిలో మీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. సముద్రంలో మిగతా 6లో..

తేలికపాటి జల్లులు

దిత్వా తుఫాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా ఆదివారం తేలికపాటి జల్లులు పడ్డాయి. కోతలు కోసి కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడవకుండా రైతులు రాశులపై పట్టాలు కప్పారు. పగలంతా చల్లని గాలులు వీశాయి. రాత్రి నుంచి తేలికపాటి జల్లులు పడటం ప్రారంభమైంది. ఈదురు గాలులు లేకపోవడంతో అన్నదాతలు ఊపిరిపీల్చుకున్నారు. జిల్లాలో 95 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇప్పటి వరకు కేవలం 25 శాతం మాత్రమే కోతలు కోశారు. కోతలు కోసి ఆరబెట్టిన ధాన్యాన్ని చాలా వరకు ఆదివారం మిల్లులకు తరలించారు. ఇంకా 75 శాతం పంట గింజ దశలో కోతకు సిద్ధంగా ఉంది. ఈ దశలో ఈదురు గాలులు వీసి వర్షం పడితే పంట చేతికి రాదని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమ, మంగళవారాల్లో దిత్వా తుఫాను గండం గడిస్తే చాలనే భావన అన్నదాతల్లో వ్యక్తం అవుతోంది.

మైనింగ్ వార్!

క్వారీ క్రషర్స్ అసోసియేషన్, జిల్లా మైనింగ్ అధికారి మధ్య వివాదం

ఇబ్రహీంపట్నం, జి.కొండూరు క్వారీ క్రషర్స్ అసోసియేషన్, జిల్లా మైనింగ్ అధికారి మధ్య వివాదం జిల్లాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అమరావతి ప్రాజెక్టుకు రోడ్డు మెటల్‌ను అడ్డుకుంటున్న జిల్లా అధికారిపై చర్యలు తీసుకోవాలని క్వారీ క్రషర్స్ అసోసియేషన్ నేతలు సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పెమ్మసాని ఇన్ఫ్రాటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో అనేక అక్రమాలు జరుగుతున్నాయని, 15 రోజుల్లో వివరణ ఇవ్వకుంటే చర్యలు తీసుకుంటామని మైనింగ్ అధికారి నుంచి నోటీసు జారీ అయ్యింది.

- జిల్లా మైనింగ్ అధికారిపై చర్యలు తీసుకోండి
- అమరావతి ప్రాజెక్టులకు రోడ్డు మెటల్‌ను అడ్డుకుంటున్నారు
- రెన్యువల్స్ చేయకపోవటం వల్ల క్రషర్స్ మూతపడుతున్నాయి
- సీఎం చంద్రబాబుకు ఇబ్రహీంపట్నం, జీ కొండూరు క్వారీ క్రషర్స్ అసోసియేషన్ ఫిర్యాదు
- క్రషర్స్ అసోసియేషన్ కీలక నేతకు జిల్లా మైనింగ్ అధికారి షోకాజ్ నోటీసు
- అక్రమంగా మైనింగ్, రవాణా, నిల్వ, తనిఖీల్లో గుర్తించిన అంశాలను వివరిస్తూ..
- 15 రోజుల్లో వివరణ ఇవ్వకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరిక



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఎన్టీఆర్ జిల్లా మైనింగ్ అధికారి శ్రీనివాస్‌పై ఇబ్రహీంపట్నం, జి.కొండూరు క్వారీ క్రషర్స్ అసోసియేషన్ సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేయటం సంచలనం సృష్టిస్తోంది. ఒక అధికారిపై క్రషర్స్ అసోసియేషన్ లేఖ రాయటం ఇదే మొదటిసారి. రాజధాని అమరావతిలో భారీ ఎత్తున చేపడుతున్న ప్రాజెక్టుల పనులకు మెటల్‌ను అందిస్తున్న నేపథ్యంలో ఈ ఫిర్యాదు చేయటం చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ ప్రాజెక్టులకు రోడ్ మెటల్‌ను సరఫరా చేయటం కోసం ఉచిత పర్మిట్లను కేటాయించటానికి మెమోను గనుల శాఖ జారీ చేసినా.. జిల్లా అధికారి అమలు చేయటం లేదని క్రషర్స్ అసోసియేషన్ తమ ఫిర్యాదులో పేర్కొంది. రెన్యువల్స్, పర్మిట్లతో పాటు ఇతర ముఖ్యమైన ఫైళ్లను పరిష్కరించే విషయంలో తీవ్ర జాప్యం చేయటం వల్ల క్రషర్స్ యూనిట్ల కార్యకలాపాలను బలవంతంగా నిలిపివేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేసింది. మైనింగ్ అధికారిపై శాఖాపరమైన విజిలెన్స్ విచారణ జరిపించాలని అభ్యర్థించింది.

అసోసియేషన్ నేతకు జిల్లా అధికారి షోకాజ్ నోటీసు

క్రషర్స్ అసోసియేషన్ ఫిర్యాదు నేపథ్యంలో అసోసియేషన్ కీలక నేత పెమ్మసాని శ్రీధర్‌కు జిల్లా మైనింగ్ అధికారి శ్రీనివాస్ షోకాజ్ నోటీసు జారీ చేశారు. జి.కొండూరు మండలం లోయ గ్రామంలోని రీ సర్వే నెంబర్ 49/1లోని పెమ్మసాని ఇన్ఫ్రాటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సీనరేజ్ ఫీజును తప్పించుకోవటంతో పాటు ఆ సంస్థపై వచ్చిన అనేక ఫిర్యాదులపై షోకాజు నోటీసును జారీ చేస్తున్నట్టు స్పష్టం చేశారు. కార్యాలయ తనిఖీ నివేదికలతో పాటు పలువురు ఇచ్చిన ఫిర్యాదులను అందులో కోట్ చేశారు. అక్రమ క్వారీ కార్యకలాపాలను గుర్తించటం జరిగిందని, సర్వే నెంబర్ 26/2లో 8.418 హెక్టార్ల ఎల్ఆర్ వర్మ క్వారీ లీజు మిగతా 6లో..

పట్టాలెక్కనున్న పాసింజర్ రైలు

మోటమర్రి నుంచి జగ్గయ్యపేట వరకు ట్రాక్ పనులు ప్రారంభం

ముమ్మరంగా జంగిల్ క్లియరెన్స్, కల్వర్టు నిర్మాణం

జగ్గయ్యపేట రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జగ్గయ్యపేట ప్రజల దశాబ్దాల కల అయిన పాసింజర్ రైలు పట్టాలెక్కేందుకు రంగం సిద్ధమైంది. దక్షిణ మధ్య రైల్వే రూ.1,780 కోట్ల వ్యయంతో ఖమ్మం, మోటమర్రి నుంచి వయా జగ్గయ్యపేట మీదుగా నల్గొండ జిల్లా విష్ణుపురం వరకు 88.5 కిలోమీటర్ల మేర రెండవ ట్రాక్ నిర్మాణ పనులు మండలంలో ప్రారంభించింది. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు రా మెటీరియల్ సరఫరా చేసేందుకు మూడు దశాబ్దాల క్రితం మోటమర్రి నుంచి గనుల వరకు లైన్ నిర్మించారు. అనంతరం సిమెంట్ కర్మాగారాలు పెరగటంతో అంచలంచెలుగా మిర్యాలగూడ సమీపంలోని విష్ణుపురం వరకు లైన్ పొడిగించి బీబీ నగర్, నడికుడి వరకు అనుసంధానం చేశారు. రెండు దశాబ్దాలుగా ఈ ప్రాంతంలోని ప్రజాప్రతినిధులు పాసింజర్ రైలు నడపాలని ప్రతిపాదనలు పంపినా కార్యరూపం దాల్చలేదు. రెండవ లైన్ పూర్తైతే ఇబ్బందులు తొలగుతాయి. 88.5 కిలోమీటర్లను 4 ఫేజ్‌లుగా విభజించి రెండు టెండర్‌లు ఆమోదం కావటంతో డీసీసీ ఇన్ ప్రాజెక్టు లిమిటెడ్ ఆధ్వర్యంలో మోటమర్రి నుంచి జగ్గయ్యపేట వరకు పనులు ప్రారంభమయ్యాయి. జాతీయ రహదారి పక్కన చిల్లకల్లు వద్ద కంపెనీ తాత్కాలిక ప్రాజెక్టు ఏర్పాటు చేసి పనులకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం ఉన్న మార్గానికి సమాంతరంగా జంగిల్ క్లియరెన్స్‌తో పాటు కల్వర్టు పనులు చేపట్టారు.



రైల్వే ట్రాక్‌కు సమాంతరంగా జరుగుతున్న జంగిల్ క్లియరెన్స్

వత్సవాయి మండలం లింగాల వద్ద మునేటిపై జగ్గయ్యపేట మండలం కె.అగ్రహారం వద్ద పాలేటిపై బ్రిడ్జిలను నిర్మించాల్సి ఉంది. రెండవ ట్రాక్ పనులు పూర్తి చేయాలని దిశానిర్దేశం చేసినా రేపూరు, రామాపురం టెండర్‌లు ఆమోదం లభించకపోవటంతో ఆలస్యం కావచ్చని భావిస్తున్నారు. 2030 నాటికి హైదరాబాద్-విజయవాడ 3వ ట్రాక్ సిద్ధమవుతుంది. ఇప్పటికే మోటమర్రి నుంచి విష్ణుపురం వరకు చాలా ప్రాంతాలలో స్టేషన్‌ల నిర్మాణం కూడా పూర్తై అన్ని సదుపాయాలతో సిద్ధంగా ఉన్నాయి.

ప్రారంభానికి ముందే ప్రమాదాలు

విజయవాడ వెస్ట్ బైపాస్‌పై తరచూ ఢీకొంటున్న వాహనాలు

- రాంగ్‌రూట్‌లో రావడమే ప్రధాన కారణం
- బైపాస్ ప్రారంభానికి మరో ఆరు నెలల సమయం!
- ప్రమాద స్థలాలను గుర్తించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనచోదకుల వినతి



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన టిప్పర్

విజయవాడ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ వెస్ట్ బైపాస్ ప్రారంభం కాకముందే రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. ఆరు లేన్లతో విశాలంగా విస్తరించి ఉండటంతో ఇష్టారాజ్యంగా వాహనాలు నడుపుతున్నారు. చిన్న వాహనాలతో పాటు భారీ వాహనాలు కూడా రాంగ్ రూట్‌లో వస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. రోడ్డు రెండు వైపులా ఖాళీగా ఉన్నప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రమాదాల బారినపడుతున్నారు. గత శనివారం అర్ధరాత్రి ఒక టిప్పర్ రాంగ్ రూట్‌లో వస్తూ ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ఆర్అండ్‌బీ గోడను బలంగా ఢీకొనడంతో లారీ నుజ్జునుజ్జు అయింది. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. టిప్పర్‌ను రోడ్డు మీద నుంచి తొలగించడానికి రెండు క్రేన్ల సహాయం తీసుకోవాల్సి వచ్చింది. కాగా, వెస్ట్‌బైపాస్‌పై గతంలో జరిగిన ప్రమాదాల్లో ఇద్దరు, ముగ్గురు చనిపోయిన ఘటనలు కూడా ఉన్నాయి. దసరా ఉత్సవాల సమయంలో నున్న వద్ద 2 ద్విచక్ర వాహనాలు ఢీకొని యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనలోను రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా రావడంతో ప్రమాదం జరిగింది. బైపాస్ ప్రారంభానికి ముందే ప్రమాదాలు జరగడంపై అధికారులు వెంటనే చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి ముందస్తు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం ఈ రోడ్డుపై నుంచి భారీ వాహనాలు వెళ్లకుండా నియంత్రించాలని వాహనదారులు కోరుతున్నారు. వెస్ట్ బైపాస్ ప్రారంభించడానికి కనీసం ఆరు నెలల సమయం పట్టే అవకాశం ఉంది.

భక్తజనకీలాద్రి



కొండ దిగువన భక్తుల రద్దీ



ఆలయ ఆవరణలోని క్యూలైన్లలో పోటెత్తిన భక్తులు

ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలోని అన్ని క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. ఉదయం నుంచే భారీగా భక్తులు రావడంతో ఈవో వి.కె.శీనానాయక్ ప్రత్యేక ఏర్పాట్లు చేయించారు. వృద్ధులు, దివ్యాంగులు, చంటి పిల్లలతో వచ్చిన మహిళలకు ఓం టర్నింగ్ వద్ద నుంచి ప్రత్యేక బ్యాటరీ వాహనాన్ని ఏర్పాటు చేశారు. కొండ దిగువన కనకదుర్గానగర్ నుంచి మహామండపం వరకు భక్తుల రాకపోకలతో రద్దీ ఏర్పడింది.
-(ఆంధ్రజ్యోతి-ఇంద్రకీలాద్రి)

వెస్ట్ బైపాస్ 100 కి.మీ

- అంతకుమించి వేగానికి అనుమతి లేదు
- చిన్న అవుటపల్లి నుంచి కాజ వరకు అవాంతరాలు లేని ప్రయాణం
- మూడు వరసల రోడ్డు కావటంతో.. వేగపరిమితి నిర్దేశం

6



దిత్వా తుఫాను ప్రభావంతో నగరంలో ఉష్ణోగ్రతలు ఆదివారం ఒక్కసారిగా పడిపోయాయి. కనిష్ఠ ఉష్ణోగ్రత 23 డిగ్రీలుగా నమోదైంది. ఆకాశం మేఘావృతమై ఉండటంతో సూర్యుడు జాడ కనిపించలేదు. దీంతో ఉదయం నుంచి చలి గాలులు తీవ్రంగా వీయడంతో బయటకు రావడానికి ప్రజలు ఇబ్బంది పడ్డారు.
-(ఆంధ్రజ్యోతి-విజయవాడ)



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో శీనానాయక్

దుర్గమ్మ సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి

ఇంద్రకీలాద్రి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి కుటుంబసభ్యులతో కలసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఈవో వీకే శీనానాయక్, అధికారులు, అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం వారికి వేదపండితులు వేద ఆశీర్వచనం అందచేయగా, ఈవో అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

అందుబాటులోకి దుర్గగుడి వెబ్‌సైట్

ఇంద్రకీలాద్రి : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం దర్శనం, ఆర్జిత సేవలు, ప్రసాదాలు, వసతి, రూమ్స్ బుకింగ్ ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేసుకునేందుకు ఆలయ వెబ్‌సైట్ అందుబాటులోకి వచ్చినట్టు ఈవో వీకే శీనానాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌టిటిపిఎస్‌://డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కనకదుర్గమ్మ.ఓఆర్‌జి వెబ్‌సైట్ ద్వారా దేవస్థానంలో పూజల వివరాలు, వసతుల గురించి తెలుసుకోవచ్చునని ఈవో తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా ఆయన ఒక ప్రకటనలో కోరారు.

యూపీఎస్సీ పరీక్షకు 37.25 శాతం హాజరు

» పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్/అకౌంట్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ పోస్టుల భర్తీకి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఆదివారం నిర్వహించిన ఈపీఎఫ్ఓ పరీక్ష-2025 ప్రశాంతంగా ముగిసింది. ఉద్యోగ భవిష్య నిధి సంస్థలో వివిధ ఉద్యోగాల భర్తీ కోసం నగరంలో 15 కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు పరీక్ష నిర్వహించగా 5,860 మందికి గాను 2,183 మంది (37.25 శాతం) హాజరయ్యారు. కలెక్టర్ లక్ష్మీశ సీవీఆర్ ఉన్నత పాఠశాల, చిట్టూరి హైస్కూల్, ప్రభాస్ పీజీ కళాశాల పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఎక్కడ ఎలాంటి ఇబ్బంది లేకుండా పరీక్షను విజయవంతంగా నిర్వహించడంలో భాగస్వాములైన లైజనింగ్ అధికారులు, వెన్యూ సూపర్‌వైజర్లు, సమన్వయ శాఖల అధికారులకు కలెక్టర్ అభినందనలు తెలిపారు.

జాతీయ తైక్వాండోలో దామిని ప్రతిభ

» 2 బంగారు, 2 రజిత, 1 కాంస్య పతకాలు కైవసం



పతకాలు అందుకుంటున్న విజేత దామిని

ఇబ్రహీంపట్నం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఉత్తర ప్రదేశ్‌లో ఈనెల 21 నుంచి 23 వరకు జరిగిన జాతీయ తైక్వాండో పోటీల్లో ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం జూపూడి గ్రామానికి చెందిన కలతోటి దామిని ఉత్తమ ప్రతిభచూపి ఐదు పతకాలను సాధించింది. 55-59 కేజీల విభాగంలో రెండు బంగారు, రెండు రజిత, ఒక కాంస్య పతకాన్ని సాధించినట్టు ఉమ్మడి జిల్లా కోచ్ మలిశెట్టి అంకమ్మరావు ఆదివారం తెలిపారు. దామిని గుణదల డాన్‌బోస్కో స్కూల్లో 9.వ తరగతి చదువుతోంది. విద్యార్థినిని పలువురు అభినందించారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి

» ప్రభుత్వ పెన్షనర్స్ జిల్లా అధ్యక్షుడు దాలినాయుడు

విజయవాడ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాల విషయంలో వృద్ధులు, పెన్షనర్లు అవగాహన పెంచుకోవడంతో జాగ్రత్తగా ఉండాలని రాష్ట్రప్రభుత్వ పెన్షనర్స్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు కె.దాలినాయుడు అన్నారు. నగరంలోని పెన్షనర్స్ హాల్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రతిరోజు అనేకమంది వృద్ధులు, పెన్షనర్లు సైబర్ నేరగాళ్ల బారినపడి డబ్బులు పోగొట్టుకుంటున్నారన్నారు. సైబర్ నేరగాళ్లు ఎక్కువగా వృద్ధులనే టార్గెట్ చేస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో హెల్పేజ్ ఇండియా సైబర్ టెక్నీషియన్ శ్యామ్ పాల్గొని సైబర్ నేరాలు జరిగే తీరు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

మద్యం తాగించి అత్యాచారం

» వివాహితపై ఇద్దరి అఘాయిత్యం

గంపలగూడెం : వివాహితపై ఇద్దరు యువకులు అత్యాచారం చేసిన సంఘటనపై కేసు నమోదైంది. గంపలగూడెం ఎస్ఐ జి.అనిల్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దళితవాడకు చెందిన వివాహిత తోటమూల సెంటర్‌లోని ఓ షోరూమ్‌లో ఆరునెలలుగా పనిచేస్తోంది. అదే షోరూమ్‌లో పనిచేస్తున్న సొబ్బాల గ్రామానికి చెందిన చెన్నేజు అశోకాచారి, శ్రీకాకుళానికి చెందిన పోతుల రాజేశ్.. ఇద్దరూ శనివారం రాత్రి వివాహితను బలవంతంగా కారులో ఎక్కించుకుని స్థానిక ఎన్టీఆర్ కాలనీ సమీపంలోని గంపలగూడెం ఎన్ఎస్పీ కాల్వకట్ట వైపు తీసుకెళ్లి ఆమెతో బలవంతంగా మద్యం తాగించారు. ఆపై అత్యాచారానికి పాల్పడి పరారయ్యారు. బాధితురాలు స్పృహలోకి వచ్చి విజయవాడలో ఉంటున్న తన మామయ్యకు సమాచారం తెలిపింది. వైద్య పరీక్షల నిమిత్తం బాధితురాలిని తిరువూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మైలవరం ఏసీపీ వై.ప్రసాదరావు, తిరువూరు సీఐ గిరిబాబు, ఎస్సై జి.అనిల్ సంఘటన స్థలాన్ని సందర్శించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అత్యాచారం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్ల కింద నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాపులు సంఘటితం కావాలి

» స్వర్ణోత్సవ సభలో సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమ



మాట్లాడుతున్న బొండా ఉమ

గాంధీనగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా అత్యధిక జనాభా కలిగిన కాపు సామాజిక వర్గంలో ఐక్యత లేకపోవడం దురదృష్టకరమని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆవేదనవ్యక్తం చేశారు. కాపులు ఏకతాటిపై రావాల్సిన ఆవశ్యకత ఉందని పిలుపునిచ్చారు. కాపునాడు స్వర్ణోత్సవ సభ గాంధీనగర్‌లోని జింఖాన గ్రౌండ్‌లో ఆదివారం జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. కాపులు తమ కష్టంతోనే మాత్రమే జీవిస్తారని ఇతరులను మోసం చేసే నైజం కాపులకు లేదన్నారు. కాపుల జోలికి వస్తే సహించేది లేదని హెచ్చరించారు. బడుగు, బలహీన వర్గాల నేత వంగవీటి మోహనరంగా ద్వారా కాపుల శక్తి ప్రపంచానికి తెలిసిందని సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆయన పేరుపై జిల్లాను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పలువురు వక్తలు మాట్లాడుతూ, రాజకీయాల్లో నిర్ణయాత్మకంగా ఉన్న కాపులు రాజ్యాధికారం సాధించాలని పిలుపునిచ్చారు. కాపునాడు నేత ఆకుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో కాపునాడు జాతీయ, రాష్ట్ర అధ్యక్షులు గాళ్ల సుబ్రమణ్యం, అర్జా రామకృష్ణ, జనసేన ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు, అఖిల భారత కూర్మి క్షత్రియ మహాసభ నేతలు ఎల్.వి.పటేల్, వి.ఎస్.నిరంజన్, స్థానిక కాపు నేతలు నవనీతం సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు దూరంగా ఉందాం

» తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా నడుచుకోవాలి : ఈగల్ ఐజీ రవికృష్ణ

» డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడదాం : ఎమ్మెల్యే వెనిగండ్ల

» గుడివాడ సైక్లోథాన్‌కు విశేష స్పందన

» ఉత్సాహంగా పాల్గొన్న 3 వేలమంది విద్యార్థులు



విద్యార్థుల సైకిల్ ర్యాలీలో ఈగల్ ఐజీ రవికృష్ణ, ఎమ్మెల్యే వెనిగండ్ల, ఎస్పీ విద్యాసాగర్, యలవర్తి తదితరులు

గుడివాడ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా చిన్నారులు మంచి వైపు పయనించాలని, మంచి, చెడు అలవాట్ల వ్యత్యాసాన్ని చిన్నారులకు అలవాటు చేయాలని ఈగల్ టీం ఐజీ ఆకే రవికృష్ణ కోరారు. ఆదివారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియం, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుడివాడ శాఖ, గుడివాడ సైక్లింగ్ క్లబ్‌ల



విద్యార్థులను ఉత్సాహపరుస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

సంయుక్త ఆధ్వర్యంలో 'డ్రగ్స్ వద్దు బ్రో-సైకిల్ తొక్కు బ్రో' నినాదంతో నిర్వహించిన గుడివాడ సైక్లోథాన్-2025 10కిలోమీటర్ల ర్యాలీని ఐజీ రవికృష్ణ, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, సుఖదా దంపతులు, స్టేడియం కమిటీ ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావులు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐజీ రవికృష్ణ మాట్లాడుతూ, రాష్ట్రంలో డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామన్నారు. చెడు స్నేహాలతో డ్రగ్స్ బారినపడి ఎందరో అమాయకులు తమ జీవితాలను నాశనం చేసుకున్నారన్నారు. మంచి అలవాట్లతో మనం ఉన్నత స్థాయికి చేరుకోవచ్చునని, చెడు అలవాట్లతో పతనమైపోతామన్నారు. అమ్మానాన్నలు కన్న కలలను నిజం చేసేలా ప్రతిఒక్కరూ మంచివైపు నడవాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ సమాచారం తెలిస్తే ప్రభుత్వ టోల్‌ఫ్రీ నెంబరు 1972కు సమాచారం అందించాలన్నారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ, రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కఠిన చర్యలు చేపడుతున్నారన్నారు. డ్రగ్స్ వద్దు బ్రో మనందరి నినాదం కావాలన్నారు. డ్రగ్స్ వ్యతిరేక ఉద్యమంలో



ఐ లవ్ సైక్లోథాన్ గుడివాడ ప్లకార్డు ఆవిష్కరణ

అందరం భాగస్వామ్యులవుదామని పిలుపునిచ్చారు.

జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు మాట్లాడుతూ, డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమానికి పెద్ద ఎత్తున స్పందన రావడం సంతోషకరమన్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో చిన్నారులు భారీ ఎత్తున అవగాహన ర్యాలీకి తరలివచ్చారన్నారు. సమాజంలో డ్రగ్స్ మహమ్మారిని రూపుమాపడానికి ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని హామీ ఇచ్చారు. తొలుత 'ఫ్రీ సొసైటీ సే నో టూ డ్రగ్స్' ప్లకార్డులను ఆవిష్కరించారు. పట్టణంలోని రహదారులన్నీ విద్యార్థులతో కిటకిటలాడాయి. పట్టణంలో ప్రత్యేకంగా ట్రాఫిక్ డ్రైవ్‌ను చేపట్టారు. ఐఎంఏ గుడివాడ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచారు. ర్యాలీ అనంతరం స్టేడియం కమిటీ తరఫున విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఈగల్ టీం ఐపీఎస్ ఉమామహేశ్వరరాజు, మచిలీపట్నం డీఎస్పీ సీహెచ్ రాజా, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుడివాడ శాఖ అధ్యక్షులు మాగంటి శ్రీనివాస్, స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, బీజేపీ కన్వీనర్ దావులూరి సురేంద్ర బాబు, ఐఎంఏ సభ్యులు డా.పొట్లూరి వంశీకృష్ణ, పట్టణ సీఐలు, ఎస్.ఐలు, ట్రైనీ ఎస్.ఐలు, పోలీసు సిబ్బంది, పలు స్వచ్ఛంద, సామాజిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కౌలురైతుల సంఘం అధ్యక్షుడు రాధాకృష్ణ

రైతుకు నష్టం చేసే విత్తన బిల్లును వ్యతిరేకించాలి

» రౌండ్‌టేబుల్‌లో వక్తలు

గవర్నర్‌పేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రైతాంగానికి నష్టం కలిగించే కేంద్ర విత్తన బిల్లు-2025ను వ్యతిరేకించాలని రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం, రైతు సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశానికి ఏపీ కౌలు రైతుల సంఘం అధ్యక్షుడు వై.రాధాకృష్ణ అధ్యక్షత వహించారు. సమావేశంలో మాజీ వ్యవసాయ శాఖామంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ, రైతు వ్యతిరేక, కార్పొరేట్ శక్తుల అనుకూల కేంద్ర విత్తన బిల్లు-2025 రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తుందన్నారు. రాష్ట్రాల పరిధిలో ఉన్న వ్యవసాయాన్ని కేంద్రం తన అధీనంలోకి తెచ్చుకోవడానికి ఉద్దేశించిందన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతు, కౌలు రైతు సంఘాలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించి అందరి అభిప్రాయాలు తీసుకుని ముసాయిదాపై కేంద్రప్రభుత్వానికి అభిప్రాయాన్ని తెలియజేయాలని కోరారు. రైతు సంఘం సీనియర్ నాయకుడు వై.కేశవరావు తీర్మానాన్ని ప్రవేశపెడుతూ అమెరికాతో ఫ్రీట్రేడ్ అగ్రిమెంట్‌కు సిద్ధమవడానికి కేంద్ర ప్రభుత్వం ఈ ముసాయిదా బిల్లు తీసుకువచ్చిందన్నారు. వ్యవసాయ శాస్త్ర వేత్త బి.శరత్‌బాబు మాట్లాడుతూ, ఈ బిల్లు రైతుల హక్కులను పూర్తిగా నాశనం చేస్తుందన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్త వేణుగోపాల్ మాట్లాడుతూ, రానున్న కాలంలో ఈ చట్టం ద్వారా రైతులకు మరింత నష్టం కలిగే ప్రమాదముందన్నారు. సమావేశంలో రైతుసంఘం నేత కొల్లా రాజమోహన్, కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు, వివిధ రైతు సంఘాల నేతలు పాల్గొన్నారు.

కార్యకర్తలు మనోధైర్యంతో ముందుకుసాగాలి

» సీపీఐ రాష్ట్ర నేత కేవీవీ ప్రసాద్



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న కేవీవీ ప్రసాద్

చల్లపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు మనోధైర్యంతో ముందుకుసాగాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కేవీవీ ప్రసాద్ తెలిపారు. కృష్ణాజిల్లా కౌన్సిల్ సమావేశం ఆదివారం చల్లపల్లిలోని శ్రీచంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ, పార్టీని, అనుబంధ సంఘాలను బలోపేతం చేసే దిశగా ముందుకు సాగాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ ప్రాబల్యం చూపాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత సమాజంలో కీలకపాత్ర పోషిస్తున్న సామాజిక మాధ్యమాలను సద్వినియోగం చేసుకుని పార్టీల ఆవశ్యకతను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. ప్రస్తుతం అన్నదాత పరిస్థితి దయనీయంగా ఉందని, పంటలకు గిట్టుబాటు ధరలు రాక రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైతుల సమస్యలపై డిసెంబరు 10న అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. జనవరి 18న తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మంలో జరగబోయే సీపీఐ శతాబ్ది ఉత్సవ సభను విజయవంతం చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియ త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. అవనిగడ్డ నియోజకవర్గ కార్యదర్శి గుత్తికొండ రామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి ఆజాద్, సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబులు ప్రసంగించగా, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మల్లుపెద్ది రత్నకుమారి, జిల్లా కార్యవర్గసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బుర్జువా పార్టీలకు వ్యతిరేకంగా పార్టీ నిర్మాణం జరగాలి

» సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ

గాంధీనగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): బుర్జువా పార్టీలకు వ్యతిరేకంగా పార్టీ నిర్మాణం జరగాల్సిన ఆవశ్యకత ఉందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ ఉద్ఘాటించారు. భారత కమ్యూనిస్టు పార్టీ శత వసంతాల ముగింపు సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో స్థానిక దాసరిభవన్‌లో నిర్వహించిన వర్క్‌షాప్ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా జనగణన, కులగణన, రిజర్వేషన్లు, సామాజిక న్యాయం' అంశంపై రామకృష్ణ ప్రసంగించారు. జనగణతో పాటు కులగణనతోనే సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. పార్టీ గతంలో కార్మికులు, శ్రామికులు, కర్షకులకు రాజ్యాధికార సాధనకు పోరాడిందని, కుల, మతాలు, సామాజిక అసమానతలపై దృష్టి సారించలేదన్నారు. రాజకీయంగా, సైద్ధాంతిక పరంగా బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ను ఎదుర్కొనే శక్తి కేవలం ఒక్క కమ్యూనిస్టు పార్టీ మాత్రమే అన్నారు. 'వర్తమాన రాజకీయ పరిస్థితులు, కమ్యూనిస్టు ఉద్యమం' అంశంపై పార్టీ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య ప్రసంగించారు. దేశంలో పెరిగిన ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం, పేదరికంపై ప్రజల దృష్టి మళ్లించేందుకు వికసిత్ భారత్ అంటూ ప్రధాని మోదీ దేశప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. అటవీ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టేందుకు ఆపరేషన్ కగార్ పేరుతో అమాయక గిరిజన ప్రజల ప్రాణాలు తీస్తున్నారని మండిపడ్డారు. పార్టీ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తూము కృష్ణయ్య, లంక దుర్గారావు, బుడ్డి రమేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పరుచూరి రాజేంద్ర బాబు, మహిళా సమాఖ్య నేత పంచదార్ల దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.



» అంతకు మించి వేగానికి అనుమతి లేదు

» చిన్న అవుటపల్లి నుంచి కాజ వరకు అవాంతరాలు లేని ప్రయాణం

» మూడు వరసల రోడ్డు కావటంతో.. వేగపరిమితి నిర్దేశం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

విజయవాడ వెస్ట్ బైపాస్‌పై గరిష్టంగా 100 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించవచ్చు. చిన్న అవుటపల్లి నుంచి గొల్లపూడి వరకు ప్యాకేజీ-3, గొల్లపూడి నుంచి కాజవరకు ప్యాకేజీ-4లో భాగంగా త్వరలో ప్రారంభం కానున్న విజయవాడ బైపాస్‌పై స్పీడ్ లిమిట్ ఎంత ఉండాలన్నది జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్) నిర్ణయించింది. విజయవాడ వెస్ట్ బైపాస్‌పై గంటకు 100 కిలోమీటర్ల వేగంతో వెళ్లవచ్చు. అంతకు మించి వేగంతో వెళ్లటానికి లేదు. విజయవాడ వెస్ట్ బైపాస్‌ను ఆరువరుసల విధానంలో నిర్మించారు. సెంట్రల్ మీడియం 3 లేన్ల చొప్పున విభజిస్తుంది. బైపాస్‌లోకి ఒకసారి ప్రవేశిస్తే.. ఎక్కడా అవాంతరం అనేది రాదు. ఎక్కడా ఆగాల్సిన పనిలేదు. చిన్న అవుటపల్లి దగ్గర బైపాస్‌లోకి ప్రవేశిస్తే.. నేరుగా కాజ దగ్గర ల్యాండ్ అయ్యేవరకు కూడా ఎక్కడా వాహనం ఆగదు. ఫ్లై ఓవర్లు, ఆర్ఓబీలు, వెహికల్ అండర్ పాస్‌లు, సర్వీసు స్లిప్ రోడ్లు ఉండటం వల్ల వాహనాలు అవాంతరాలు లేకుండా ముందుకువెళతాయి. మూడు లేన్లు కావటంతో వాహనాలు వేగంగా వెళ్లటానికి అవకాశం ఉంటుంది. గరిష్ట వేగం 100 కిలోమీటర్లకు నిర్దేశించటం జరిగింది. ఇంతకు మించి వెళ్లటానికి లేదు. ఒక వేళ వెళితే.. సెన్సార్లు పసిగట్టేస్తాయి. వంద దాటి వెళ్లే ఓవర్ స్పీడ్ డేటా ఎన్‌హెచ్ డేటాబేస్‌కు చేరుతుంది. ఆ తర్వాత జరిమానాలు విధించటం జరుగుతుంది.

అర్థగంటలోనే గొల్లపూడి..

విజయవాడ మీదుగా హైదరాబాద్ వెళ్లే వాహనదారులకు విజయవాడ గన్నవరం నుంచి విజయవాడ దాటి వెళ్లటానికి గంట నుంచి గంటన్నర సమయం పైగా పడుతోంది. ట్రాఫిక్ సమస్యలను బట్టి ఇంకా పెరుగుతుంది. చిన్న అవుటపల్లి దగ్గర వెస్ట్ బైపాస్ ఎక్కితే గరిష్టంగా అర్థగంట సమయంలోనే గొల్లపూడికి చేరుకుంటున్నారు. విజయవాడలోకి బైపాస్ మీదుగా సింగ్‌నగర్, నున్న, కండ్రిక, జక్కంపూడి, పాతపాడుల నుంచి రావటానికి కేవలం 20నిమిషాలు మాత్రమే పడుతోంది. దీంతో ఏలూరు వైపు నుంచి వచ్చే వాహనాలకు కానీ, గుంటూరు వైపు నుంచి వచ్చే వాహనాలకు కానీ విజయవాడకు రాకపోకలు సాగించాలంటే చాలా తక్కువ సమయం పడుతుంది.

జిల్లాలో రోడ్ల విస్తరణకు టెండర్ల ఆహ్వానం

విజయవాడ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు ప్రాంతాల రోడ్ల విస్తరణ, మరమ్మతులకు రోడ్లు భవనాల(ఆర్అండ్‌బీ) సంస్థ తాజాగా టెండర్లు ఆహ్వానించింది. అధ్వాన స్థితిలో ఉన్న, రద్దీ అధికంగా ఉండే కొన్ని ప్రాంతాల రహదారులను మరమ్మతులతో విస్తరణ చేయడానికి ఆర్అండ్‌బి నిర్ణయించింది. జిల్లాలో నాలుగు రహదారులకు సంబంధించి మొత్తం రూ.12..44 కోట్లతో పనులు చేయడానికి నిర్ణయించింది. నూజివీడు-మైలవరం రోడ్డును రూ.4.02 కోట్లతో, చిల్లకల్లు, వేదాద్రి, బండిపాలెం, కొనకంచి(జగ్గయ్యపేట-యాదాద్రి) రోడ్డుకు రూ.3.21 కోట్లతో, జగ్గయ్యపేట-షేర్ మహమ్మద్‌పేట రోడ్డుకు రూ.2.71 కోట్లు, కేజీవై బైపాస్, ఎన్‌హెచ్65-గోకరాజుపల్లి రోడ్డు వయా గండేపల్లి, నందలూరు, తాటిగుమ్మి రోడ్డును రూ.2.40 కోట్లతో మరమ్మతులకు టెండర్లను ఆహ్వానిస్తూ ఆర్అండ్‌బీ ఉత్తర్వులిచ్చింది.

రేషన్ మాయ!

(5వ పేజీ తరువాయి)

ఇవ్వాల్సిందే. బఫర్ గోడౌన్లకు వచ్చిన బియ్యం బస్తాలను ఖచ్చితంగా వేబ్రిడ్జి మీద పెట్టి తూకం తూయాలి. బఫర్ గోడౌన్లలో వేబ్రిడ్జితో తూకం వేయటంతో తేడాలు కనిపిస్తున్నాయి. కానీ, మిల్లర్లతో ఉన్న రహస్య లావాదేవీల కారణంగా తూకాన్ని పక్కన పెట్టి కాగితాల మీద నిర్ణీత పరిమాణంలో సరుకు ఉందని ఎంఎల్ఎస్ పాయింట్లకు పంపుతున్నారు.

ఎంఎల్ఎస్ పాయింట్లలో కనిపించని వేబ్రిడ్జిలు!

వాస్తవానికి ఎంఎల్ఎస్ పాయింట్లకు వచ్చే బియ్యం ఆ స్థాయిలో ఉండటం లేదన్న ఫిర్యాదులు పెద్ద ఎత్తున వస్తున్నాయి. బఫర్ గోడౌన్ల నుంచి ప్రతి నెలా వందలాది టన్నుల బియ్యం ఎంఎల్ఎస్ పాయింట్లకు వస్తుంది. ఎంఎల్ఎస్ పాయింట్లలో చాలా వరకు వేబ్రిడ్జిలు ఉండటం లేదని సమాచారం. బఫర్ గోడౌన్ల నుంచి కాగితాల మీద ఇంత పరిమాణం ఉందని వస్తున్న బియ్యం బస్తాలను ఎంఎల్ఎస్ పాయింట్లలో తూకం వేయటం ద్వారా ఎంత ఉందో నిర్ధారించవచ్చు. కానీ, ఎంఎల్ఎస్ పాయింట్లలో అలాంటిదేమీ జరగటం లేదని తెలిసింది. ఎంఎల్ఎస్ పాయింట్లలో వే బ్రిడ్జిలు అనేవి మచ్చుకు కూడా కనిపించడంలేదని సమాచారం. బఫర్ గోడౌన్లు, ఎంఎల్ఎస్ పాయింట్లలో వేబ్రిడ్జిల తూకం ద్వారా వాటి పరిమాణాన్ని ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తే అసలు ఎలాంటి సమస్యా రాదు. బఫర్ గోడౌన్లకు, ఎంఎల్ఎస్ పాయింట్లకు కేంద్రం హ్యాండ్లింగ్ లాస్, ట్రాన్సిస్ట్ లాస్‌లను మాత్రమే నిర్ణయిస్తుంది. హ్యాండ్లింగ్ లాస్ అంటే.. హమాలీలు ఇనుమ హుక్కులతో బస్తాలను దించేటపుడు బియ్యం పోతుంది కాబట్టి దానిని హ్యాండ్లింగ్ లాస్ పరిధిలోకి తీసుకువస్తారు. ట్రాన్సిస్ట్ లాస్ అంటే .. ఇలా వచ్చిన బస్తాలను స్టేజ్ -1, స్టేజ్ -2 రవాణా సందర్భాలలో బియ్యం కారే అవకాశం ఉంటుంది. అందుకే దీనిని ట్రాన్సిస్ట్ లాస్ అంటారు. కాబట్టి ఈ రెండింటిని మాత్రమే నిర్దేశించటం జరిగింది. ఈ రెండూ కలిపితే మహా అయితే ఓ 100, 150 గ్రాములు ఉంటుంది. ఇది కూడా కాదని బస్తాలలో బియ్యం తగ్గిపోతోంది. ఎంఎల్ఎస్ పాయింట్లకు వచ్చే బియ్యం బస్తా 51 కేజీలు ఉండాల్సి ఉండగా.. 48, 49 కేజీలు మాత్రమే ఉంటోందని సమాచారం. దీంతో ఎంఎల్ఎస్ పాయింట్ల నిర్వాహకులు కూడా తూకం వేయకుండా కాగితాల మీద లెక్కలతో డీలర్లకు అందిస్తున్నారు. ఎంఎల్ఎస్ పాయింట్లలో అవినీతి సిబ్బంది కొందరు తమ లాభం కూడా చూసుకుంటున్నారని తెలిసింది. అలాగే ఇంకాస్త ఇక్కడ పక్కదారి పట్టించి, లేని సరుకును ఉన్నట్టుగా చూపిస్తూ డీలర్ల నెత్తిన తరుగును మోపుతున్నారని సమాచారం. ఎంఎల్ఎస్ పాయింట్ల ఇన్‌చార్జిలుగా రెవెన్యూ నుంచి చాలా మంది రావటం, వారికి అవగాహన లేకపోవటం వల్ల ఎలా వచ్చిన బియ్యాన్ని అలా తీసుకుని, అదే విధంగా ఇచ్చేస్తున్నారని తెలిసింది. కొన్ని ఎంఎల్ఎస్ పాయింట్లు మరీ దారుణంగా తయారయ్యాయని విమర్శలు ఉన్నాయి. వెయ్యి టన్నుల బియ్యం వస్తే 500 టన్నుల బియ్యం కూడా ఉండని పరిస్థితి నెలకొందని సమాచారం.

గోనె సంచుల వ్యవహారంలో మాయ

ప్రతి ఏడాది మిల్లర్లకు ప్రభుత్వం కొత్త గోనె సంచులను ఇస్తుంది. తిరిగి వచ్చేటపుడు మాత్రం ఆ గోనె సంచులు రావడంలేదని తెలిసింది. కుట్లు వేసినవి, మాసికలు ఉన్నవి వస్తున్నాయని సమాచారం. ఏడాదిలోనే గోనె సంచులు ఈ విధంగా దెబ్బతింటాయా అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. సంచుల బలం తగ్గిపోయి బలహీనంగా మారుతున్నాయి. ఊరికే రంధ్రాలు పడుతున్నాయి. ఈ గోనె సంచుల వ్యవహారాల మీద కూడా ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. అలాగే బఫర్ గోడౌన్లలోకి వచ్చే బియ్యానికి పురుగులు పట్టకుండా గోడౌన్ లోపల పురుగుల మందు పిచికారీ చేస్తారు. కానీ బియ్యంలో పురుగులు వస్తున్నాయన్న ఫిర్యాదులు కూడా ఉన్నాయి. ఎందుకు వస్తున్నాయన్న అంశాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

మైనింగ్ వార్!

(5వ పేజీ తరువాయి)

ప్రాంతాన్ని ఆక్రమించుకున్నారన్న ఆరోపణలు కూడా వచ్చాయని నోటీసులో తెలిపారు. సర్వే నెంబర్ 49/1లో స్టోన్ క్రషింగ్, రోడ్డు మెటల్ స్టాక్ చేయటం, రవాణా వ్యవహారాలలో ఉల్లంఘనలను గుర్తించామని పేర్కొన్నారు. ఇదే సర్వే నెంబర్‌లో రెండు స్టోన్ క్రషర్స్ పనిచేస్తున్నట్టు గుర్తించామని తెలిపారు. తనిఖీల సమయంలో మినరల్ డీలర్ లైసెన్స్, జీఎస్టీ రిజిస్ట్రేషన్స్ చూపమని అడిగినపుడు సిబ్బంది తెలియదని చెప్పారని, అలాగే తాము గుర్తించిన స్టాక్ వివరాలను కూడా నోటీసులో పొందుపరిచారు. అక్రమంగా నిల్వలకు పాల్పడిన మీపై ఎందుకు చర్యలు తీసుకోకూడదని ప్రశ్నించారు. చట్టబద్ధమైన అంగీకారం లేకుండా ఖనిజాన్ని తీయటం, రవాణా చేయటం, నిల్వ చేయటం ఏపీ ఎంఎంసీ చట్టం నియమం 26(1)(సీ) కిందకు వస్తుందని స్పష్టం చేశారు. నోటీసు ఇచ్చిన 15 రోజుల్లో వివరణ ఇవ్వని పక్షంలో ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

అన్నదాతల్లో దిత్వా గుబులు

(5వ పేజీ తరువాయి)

సైతం అలజడి ఉంటుందని పేర్కొన్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. తుఫాను ప్రభావంతో సోమవారం కృష్ణా జిల్లాలో ఓ మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	132,141, 152
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 665

కూటమి పాలనలో మహిళలకు పెద్దపీట

పటమట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి సర్కార్ మహిళలకు పెద్ద పీట వేస్తోందని టీడీపీ యువ నేత గద్దె క్రాంతికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు. ప్రతి మహిళ ఆర్థిక స్వాలంబన సాధించేందుకు, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేలా ప్రభుత్వం అనేక పథకాలను వారి కోసం అమలు చేస్తుందన్నారు.



ప్రమాదకరంగా మారిన విజయనగర్ కాలనీ సెంటర్

ప్రమాదాలకు నిలయంగా విజయనగర్ కాలనీ సెంటర్

భారతీనగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విజయనగర్ కాలనీ సెంటర్ ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈసెంటర్ గుణదల, లయోలా కళాశాల, క్రీస్తురాజుపురం వెళ్లే మూడు రోడ్లు కూడలి కావడంతో నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. గతంలో ఈ సెంటర్లో వాహనదారుల వేగం తగ్గించడానికి రోడ్డుపై స్పీడ్‌బ్రేకర్లు వేశారు. వాహనాల రాకపోకలకు అవి ధ్వంసమైపోయాయి. ఈ రోడ్లపై వాహనదారులు వేగంగా రావడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి తక్షణమే వాహనదారులు వేగాన్ని తగ్గించడానికి స్పీడ్‌బ్రేకర్స్ వేయాలని వారు కోరుతున్నారు.

పొట్టి శ్రీరాములు పాఠశాలకు సౌకర్యాలు కల్పిస్తాం

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

కృష్ణలంక, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక పొట్టి శ్రీరాములు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల ఆవరణలోని క్రీడా మైదానంతో పాటుగా పాఠశాలకు అన్ని సౌకర్యాలను కల్పించి పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. పొట్టి శ్రీరాములు హైస్కూల్‌లో అభివృద్ధి పనులకు శ్రీరామ్ ఫైనాన్స్ కంపెనీ సీఎస్ఆర్ కింద విరాళంగా ఇచ్చిన రూ.35 లక్షలతో చేపట్టనున్న పనులపై ఆదివారం ఉదయం ఎమ్మెల్యే గద్దె, అధికారులు, స్థానికులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ ఈ ప్రాంతవాసులకు ఉపయోగకరంగా ఉండాలని ప్రాథమిక పాఠశాల, హైస్కూల్, జూనియర్ కళాశాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. 2014-19లో నందమూరి తారక రామారావు పేరుతో క్రీడా మైదానాన్ని నిర్మాణం చేయించినట్టు గుర్తుచేశారు. స్కూల్ చుట్టూ ప్రహరీ, ప్రాంగణం అభివృద్ధికి అవసరమయ్యే నిధులను సమకూర్చాల్సిందిగా తాను శ్రీరామ్ ఫైనాన్స్ వారిని కోరగా వారు స్పందించి సీఎస్ఆర్ ఫండ్స్ కింద రూ.35 లక్షల చెక్కును కలెక్టర్‌కు అందజేశారన్నారు. కలెక్టర్ ఆ నిధులను మున్సిపల్ కమిషనర్‌కు అందజేశారన్నారు. వారు అంచనాల సిద్ధం చేసి పనులు ప్రారంభిస్తారన్నారు. ఈ గ్రౌండ్‌ను క్రికెట్ స్టేడియంగా తీర్చిదిద్దాలన్నదే తన లక్ష్యమని గద్దె తెలిపారు. మంత్రి లోకేశ్ దృష్టికి కూడా తీసుకెళ్లానన్నారు. అంచనాలు రూపొందించి ఇస్తే పరిశీలిస్తానని లోకేశ్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. నిత్యం సుమారు 500 మంది వాకింగ్ చేస్తుంటారన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని మైదానాల్లో ఉదయం 4 నుంచి 6 గంటల వరకు వాకింగ్‌కు అనుమతివ్వాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చిందన్నారు. శ్రీరామ్స్ కంపెనీ ప్రతినిధి నాగేంద్ర మాట్లాడుతూ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తమను కోరడంతో వెంటనే తమ కంపెనీ మేనేజింగ్ డైరక్టర్స్, ఇతర అధికారులైన ముళ్లమూరి వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లి వారి అనుమతితో రూ.35లక్షల సీఎస్ఆర్ ఫండ్స్ కింద స్కూల్ అభివృద్ధికి విరాళంగా ఇచ్చినట్లు వెల్లడించారు. టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరిపర్తి నామేశ్వరరావు, నేతలు వేములపల్లి రంగారావు, మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ కొర్రా అప్పన్న, జనసేన డివిజన్ అధ్యక్షుడు కొవ్వూరి కిరణ్ బాబు, మోటేపల్లి చిన్నా, కేశనం భావన్నారాయణ, నిమ్మల జ్యోతిక, వెన్నా శంకర్, గల్లా శ్రీను, గద్దె రమేష్, శ్రీరామ్ ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు జి.గోపాల్, సయ్యద్ ఉస్మాన్, కె.సతీష్ పాల్గొన్నారు.



శ్రీరామ్ ఫైనాన్స్ ప్రతినిధులతో పర్యటించిన ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

కన్నుల పండువగా శ్రీనివాస కల్యాణం

పటమట: 12వడివిజన్ అయ్యప్పనగర్‌లో అయ్యప్ప భక్త బృందం గురుస్వామి బుజ్జి, ఆచార్యులు పవన్ గురూజీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి శ్రీనివాస కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు.

ముగిసిన కాలేజీ టీచర్స్ బ్యాడ్మింటన్ పోటీలు

మొగల్రాజపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పీబీ సిద్ధార్థ కళాశాలలో నిర్వహిస్తున్న ఏపీ టీచర్స్ బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. విజేతలకు సిద్ధార్థ అకాడమీ కోశాధికారి సూరెడ్డి వెంకటేశ్వరరావు, కన్వీనర్ నిమ్మగడ్డ లలిత్ ప్రసాద్, ప్రిన్సిపాల్స్ డాక్టర్ మేకా రమేష్, చుండి వెంకటేశ్వర్లు, క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) మాజీ చైర్మన్ అంకమ్మ చౌదరి బహుమతి ప్రదానం చేశారు. పురుషుల డబుల్స్ విజేతగా నిలిచిన ప్రవీణ్‌కుమార్, అనిల్‌కుమార్‌కు (వి విట్) నేషనల్ లితో ట్రోఫీ, మహిళల డబుల్స్ విజేతలుగా నిలిచిన బీ కృష్ణదీపిక, రమాదేవిలకి (ఎన్టీయార్ వీఐటీ కాలెజి) బోయపాటి ట్రోఫీని, మిక్సిడ్ డబుల్స్ విభాగంలో విజేతలు నాగసతీష్, కృష్ణ దీపిక విజయ ట్రోఫీని, వెటరన్ డబుల్స్ విజేతలు జగదీష్, అబ్దుల్ కలాం (పీవీపీ ఇంజనీరింగ్ కళాశాల) పర్వతనేని బ్రహ్మయ్య ట్రోఫీని, సూపర్ వెటరన్ డబుల్స్ విజేతలు జీ సాంబశివరావు, జే రమేష్ (కేవీటీఎస్ అక్షర)లకు సూర్యనారాయణ ట్రోఫీని ప్రధానం చేశారు. పురుషుల బెస్ట్ ప్లేయర్‌గా వెలగపూడి ట్రోఫీని ఎన్ వంశీ నరసింహారావు (బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల రాజమండ్రి), మహిళల ఉత్తమ క్రీడాకారిణిగా ఆంధ్రభారతి ట్రోఫీని వైవీ నందింగిన్ (సిద్ధార్థ డీమ్డ్ వర్సిటీ)కి, సూపర్ వెటరన్ బెస్ట్ ప్లేయర్‌గా బీ సీతారామిరెడ్డి ట్రోఫీని జే రమేష్ (చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాల, గుంటూరు), వెటరన్ బెస్ట్ ప్లేయర్‌గా బ్రహ్మయ్య ట్రోఫీని జగదీష్ (పీవీపీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ)లకు అందించారు. రాష్ట్ర స్థాయిలో 5 విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో మొత్తం 38 వర్సిటీ కళాశాలల నుంచి 328మంది క్రీడాకారులు పాల్గొన్నారు.



మహిళల డబుల్స్ విజేతలు బి.కృష్ణదీపిక, రమాదేవి

ప్రమాదకరంగా వాటర్‌పైపులు

భారతీనగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రమేష్ ఆసుపత్రి జంక్షన్ వద్ద మెక్ డొనాల్డ్ సమీపంలోని ఫ్లై ఓవర్‌పై పడిన వర్షపునీరు కిందకు రావడానికి పిల్లర్ సమీపంలో పైనుంచి కిందనున్న గ్రీనరీలోకి వచ్చేలా వాటర్ పైపులను ఏర్పాటు చేశారు. ఇటీవల వీచిన గాలికి అవి కిందకు వేలాడుతూ సర్వీస్ రోడ్లో ప్రమాదకరంగా మారాయి. దీంతో పీఅండ్‌టీ కాలనీ వైపునున్న సర్వీస్ రోడ్డు నుంచి జాతీయ రహదారిలోకి ప్రవేశించే సమయంలో గాలికి వేలాడుతున్న వాటర్ పైపులు తగులుతున్నాయని కార్లు, ద్విచక్రవాహనదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి ఈ పైపులను పైకి ఏర్పాటు చేయాలని వాంనను కోరుతున్నారు.



రమేష్ ఆసుపత్రి జంక్షన్ సమీపంలో ప్రమాదకరంగా వేలాడుతున్న వాటర్ పైపులు



బాబా జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఫైట్‌మాస్టర్స్ రామ్‌లక్ష్మణ్

శాకాహారమే ముద్దు.. మాంసాహారం వద్దు

పటమట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మహావతార్ బాబా జన్మదిన వేడుకల సందర్భంగా హిమాలయ అమరగురువు ఆర్యశ్రీ మహావతార్ బాబా ట్రస్టు నిర్వహణలో బాబా జన్మదిన వేడుకలను ట్రస్టు ఆధ్వర్యంలో పటమటలోని ఒక కల్యాణ మండపంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ట్రస్టు వ్యవస్థాపకుడు అమన్ హనికాన్ దంపతులు భానుప్రకాష్ - ఉషాగోపాల్ నేతృత్వంలో జ్ఞాన సత్సంగం నిర్వహించారు. ఫైట్‌మాస్టర్స్ రామ్ లక్ష్మణ్ సోదరులతోపాటు 111 ఏళ్ల హిమాలయ యోగి సంతు సదానంద్ పాల్గొన్నారు. అనంతరం వారంతా శాకాహారమే ముద్దు- మాంసాహారం వద్దంటూ ప్లకార్డులు చేతబూని పటమట వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. పత్రీజీ స్పిరిట్యూవల్ మూమెంట్ సభ్యులు పాల్గొన్నారు.

పీబీ సిద్ధార్థ విద్యార్థులకు స్వచ్ఛతాహి సేవపై అవగాహన

మొగల్రాజపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు పీబీ సిద్ధార్థ విద్యార్థులకు స్వచ్ఛతాహి సేవపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. 16వ డివిజన్ పరిధిలోని వర్మీకంపోస్టు ప్లాంట్‌లో వీఎంసీ వర్మీ కంపోస్టు ప్లాంట్ల వ్యవస్థాపక గౌరవ సలహాదారు గ్రీన్ ఇండియా 2023 అవార్డు గ్రహీత వెంకట సుబ్బారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్షేత్రస్థాయిలో చెత్త విభజన, సేకరణ, నిర్వహణ, నిర్మూలన, సక్రమ వినియోగం ద్వారా నాడెప్ కంపోస్టు, వానపాముల ఎరువు తయారీ ప్రక్రియలపై విద్యార్థులకు వివరించారు. శ్రీమద్దుకూరి సిద్ధార్థ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. 16వ డివిజన్ శానిటరీ అధికారి జమలయ్య, అగ్రికల్చర్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ తిరుపతయ్య, రసాయిన ఎరువుల, పురుగు మందుల డీలర్లు, సిద్ధార్థ కళాశాల డైరెక్టర్ వేమూరి బాబురావు, బోటనీ అధ్యాపకుడు శ్రీనివాస్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



వర్మీకంపోస్టు ప్లాంటులో అవగాహన కల్పిస్తున్న వెంకట సుబ్బారావు

సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ రెండో రోడ్డు పూర్తయ్యేదెప్పుడు..!



రాళ్లు తేలుతున్న రోడ్డు

భారతీనగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మధ్యలో నిలిచిపోయిన రోడ్డు నిర్మాణ పనులతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 4వ డివిజన్ పరిధిలోని సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ 2వ రోడ్డును 3 నెలల కిందట సిమెంట్ రోడ్డుగా ఏర్పాటు చేయాడానికి పనులు ప్రారంభించారు. లయోలా కళాశాల రోడ్డు నుంచి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ కార్యాలయం చివర వరకు రోడ్డును సిమెంట్ రోడ్డుగా ఏర్పాటు చేయడానికి పనులు ప్రారంభించారు. మొదటి విడత ఈ రోడ్డులోని లలిత నిలయం అపార్టుమెంట్ సెంటర్ నుంచి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ కార్యాలయం చివర వరకు రోడ్డును ఏర్పాటు చేశారు. 2వ విడత లలిత నిలయం అపార్టుమెంట్ సెంటర్ నుంచి లయోలా కళాశాల రోడ్డు వరకు నిర్మాణ పనులను మధ్యలో నిలిపివేశారు. ఈ నిర్మాణంలో భాగంగా రోడ్డుపై కంకరరాళ్లను చదును చేసి వదిలివేశారు. అంతేకాక రోడ్డు నిర్మాణంలో భాగంగా లలిత నిలయం అపార్టుమెంట్ ఏరియా 4రోడ్లు కలిసే సెంటర్‌లో కావడంతో వెటర్నరీ కాలనీ నుంచి సచివాలయానికి వెళ్లే రోడ్డుకు మధ్యలో కంకర రాళ్లగుట్టను ఏర్పాటు చేశారు. రోడ్డు నిర్మాణ పనులు నిలిచి సుమారు 2నెలలు గడిచిపోవడంతో వాహనాల రాకపోకలకు రాళ్లు పైకితేలి ప్రమాదకరంగా మారాయి. లలిత నిలయం అపార్టుమెంట్ సెంటర్‌లో రోడ్డుకు మధ్యలో ఏర్పాటు చేసిన కంకర రాళ్ల గుట్ట ప్రమాదకరంగా మారిందని కాలనీ వాసులు వాపోతున్నారు. రాత్రి సమయంలో ఈరోడ్డుపై రాకపోకలు సాగించాలంటే ఇబ్బందిగా ఉందని పెద్దలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా ఉన్న కంకరరాళ్ల గుట్ట



ప్రారంభమై ఖాళీగా ఉన్న కంపాక్టర్

ఆటోనగర్‌లో నిరుపయోగంగా కంపాక్టర్

ఆటోనగర్: జవహర్ ఆటోనగర్‌లో తయారైన చెత్తను గుంటూరు జిల్లాలోని జిందాల్‌కు తరలించేందుకు కొనుగోలు చేసిన కంపాక్టర్‌ను ప్రారంభించి 15 రోజులు దాటినా నేటివరకు వినియోగంలోకి రాలేదు. 42 టన్నుల సామర్థ్యం గల చెత్త తరలింపు వాహనమైన కంపాక్టర్‌ను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, ఆటోనగర్ ఐలా సర్వీస్ సొసైటీ రూ.1.18 కోట్ల వ్యయంతో కొనుగోలు చేసింది. దీనిలో 50శాతం ఐలా సమకూర్చగా మిగిలిన 50 శాతం నిధులు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ భరిస్తోంది. ఇది వినియోగంలోకి రాకపోవడంతో ఆటోనగర్‌లో సేకరించిన చెత్తను పాతపద్ధతిలోనే చిన్న వాహనాల్లో జిందాల్‌కు తరలిస్తున్నారు. దీంతో చెత్త సమస్య ఓ కొలిక్కిరాలేదు. చెత్తకుప్పలు ఎక్కడపడితే అక్కడే దర్శనమిస్తోన్నాయి. ఐలా, స్వచ్ఛాంధ్ర అధికారులకు కంపాక్టర్ విషయంలో ఎంవోయూ విషయంలో జాప్యం జరగడం వల్లే వినియోగంలోకి రాలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై ఐలా కమిషనర్ కే బాజ్జీని ఆదివారం వివరణ కోరగా రెండు రోజుల్లో కంపాక్టర్ అందుబాటులోకి వస్తుందన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌లో అధికారి అందుబాటు లేకపోవడం వల్లే జాప్యమైందన్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చొరవచూపి కంపాక్టర్ వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

అధికారులు నిర్లక్ష్యం వీడాలి

● సీపీఐ నగర కార్యదర్శి కోటేశ్వరరావు

మొగల్రాజపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఏ డివిజన్‌లో చూసినా సమస్యలు తిష్ట వేశాయని వీఎంసీ అధికారులు నిర్లక్ష్యం వదిలి సమస్యల పరిష్కారానికి పనిచేయాలని సీపీఐ నగర కార్యదర్శి జీ కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం 6వ డివిజన్‌లో పర్యటించారు. స్థానికుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ డివిజన్ తో పాటు చాలా డివిజన్లలో రోడ్లు, యూజీడీ, మంచినీళ్ల సమస్య, సైడు కాల్వల్లో మురుగు సమస్య, దోమల సమస్య ఉందన్నారు. భగత్ సింగ్ రోడ్డు నుంచి గులాంమొహీద్దీన్ నగర్ రామాలయం వరకు ఎపుడో 20ఏళ్ల క్రితం నిర్మించిన రోడ్డు పూర్తిగా ధ్వంసమైందన్నారు. నగర కార్యవర్గ సభ్యులు అప్పరబోతు రాము, మాజీ కార్పొరేటర్ ఇజ్జాడ లక్ష్మీ, స్థానిక డివిజన్ సహాయ కార్యదర్శులు అసిరినాయుడు, కాళ్ల శ్రీనివాసరావు, పాపినాయుడు, చిట్టప్పడు, వేముల వెంకట్రావు, అలీ, వెంకట్రావు, ఇక్బాల్, బేగం పాల్గొన్నారు.

నేడు పీజీఆర్ఎస్ ద్వారా వినతుల స్వీకరణ

కలెక్టరేట్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి వినతుల స్వీకరించడం జరుగుతుందని కలెక్టర్ లక్ష్మీశ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారానికి పీజీఆర్ఎస్ ద్వారా అర్జీల స్వీకరణ చేపట్టనున్నట్టు తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మున్సిపల్ మండల కేంద్రాల్లో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. అలాగే అర్జీదారులు తమ అర్జీలను మీకోసం.ఏపీ.జీవీ.ఇన్ వెబ్ సైట్ నందు నమోదు చేసుకోవచ్చని, నమోదైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారం తెలుసుకొనేందుకు 1100కి నేరుగా కాల్ చేయవచ్చన్నారు.

ఇళ్ల స్థలాలు, పెన్షన్లు ఇప్పించండి

● 14, 18వ డివిజన్ ప్రజాదర్బార్‌లో ప్రజల వినతులు

కృష్ణలంక, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కృష్ణలంక 18వ డివిజన్‌లో ఆదివారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి వినతులు వెల్లువెత్తాయి. టీడీపీ డివిజన్ మాజీ అధ్యక్షుడు వేముల దుర్గారావు ఆధ్వర్యంలో తమ్మిన పోతరాజు వీధిలోని టీడీపీ కార్యాలయం వద్ద ఈ ప్రజాదర్బార్ నిర్వహించారు. టీడీపీ 17వ డివిజన్ అధ్యక్షురాలు రాయి రంగమ్మ, వేముల దుర్గారావుతో పాటు టీడీపీ నేతలు పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతుల్లో 90శాతం దరఖాస్తులు తమకు ఇల్లు లేవని, పింఛన్లు కావాలంటూ విన్నవించుకొన్నారు. వాటిని స్వీకరించిన వేముల దుర్గారావు, రాయి రంగమ్మ.. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో చెప్పి అందరికీ ఇల్లు, పింఛన్లు వచ్చేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ నేతలు అంబటి కాశయ్య, కొమెర శ్రీను, గంగాధర్, నాగవరపు దుర్గారావు, ఎస్‌కే సునాబీ, బొప్పన బాబు, అమీనా, జనసేన డివిజన్ అధ్యక్షుడు వెంకట్, నాయకులు ధనమూర్తి పాల్గొన్నారు.



18వ డివిజన్‌లో ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న టీడీపీ నాయకులు


రామలింగేశ్వరనగర్: స్థానిక 14వ డివిజన్ అంబేద్కర్ నగర్‌లో ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రతి పేదవాడికి ఇంటిస్థలం, నివాసం ఉండాలనే ముఖ్య ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్‌లో డివిజన్ ప్రజలు తమ అర్జీలను కమిటీ సభ్యులకు ఆదివారం అందజేశారు. టీడీపీ డివిజన్ అధ్యక్షుడు కర్ల రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ దర్బార్‌లో టీడీపీ 14వ డివిజన్ ఇన్‌చార్జి గరికిపాటి బద్రి, జనసేన అధ్యక్షుడు యడ్లపల్లి నాగరాజు, బీజేపీ అధ్యక్షుడు యార్లగడ్డ సందీప్, రేపాకుల ప్రసాద్, రాధారపు ఎల్లబాబు, చిట్టి బొమ్మ గణేష్, కుమార్, నాజర్ వలి, కెల్లా రమేష్, వెంకట్రావు, షేక్ ఫాతిమా, ఝాన్సీ పాల్గొన్నారు.



పటమట అంబేద్కర్ నగర్‌లో అర్జీలను కమిటీ సభ్యులకు అందజేస్తున్న డివిజన్ ప్రజలు

జేఈఈ మెయిన్ ఫిజిక్స్ ప్రిపరేషన్

కాన్సెప్ట్ తెలిస్తే కష్టం కాదు



టెన్త్, ఇంటర్ వంటి అకడమిక్ పరీక్షలకు, కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌కు తేడా ఉంది. అకడమిక్ పరీక్షల్లో మంచి మార్కుల కోసం పాఠ్య పుస్తకాల్లోని విజ్ఞానం సరిపోతుంది. అదే పోటీపరీక్షలకు లోతుగా అధ్యయనం చేయాలి. సిలబస్‌కు అనుగుణంగా ప్రిపేర్ కావాలి. మోడల్ పేపర్స్ సాధన చేయాలి. మాక్ టెస్టులకు హాజరుకావాలి. అలాగే ప్రతి మార్కు మంచి ర్యాంకు సాధనలో కీలకమే. ఈ నేపథ్యంలో జేఈఈ మెయిన్‌లో ఫిజిక్స్‌కు ఎలా ప్రిపేరైతే మంచిదో పరిశీలిద్దాం.

సబ్జెక్టు పరిజ్ఞానానికి తోడు ప్రాబ్లెమ్ సాల్వింగ్ స్కిల్స్ తెలియాలి. అందుకోసం క్లిష్టమైన వాటిని విశ్లేషించే సామర్థ్యాన్ని అలవర్చుకోవాలి.

- మొదట సబ్జెక్టుపై సిలబస్‌కు అనుగుణంగా సంపూర్ణ అవగాహన కలుగజేసుకోవాలి. తదుపరి రెగ్యులర్ ప్రాక్టీస్‌తో సబ్జెక్టుపై పట్టు లభిస్తుంది.
- వారాంతంలో జరిగే పరీక్షల్లో మార్కులు తక్కువ వచ్చినప్పటికీ ఇబ్బంది పడాల్సిందేమీ లేదు. ఫెయిల్యూర్‌ను సక్సెస్‌కు తొలిమెట్టుగా భావించాలి. అసలా ప్రశ్నను ఎలా అర్థం చేసుకున్నాం, సమాధానాన్ని కనుగొనే క్రమంలో ఎక్కడ తప్పు దొర్లింది అన్నది తెలుసుకుని, సరైన పద్ధతిలో దాన్ని నేర్చుకోవాలి. ఆ తప్పు పునరావృతం కాకుండా చూసుకోవాలి.
- ఒక సమస్యకు పరిష్కారం కనుగొనే పద్ధతిలో వేగమే కాదు, కచ్చితత్వానికీ ప్రాధాన్యం ఇవ్వాలి.

మార్కుల స్కోర్ పెంపు కోసం

- గడచిన ప్రశ్నపత్రాలను విశ్లేషించుకుంటే కొన్ని చాప్టర్లకే ప్రాధాన్యం ఇస్తున్నట్టు అర్థమవుతుంది. 75 శాతం ప్రశ్నలు 25శాతం చాప్టర్ల నుంచే వస్తున్నాయి. 25 ప్రశ్నలకు అంటే అందులో కనీసం 15 కి సమాధానాలు సరిగ్గా గుర్తించగలిగితే చాలు, సీటు గ్యారంటీ వస్తుంది.
- చాప్టర్ల వారీగా అవి... ప్రశ్నల లెక్కన మోడ్రన్ ఫిజిక్స్(4), కరెంట్ ఎలక్ట్రిసిటీ(3), ఎలక్ట్రోస్టాటిక్స్(2), రే ఆప్టిక్స్(2), మెకానిక్స్(5), వేవ్స్(3), థర్మోడైనమిక్స్(2)

ఎలా చదవాలంటే?

- డిసెంబర్ నెలంతా రోజుకు ఒక చాప్టర్ చొప్పున సబ్జెక్టు అంతా చదవాలి.
- డివైడ్ అండ్ కాంకర్ అంటే చాప్టర్‌ను అయిదారు భాగాలుగా విభజించుకుని పట్టు సాధించాలి.
- కాన్సెప్ట్‌ను అర్థం చేసుకునేందుకు షార్ట్ నోట్స్‌ని ఉపయోగించాలి. ప్రాబ్లెమ్‌ని సాల్వ్ చేసే పద్ధతిలో కాన్సెప్ట్‌ను అర్థం చేసుకునే పద్ధతిని తెలుసుకోవాలి.
- ప్రతి రోజూ పది నుంచి ఇరవై ప్రాబ్లెమ్స్ సాల్వ్ చేయాలి. ఎక్కడైనా తప్పు దొర్లితే దాన్ని కనీసం అయిదారు సార్లు ప్రాక్టీస్ చేయాలి.
- ప్రతి ఆదివారం ఫుల్ సిలబస్‌పై ఒక మోడల్ టెస్ట్ ప్రాక్టీస్ చేయాలి.
- నెగెటివ్ మార్కులు రాకుండా జాగ్రత్త పడాలి. టైమ్ మేనేజ్‌మెంట్ ముఖ్యం. ర్యాండమ్ వీడియోలు చూసి టైమ్ వృథా చేసుకోవద్దు.
- ప్రిపరేషన్ మొదటి రోజు నుంచి మార్కులు అని కాకుండా సబ్జెక్టుపై దృష్టి పెట్టడం మంచిది.
- సీటు తెచ్చుకోవడం ఎంత మాత్రం మేజిక్ లేదంటే లక్ కాదని విద్యార్థులు గ్రహించాలి. ఎంతో కృషి ఉంటేనే అనుకున్న సీటు లభిస్తుందని తెలుసుకోవాలి.

రెండు రకాలు

- మొదటిది కాన్సెప్ట్‌ను అర్థం చేసుకోవడం. అందుకు ఎన్‌సీఈఆర్‌టి పుస్తకాలతో సొంత నోట్స్‌ను రూపొందించుకోవాలి.
- కాన్సెప్ట్‌ను నేర్చుకునేందుకు థియరీ ఓరియెంటెడ్ మెటీరియల్ చాలు. రేఖా చిత్రాలు, చార్టులు, టేబుల్స్‌తో కాన్సెప్ట్‌ను అర్థం చేసుకోవాలి.
- ప్రతి చాప్టర్‌పై ఒకట్రెండు పేజీల మేర షార్ట్ నోట్స్‌ను తయారు చేసుకోవాలి.
- కాన్సెప్టును గుర్తుంచుకోవడంలో విజువలైజేషన్ టెక్నిక్స్, టిప్స్ సహాయపడతాయి.
- ఫార్ములా లేదా చార్టులను గుర్తుంచుకోవడంలో న్యూమానిక్స్(జ్ఞప్తికి తెచ్చుకోవడం) కీలకం. ఉదాహరణకు ఇఎండబ్ల్యు చాప్టర్‌లో ఎప్పుడూ ఒక ప్రశ్న వస్తుంది. చాలా సార్లు ఈ ప్రశ్న ఇఎండబ్ల్యుకు సంబంధించిన వేవ్‌లెంథ్/ ఫ్రీక్వెన్సీ శక్తి ఆర్డర్‌పైన ఉంటుంది. ఉదాహరణకు - రేడియో వేవ్స్ - మైక్రో వేవ్స్ - ఇన్‌ఫ్రారెడ్ రేస్ - విజిబుల్ రేస్ - అల్ట్రావయలెట్ రేస్ - ఎక్స్ రేస్ - గామా(ఆర్) రేస్ - కాస్మిక్ రేస్

దీనిని గుర్తుంచుకునేందుకు.... రెడ్ మార్షియన్స్ ఇన్వేడెడ్ వీనస్ యూజింగ్ ఎక్స్‌రే గన్ లేదా మా ఇంటికి వచ్చి ఉండు ఇష్టం లేకపోతే రాకు అన్న పద్ధతి ఉపయోగించాలి.

- ఇదే విధంగా రేడియో యాక్టివ్ సిరీస్ ఆర్డర్‌ను గుర్తుంచుకోవచ్చు. థోరియం సిరీస్(4ఎన్), నెప్ట్యూనియమ్ సిరీస్(4ఎన్+1), యురేనియమ్ సిరీస్(4ఎన్+2), యాక్టీనియం సిరీస్(4ఎన్+3). దీని కోసం సినిమా రంగం ఆంధ్రలోకి ఎలా వచ్చిందో చెబితే సరిపోతుంది. తమిళనాడు(టిఎన్) ఉత్తర ఆంధ్ర(యుఎ) - రివర్స్‌లో అంటే - ఎయుఎన్‌టి అని గుర్తుంచుకోవచ్చు.
- రెండోది ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్. ప్రాబ్లెమ్‌ను పూర్తిగా చదవాలి. దానికి సంబంధించిన ఫార్ములా ఉపయోగించాలి. రోజుకు ఒకటి రెండు గంటలు న్యూమరికల్స్ ప్రాక్టీస్ చేయాలి. గడచిన అయిదేళ్ళ ప్రశ్నపత్రాలను సాల్వ్ చేస్తే సంపూర్ణ అవగాహన కలిగించుకోవచ్చు.

డాక్టర్ కిషన్‌రావ్ టంకశాల,
బన్సాల్ క్లాసెస్, హిమయతనగర్, హైదరాబాద్

జాబ్ కార్నర్

బీడీఎల్‌లో మేనేజ్‌మెంట్ ట్రైనీలు

హైదరాబాద్‌లోని భారత్ డైనమిక్స్ లిమిటెడ్(బీడీఎల్) 80 మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది.

విభాగాలు: ఎలక్ట్రానిక్స్, మెకానికల్, ఎలక్ట్రికల్, కంప్యూటర్ సైన్స్, మెటలర్జీ, కెమికల్, సివిల్, ఫైనాన్స్, హ్యూమన్ రిసోర్స్

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగాలో 55 నుంచి 60 శాతం మార్కులతో డిగ్రీ/ పీజీ - డిప్లొమా, సీఏ/ ఐసీడబ్ల్యుఏఐ పాసై ఉండాలి.

ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు: డిసెంబర్ 3 నుంచి 29 వరకు

వెబ్‌సైట్: https://bdl-india.in

భారత డాయనామిక్స లిమిటెడ BHARAT DYNAMICS LIMITED

అప్రెంటిస్‌షిప్

బీడీఎల్ - కంచన్‌బాగ్ యూనిట్‌లో 156 ట్రేడ్ అప్రెంటిస్‌షిప్ ఖాళీలు ఉన్నాయి.

ట్రేడ్‌లు: ఫిట్టర్ 70, ఎలక్ట్రీషియన్ 10, ఎలక్ట్రానిక్స్ మెకానిక్ 30, మెషినిస్ట్ 15, మెషినిస్ట్ గ్రైండర్ 2, మెకానికల్ డీజిల్ 5, మెకానిక్ ఆర్ అండ్ ఏసీ 5, టర్నర్ 15, వెల్డర్ 4

అర్హత: టెన్త్‌తో పాటు సంబంధిత ట్రేడ్‌లో అభ్యర్థి ఉత్తీర్ణులై ఉండాలి.

వయస్సు: డిసెంబర్ 8 నాటికి వయస్సు 14-30 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలి.

ఎంపిక: విద్యార్హతలు, రిజర్వేషన్ నిబంధనల ఆధారంగా

దరఖాస్తు: అప్రెంటిస్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్‌కు డిసెంబర్ 8(హార్డ్ కాపీలు పంపేందుకు డిసెంబర్ 12)

వెబ్‌సైట్: www.apprenticeshipindia.gov.in

బ్యాంక్ ఆఫ్ బరోడాలో మేనేజర్లు

బ్యాంక్ ఆఫ్ బరోడా 82 మేనేజర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది

పోస్టులు: జోనల్ రిసీవబుల్ మేనేజర్ 13, రీజినల్ రిసీవబుల్ మేనేజర్ 13, ఏరియా రిసీవబుల్ మేనేజర్ 49, కంప్లయన్స్ మేనేజర్ 1, కంప్లయింట్ మేనేజర్ 1, ప్రాసెస్ మేనేజర్ 1, వెండర్ మేనేజర్ 1, ఫ్లోర్ మేనేజర్ 3

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి

ఎంపిక: ఇంటర్వ్యూ ఆధారంగా

ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఆఖరు తేదీ: డిసెంబర్ 9

వెబ్‌సైట్: www.bankofbaroda.bank.in

దిక్సూచి

మ్యాట్

దేశంలోని బిజినెస్ స్కూళ్లలో ప్రవేశానికి ఉద్దేశించిన పరీక్షల్లో మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్(మ్యాట్) ఒకటి. ఆలిండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ఏఐఎంఏ) దీన్ని ఏటా నాలుగుసార్లు నిర్వహిస్తుంది. ప్రస్తుతం డిసెంబర్‌లో నిర్వహించే పరీక్షకు ప్రకటన ఇచ్చింది. డిగ్రీ ఉత్తీర్ణులకు తోడు కోర్సు చివరి ఏడాది చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

- పేపర్ బేస్డ్ టెస్ట్(పీబీటీ), కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) అలాగే పీపీటీ+సీబీటీగా అంటే మూడు రకాలుగా ఈ టెస్ట్‌ను నిర్వహిస్తారు. తెలుగు రాష్ట్రాల్లోని కాలేజీలకు తోడు దేశవ్యాప్తంగా అరువందలకు పైగా సంస్థల్లో ప్రవేశానికి ఈ స్కోర్ ఉపయోగపడుతుంది. అలాగే ఇందులో సాధించిన స్కోర్ ఏడాది పాటు చెల్లుతుంది.
- రెండు గంటల వ్యవధికలిగిన ఈ పరీక్షలో అయిదు విభాగాల నుంచి 150 ప్రశ్నలు అడుగుతారు. లాంగ్వేజ్ కాంప్రహెన్షన్, ఇంటెలిజెన్స్ అండ్ క్రిటికల్ రీజనింగ్, మేథమెటికల్ స్కిల్స్, డేటా అనాలిసిస్ అండ్ సఫిసియెన్సీ, ఎకనామిక్ అండ్ బిజినెస్ ఎన్విరాన్‌మెంట్ అంశాల్లో ప్రశ్నలు ఉంటాయి. సమాధానాన్ని కరెక్ట్‌గా గుర్తిస్తే ఒక మార్కు ఇస్తారు. తప్పుగా గుర్తిస్తే పావు మార్కు తగ్గిస్తారు. వెబ్‌సైట్‌లో మాదిరి ప్రశ్నలు ఉన్నాయి. ఇటు క్యాట్, అటు ఐసెట్‌కు మధ్యస్థంగా మ్యాట్ ఉంటుంది.
- **పీబీటీ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** డిసెంబర్ 7
- **సీబీటీ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** డిసెంబర్ 15
- **పేపర్ ఆధారిత పరీక్ష తేదీ:** డిసెంబర్ 13
- **కంప్యూటర్ ఆధారిత పరీక్ష:** డిసెంబర్ 21
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** పేపర్ ఆధారిత - హైదరాబాద్, విశాఖపట్టణం; కంప్యూటర్ ఆధారిత - హైదరాబాద్, విజయవాడ
- **వెబ్‌సైట్:** https://mat.aima.in




మేనేజ్‌లో పీజీ డిప్లొమా

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్(మేనేజ్) 2026-28 విద్యాసంవత్సరానికి సంబంధించి పీజీడీఎం(అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్) కోర్సులో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. అగ్రికల్చర్ సంబంధ కోర్సులో డిగ్రీ ఉత్తీర్ణులు ఈ కోర్సు చేసేందుకు అర్హులు. 2025 క్యాట్ స్కోర్, గ్రూప్ డిస్కషన్, ఎస్సే రైటింగ్, అకడమిక్ రికార్డ్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక ఉంటుంది. ఆసక్తి ఉన్న అభ్యర్థులు వచ్చే ఏడాది ఫిబ్రవరి 10లోగా దరఖాస్తు చేసుకోవాలి.

వెబ్‌సైట్: www.manage.gov.in/ABMAdmissions/appln.pdf

చిత్రజ్యోతి

SINCE 1965



దుల్కర్ కొత్త సినిమా

మలయాళ కథానాయకుడు దుల్కర్ సల్మాన్ 'ఐ యామ్ గేమ్' అనే కొత్త సినిమాతో అలరించబోతున్నారు. నహాస్ హిదాయత్ దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రాన్ని దుల్కర్ సల్మాన్, జోమ్ వర్గీస్ నిర్మిస్తున్నారు. మేకర్స్ ఆదివారం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని విడుదల చేశారు. నైట్ క్లబ్, క్యాసినో బ్యాక్‌డ్రాప్‌లో స్టయిలిష్ సూట్ వేసుకున్న దుల్కర్ రక్తం తడిసిన చేతితో గన్ పట్టుకుని ఇంటెన్స్ లుక్‌లో కనిపించడం అదిరిపోయింది. మిస్కిన్, ఆంటోని వర్గీస్, సంయుక్త విశ్వనాథన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

మాస్ సాంగ్‌కు చిరు.. వెంకీ స్టెప్స్




చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న 'మన శంకర వరప్రసాద్ గారు' షూటింగ్ శరవేగంగా సాగుతోంది. హీరో వెంకటేశ్ ఈ చిత్రంలో ఓ ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారు. తాజాగా ఈ సినిమా గురించి ఓ ఆసక్తికరమైన అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ అగ్రహీరోలిద్దరూ సినిమాలో ఓ గీతానికి కాలు కదపనున్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే ఓ అదిరిపోయే మాస్ గీతాన్ని భారీ సెట్ వేసి షూట్ చేస్తున్నారు. దాదాపు 500 మంది డ్యాన్సర్లతో కలర్‌ఫుల్‌గా ఈ పాటను చిత్రీకరిస్తున్నారు. విజయ్ పోలకి ఈ పాటకు కొరియోగ్రఫీ చేస్తున్నారు. ఈ మాస్ గీతం వచ్చే ఏడాది విడుదలయ్యే ఉత్తమ పాటల్లో ఒకటిగా నిలిచిపోతుంది, వీరిద్దరి ఎనర్జీ, స్టైల్ ప్రేక్షకులకు అద్భుతమైన వినోదం అందించనుందని మేకర్స్ చెప్పారు. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ చిత్రం విడుదల కానుంది. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్‌మెంట్స్ బేనర్‌పై సాహు గారపాటి, చిరంజీవి కుమార్తె సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. నయనతార కథానాయిక. ఈ చిత్రానికి ఎడిటర్: తమ్మిరాజు, సినిమాటోగ్రఫీ: సమీర్ రెడ్డి, సంగీతం: భీమ్స్ సిసిరోలియో.

అఖండ నుంచి అవతార్ వరకూ...

● డిసెంబర్‌లో బాక్సాఫీస్ వార్







ప్రతి ఏటా సంక్రాంతి వస్తుందంటే చాలు, సినిమా ప్రేమికులకు పండగే. కానీ ఈ సారి డిసెంబర్ మాత్రం మామూలుగా లేదు. బాక్సాఫీసు రికార్డులు బద్దలుకొట్టేందుకు పాన్ ఇండియా స్టార్ల నుంచి హాలీవుడ్ దిగ్గజాల వరకూ అందరూ క్యూ కట్టారు. నందమూరి బాలకృష్ణ 'అఖండ 2' గర్జనతో మొదలై, జేమ్స్ కామెరాన్ సృష్టించబోయే విజువల్ వండర్ వరకూ... ఈ ఏడాది ముగింపు బాక్సాఫీసు దగ్గర వేడి పుట్టించనుంది.

మొదటి వారమే మాస్ జాతర

డిసెంబర్ నెల ఆరంభమే అదిరిపోయే రేంజ్‌లో ఉండబోతోంది. 'అఖండ'లో అఘోరాగా విశ్వరూపం చూపారు బాలకృష్ణ. ఆ చిత్రానికి సీక్వెల్‌గా తెరకెక్కిన 'అఖండ 2' డిసెంబర్ 5న థియేటర్లలో విడుదలకు దిగుతోంది. అదే రోజు బాలీవుడ్ హీరో రణ్‌వీర్‌సింగ్ 'ధురంధర్', మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి నటించిన 'కలంకావల్' చిత్రాలు విడుదలవుతున్నాయి.

- రెండో వారంలో 'అన్నగారు వస్తారు' అంటూ కార్తీ సందడి చేయనున్నారు. దీంతోపాటు 'మోగ్లీ, సైక్ సిద్ధార్థ్' చిత్రాలు కూడా డిసెంబర్ 12నే విడుదలవుతున్నాయి.
- ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రేమికులంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న తేదీ డిసెంబర్ 19. జేమ్స్ కామెరాన్ తెరకెక్కించిన దృశ్యకావ్యం 'అవతార్ 3' వెండితెరపై అద్భుతాలు సృష్టించేందుకు సిద్ధంగా ఉంది. దీనికి ఒక రోజు ముందు ప్రదీప్ రంగనాథన్ నటించిన 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' చిత్రం విడుదలవుతోంది.

క్రిస్మస్ కిటకిట: సంక్రాంతిని తలపించేలా క్రిస్మస్ రోజునా బాక్సాఫీసు దగ్గర పలు చిత్రాలు వరుస కడుతున్నాయి. డిసెంబర్ 25న ఏకంగా ఏడు సినిమాలు విడుదలవుతున్నాయి. మోహన్‌లాల్ 'వృషభ', హాలీవుడ్ మూవీ 'అనకొండ', గుణశేఖర్ దర్శకత్వంలో తెరకెక్కిన యూత్‌ఫుల్ డ్రామా 'యుఫోరియా', రోషన్ మేకా హీరోగా నటించిన క్రీడా నేపథ్య చిత్రం 'ఛాంపియన్'తో పాటు 'శంబల, దండోరా, పతంగ్' చిత్రాలు ఒకే రోజు ప్రేక్షకుల ముందుకొస్తున్నాయి. డిసెంబర్ బరిలో నిలిచిన చిత్రాలు డజనుకు పైగానే ఉన్నాయి. మరి వీటిలో ఎన్ని చిత్రాలను విజయం వరిస్తుందో వేచి చూడాలి.

లెజెండ్‌తో నటించడం నా అదృష్టం

హర్షాలి మల్హోత్రా



'బాలకృష్ణ గారి లాంటి లెజెండరీ యాక్టర్‌తో కలసి నటించడం నిజంగా నా అదృష్టం. సెట్‌లో ఆయన చిత్ర బృందంతో సరదాగా ఉన్నారు. తెలుగు సినిమాకు కొత్త వ్యక్తిని అయిన నన్ను ఎంతో ప్రోత్సహించారు. బాలకృష్ణగారు వెరీ ఎనర్జిటిక్, అన్‌స్టాపబుల్' అని అన్నారు నటి హర్షాలి మల్హోత్రా. నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను తెరకెక్కించిన 'అఖండ 2: తాండవం'లో ఆమె కీలక పాత్ర పోషించారు. తేజస్విని నందమూరి సమర్పణలో 14 రీల్స్ బేనర్‌పై రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మించారు. ఈనెల 5న విడుదలవుతున్న సందర్భంగా హర్షాలి మీడియాతో మాట్లాడారు.

- దాదాపు పదేళ్ల తర్వాత మళ్లీ తెరముందుకు వస్తున్నందుకు ఆనందంగా ఉంది. 'బంజరంగీ భాయిజాన్' చిత్రం తర్వాత కొంత గ్యాప్ వచ్చింది. ఈ సమయంలో చదువుపై దృష్టి పెట్టాను. అలాగే కథక్ నృత్యం కూడా నేర్చుకున్నాను. ఒక మంచి పాత్ర కోసం ఎదురు చూస్తున్నప్పుడు 'అఖండ 2'లో అవకాశం వచ్చింది.
- ఈ చిత్రంలో నేను జననీ అనే పాత్రలో కనిపిస్తాను. జననీ జీవితం ప్రమాదంలో పడినప్పుడల్లా అఖండ వచ్చి రక్షిస్తాడు. ఈ సినిమాలో నేను కొన్ని యాక్షన్ స్టంట్స్ కూడా చేశాను.
- డైరెక్టర్ బోయపాటి గారు 'నువ్వు తప్పకుండా చేయగలవు' అని ఎంతో ప్రోత్సహించేవారు. సన్నివేశం పూర్తయిన తర్వాత 'అద్భుతంగా చేశావ'ని అభినందించేవారు. నాకు సంజయ్ లీలా బన్సాలీ గారి సినిమాలో నటించాలని ఉంది. ఆయన హీరోయిన్లని చూపించే విధానం అద్భుతంగా ఉంటుంది.

కన్నడ హాస్యనటుడు ఉమేశ్ కన్నుమూత



ప్రముఖ కన్నడ హాస్యనటుడు ఉమేశ్ (80) ఆదివారం ఉదయం బెంగళూరులో కన్నుమూశారు. కొన్నాళ్లుగా ఆయన లివర్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. సీఎం సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, కన్నడ సాంస్కృతిక శాఖ మంత్రి శివరాజ్ తంగడిగతోపాటు పలువురు అభిమానులు, సినీ నటులు పెద్దఎత్తున తరలివచ్చి నివాళులు అర్పించారు. ఉమేశ్ 1945 ఏప్రిల్ 22న మైసూరులో జన్మించారు. బాల్యంలోనే ఉమేశ్ పలు సినిమాల్లో నటించారు. కే హిరణ్ణయ్య మిత్రమండలిలో చేరాక పలు నాటకాల్లో భిన్నమైన పాత్రలను పోషించారు. 350 సినిమాఞలో నటించారు. ఆయనకు భార్య ఉష, కుమార్తె ఉన్నారు. ఆదివారం సాయంత్రం బనశంకరి స్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

సందేశాత్మక చిత్రంతో

ప్రస్తుత భారతదేశ, సామాజిక, రాజకీయ ఇతివృత్తంతో ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్టు నిర్మాత అతీకూర్ రెహమాన్ తెలిపారు. నూతన నటీనటులతో రూపొందుతున్న ఈ చిత్రం వివరాలను ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన వివరించారు. 'టాలీవుడ్‌లో ఆర్ఎక్స్ ఫ్లోర్ మూవీస్ అనే కొత్త బేనర్‌ను ఏర్పాటు చేశాం. వినోద ప్రధానమైన చిత్రాలతో పాటు పలు సామాజిక సమస్యలపై సందేశాత్మకంగా ఉండే చిత్రాలను నిర్మిస్తాం. ఈ నెల్లోనే సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్తాం' అని తెలిపారు.



చెత్త సినిమాలకు అత్యున్నత పురస్కారాలా?

అదూర్ గోపాలకృష్ణన్



ప్రముఖ మలయాళ సినీ దర్శకుడు, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత అదూర్ గోపాలకృష్ణన్ జాతీయ చలనచిత్ర అవార్డుల ఎంపికపై తీవ్ర విమర్శలు చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... గత కొంతకాలంగా చెత్త సినిమాలకు అత్యున్నత పురస్కారాలు దక్కుతున్నాయని ఆరోపించారు. దీనిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. నాసిరకం చిత్రాల ఎంపికకు జ్యూరీ అసమర్థతే ప్రధానకారణం అని ఆరోపిస్తూ, అర్హత కలిగిన జ్యూరీ ఉంటేనే సరైన చిత్రాలకు గౌరవం దక్కుతుందని స్పష్టం చేశారు. నాణ్యమైన సినిమాలను గుర్తించి, ప్రోత్సహించడమే జాతీయ అవార్డుల ఏర్పాటు వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశమనీ, కానీ ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయ నిర్ణేతల ప్రమాణాలు తక్కువగా ఉంటే, వారి గుర్తింపు కోసం నాసిరకం చిత్రాలనే పురస్కారాలకు ఎంపిక చేస్తారని ఎద్దేవా చేశారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే జాతీయ పురస్కారాలను ఇవ్వడం మానుకుంటే మంచిదని గోపాలకృష్ణన్ అభిప్రాయపడ్డారు 71వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో మలయాళ చిత్రం 'ది కేరళ స్టోరీ' కి అవార్డులు రావడంపై గోపాలకృష్ణన్ కొన్నాళ్లుగా పరోక్షంగా విమర్శలు చేస్తున్నారు.

సుకుమార్ చిత్రంలా ఉంటుంది

'సహకుటుంబానాం' నా స్నేహితుడు విక్రమ్ చేయాలనుకున్న సినిమా. కానీ ఆయన చనిపోవడంతో ఆ కథ లైన్‌ను తీసుకుని ఉదయ్ చేశాడని తెలిసి ఎంతో సంతోషించా. ఈ చిత్రం సుకుమార్ గారి ఆలోచనలాగా ఉంటుంది. అందర్నీ ఆకట్టుకుంటుంది' అని దర్శకుడు బుచ్చిబాబు సానా అన్నారు. రామ్‌కిరణ్, మేఘా ఆకాశ్ జంటగా ఉదయ్ శర్మ



తెరకెక్కించిన చిత్రం 'సహకుటుంబానాం'. హెచ్.మహదేవ్ గౌడ్ నిర్మించారు. ఈ చిత్రం ట్రైలర్‌ను బుచ్చిబాబు సానా విడుదల చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ 'ఇటువంటి కథను నా 48 ఏళ్ల కెరీర్‌లో ఎప్పుడూ వినలేదు. చాలా ప్రత్యేకంగా ఉండబోతోంది' అని చెప్పారు. రామ్‌కిరణ్ మాట్లాడుతూ 'అందరి అంచనాలను అందుకునేలా ఈ సినిమా ఉంటుంది. కచ్చితంగా విజయం సాధిస్తుంది' అని తెలిపారు.

స్పోర్ట్స్

విజయవాడ ● సోమవారం 1 డిసెంబరు 2025



గాయత్రి జోడీదే డబుల్స్ ట్రోఫీ

● టైటిల్ నిలబెట్టుకున్న భారత ద్వయం

● సయ్యద్ మోదీ ఫైనల్లో శ్రీకాంత్ ఓటమి

లఖ్‌నవూ: భారత డబుల్స్ స్టార్ జోడీ గాయత్రీ గోపీచంద్/ట్రీసా జాలీ సొంతగడ్డపై అదరగొట్టింది. సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో డబుల్స్ టైటిల్ నిలబెట్టుకొని ఈ వేదికపై తమకు తిరుగులేదని చాటుకుంది. ఆదివారం ఇక్కడ జరిగిన మహిళల డబుల్స్ ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ గాయత్రి ద్వయం 17-21, 21-13, 21-15తో జపాన్ జోడీ కహో ఒసావ/మియా తనబెను ఓడించి విజేతగా నిలిచింది. ఇక, పురుషుల సింగిల్స్‌లో ఎనిమిదేళ్లుగా అంతర్జాతీయ టైటిల్ కోసం ఎదురుచూస్తున్న ప్రపంచ మాజీ నెంబర్‌వన్ కిడాంబి శ్రీకాంత్‌కు మరోసారి నిరాశే ఎదురైంది. కిడాంబి ఫైనల్ చేరినా రన్నరప్‌కే పరిమితమయ్యాడు. తుదిపోరులో హాంకాంగ్ షట్లర్ జాసన్ గునవాన్ 21-16, 8-21, 22-20తో శ్రీకాంత్‌పై నెగ్గి టైటిల్ దక్కించుకున్నాడు. శ్రీకాంత్ చివరగా 2017లో ఫ్రెంచ్ ఓపెన్ నెగ్గాడు.

హాకీ రన్నరప్.. భారత్

బెల్జియం ఖాతాలో అజ్లాన్ షా కప్

ఇపోహ్ (మలేసియా): సుల్తాన్ అజ్లాన్ షా హాకీ కప్‌లో భారత్ రన్నరప్ టైటిల్‌తో సరిపెట్టుకుంది. ఆదివారం జరిగిన హోరాహోరీ ఫైనల్లో బెల్జియం 1-0తో భారత్‌ను ఓడించి తొలిసారి చాంపియన్‌గా నిలిచింది. మ్యాచ్‌లో నమోదైన ఏకైక గోల్‌ను థిబ్యూ స్టాక్‌బ్రూక్స్ 34వ నిమిషంలో చేశాడు.


ఐపీఎల్‌కు రస్సెల్ గుడ్‌బై

పవర్ కోచ్‌గా కేకేఆర్ జట్టుతో చేరిక



కోల్‌కతా: వెస్టిండీస్ స్టార్ ఆల్‌రౌండర్ ఆండ్రీ రస్సెల్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)కు వీడ్కోలు పలికాడు. 2014 నుంచి కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్)కు ఆడుతున్న 37 ఏళ్ల రస్సెల్‌ను ఇటీవలే ఆ జట్టు విడుదల చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఈనెల 19న జరిగే మినీ వేలంలో రస్సెల్‌కు భారీ ధర పలకొచ్చని అంతా భావిస్తున్న తరుణంలో.. అతను ఏకంగా లీగ్‌కే గుడ్‌బై చెప్పడం గమనార్హం. ఆటగాడిగా వైదొలగుతున్న తాను ఐపీఎల్‌లో కోచ్‌గా కొనసాగుతానని రస్సెల్ తెలిపాడు. కేకేఆర్ జట్టు సహాయక బృందంలో పవర్ కోచ్‌గా చేరుతున్నట్టు వెల్లడించాడు. ఐపీఎల్‌లో 140 మ్యాచులు ఆడిన రస్సెల్.. 174.18 స్ట్రయిక్ రేట్‌తో 2651 పరుగులు చేశాడు. 123 వికెట్లు పడగొట్టాడు.

అభిషేక్ తుఫాన్ ఇన్నింగ్స్



హైదరాబాద్: సఫారీలతో టీ20 సిరీస్‌కు ముందు టీమిండియా స్టార్ అభిషేక్ శర్మ విశ్వరూపం చూపించాడు. సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీ ఎలీట్ గ్రూప్-సిలో భాగంగా ఇక్కడి జింఖానా మైదానంలో బెంగాల్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ జట్టు ఆటగాడు అభిషేక్ (52 బంతుల్లో 8 ఫోర్లు, 16 సిక్సర్లతో 148) బౌండరీలు, సిక్సర్లతో పరుగుల వరద పారించాడు. కేవలం 32 బంతుల్లోనే సెంచరీ సాధించిన అతను.. సెంచరీ చేసే క్రమంలో 12 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేసుకొని చరిత్ర సృష్టించాడు. ఈ క్రమంలో ఓవరాల్‌గా పురుషుల టీ20ల్లో వేగవంతమైన ఫిఫ్టీ చేసిన ఆటగాడిగా యువరాజ్, క్రిస్ గేల్, హజ్రతుల్లా జజాయ్, సాహిల్ చౌహాన్‌తో కలిసి మూడోస్థానంలో నిలిచాడు. దీపేందర్ సింగ్ (నేపాల్, 9 బంతుల్లో), అశుతోష్ శర్మ (భారత్, 11 బంతుల్లో) తొలి రెండుస్థానాల్లో ఉన్నారు. ఇక, ముస్తాక్ అలీ టోర్నీలో అశుతోష్ తర్వాత ఈ ఘనత సాధించిన రెండో ఆటగాడు అభిషేక్. 2023 టోర్నీలో హిమాచల్‌తో పోరులో రైల్వేస్ తరఫున అశుతోష్ 11 బంతుల్లోనే ఫిఫ్టీ చేశాడు. కాగా, బెంగాల్‌తో పోరులో అభిషేక్ తుఫాన్ ఇన్నింగ్స్‌కు తోడు ప్రభ్‌సిమ్రన్ సింగ్ (35 బంతుల్లో 70) సత్తా చాటడంతో పంజాబ్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 310 పరుగుల భారీ స్కోరు చేసింది. ప్రభ్‌సిమ్రన్‌తో కలిసి అభిషేక్ తొలి వికెట్‌కు 205 రన్స్ నమోదు చేశాడు. ఛేదనలో బెంగాల్ 20 ఓవర్లలో 198/9 స్కోరుకే కుప్పకూలి భారీ ఓటమిని మూటగట్టుకుంది. కాగా, ఈ టోర్నీలో బరోడా (గతేడాది సిక్కింపై 349/5) తర్వాత పంజాబ్‌దే అత్యధిక స్కోరు. అంతేకాదు.. పునీత్ బిస్త్ (17 సిక్సర్లు) తర్వాత ఓ ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన ఆటగాడిగానూ అభిషేక్ మరో రికార్డు సృష్టించాడు.

విరాట్ దంచేశాడు



వయస్సు అనేది సంఖ్యే కానీ ఆటకు అడ్డు కాదని రోహిత్, కోహ్లీ జోడీ మరోసారి నిరూపించింది.. మొన్నటి ఆస్ట్రేలియా పర్యటనలో ఫామ్ చాటుకున్న ఈ దిగ్గజ జంట దక్షిణాఫ్రికాతో తొలి వన్డేలోనూ ఆ జోరు కొనసాగించింది.. ముఖ్యంగా విరాట్ మాస్టర్ క్లాస్ బ్యాటింగ్‌తో సెంచరీతో విజృంభిస్తే.. రోహిత్ అర్ధ శతకంతో అదరగొట్టాడు. మొత్తంగా రో-కో ద్వయం ఫ్యాన్స్‌ను ఉర్రూతలూగించిన ఈ పోరులో భారత్ గెలుపొందింది.. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0తో ముందంజలో నిలిచింది.

- సెంచరీతో విజృంభణ
- రోహిత్, రాహుల్ అర్ధ శతకాలు
- భారత్‌దే తొలి వన్డే
- ఉత్కంఠ పోరులో సఫారీల ఓటమి

వన్డేలలో 52వ శతకం సాధించిన విరాట్.. ఒక ఫార్మాట్‌లో అత్యధిక సెంచరీలు చేసిన రికార్డ్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ క్రమంలో టెస్ట్‌ల్లో సచిన్ చేసిన 51 సెంచరీల రికార్డును కోహ్లీ తిరగరాశాడు. ఇక.. మూడు ఫార్మాట్లలో కలిపి కోహ్లీ మొత్తం 83(టెస్ట్‌ల్లో 30, వన్డేల్లో 52, టీ20ల్లో ఒకటి) సెంచరీలు సాధించాడు. సచిన్ వంద శతకాల (టెస్టులు-51, వన్డేలు 49)తో ముందున్నాడు. అలాగే దక్షిణాఫ్రికాపై వన్డేలలో అత్యధిక సెంచరీలు (5) చేసిన టెండూల్కర్ రికార్డునూ కోహ్లీ (6) బద్దలుగొట్టాడు.

7000

విరాట్ కొట్టిన ఈ శతకం..క్రికెట్ చరిత్రలో ఏడు వేల సెంచరీ కావడం విశేషం.

రాంచీ: దక్షిణాఫ్రికాతో రెండు టెస్ట్‌ల్లో వైట్‌వాష్ అయిన భారత్ వన్డే సిరీస్‌లో పుంజుకుంది. రోహిత్, కోహ్లీ జోడీ ధనాధన్ బ్యాటింగ్‌తో విజృంభించిన వేళ 17 పరుగులతో సఫారీలను ఓడించింది. ఆదివారం ఉత్కంఠగా జరిగిన తొలి వన్డేలో మొదట భారత్ 50 ఓవర్లలో 349/8 స్కోరు చేసింది. కోహ్లీ (120 బంతుల్లో 11 ఫోర్లు, 7 సిక్సలతో 135) సెంచరీతో చెలరేగగా, కెప్టెన్ కేఎల్ రాహుల్ (56 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సలతో 60), రోహిత్ (51 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సలతో 57) అర్ధ శతకాలతో మెరిశారు. బార్ట్‌మన్, బర్గర్, బాష్, యాన్సెన్ తలా రెండు వికెట్లు పడగొట్టారు. భారీ ఛేదనలో దక్షిణాఫ్రికా 49.2 ఓవర్లలో 332 రన్స్‌కు ఆలౌటైంది. బ్రీట్స్కే (80 బంతుల్లో 8 ఫోర్లు, సిక్స్‌తో 72), యాన్సెన్ (39 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్‌లతో 70), బాష్ (51 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్లతో 67) అర్ధ శతకాలతో పోరాడారు. కుల్దీప్ 4, హర్షిత్ 3, అర్ష్‌దీప్ 2 వికెట్లు తీశారు. కోహ్లీ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

'టాప్' విఫలమైనా.: భారీ ఛేదనలో హర్షిత్ ధాటికి దక్షిణాఫ్రికా 11/3తో తీవ్ర ఇక్కట్లలో పడింది. అయితే మిడిల్, లోయర్ మిడిలార్డర్ ఆటగాళ్లు పట్టు వీడకుండా పోరాడి భారత్‌లో గుబులు రేపారు. జోర్జీ (39), బ్రేవిస్ (37), యాన్సెన్‌లతో కలిసి బ్రీట్స్కే మూడు అర్ధ శతక భాగస్వామ్యాలతో సఫారీలను పోటీలోకి తెచ్చాడు. కానీ మూడు బంతుల తేడాతో యాన్సెన్, బ్రీట్స్కేను అవుట్ చేసిన కుల్దీప్ భారత్‌కు కీలక బ్రేక్ ఇచ్చాడు. కానీ బాష్, సుబ్రేయన్, బర్గర్ ఒత్తిడి లేకుండా ఆడి మ్యాచ్‌ను చివరి ఓవర్ వరకూ తీసుకొచ్చి ఉత్కంఠ రేపారు.

రో-కో షో: భారత్ ఇన్నింగ్స్‌ను రోహిత్, విరాట్ కోహ్లీ తమదైన శైలిలో నిర్మించారు. జైస్వాల్ త్వరగా నిష్క్రమించినా..ఇన్నింగ్స్ చక్కదిద్దే భారాన్ని రో-కో తమ భుజాలపై వేసుకున్నారు. టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా సారథి మార్‌క్రమ్ తొలుత బౌలింగ్ ఎంచుకున్నాడు. అయితే ఇన్నింగ్స్ నాలుగో ఓవర్‌లో జైస్వాల్ (18)ని బర్గర్ క్యాచవుట్ చేశాడు. దాంతో ఫ్యాన్స్ హర్షధ్వానాల నడుమ క్రీజులోకి వచ్చిన కోహ్లీ ఎదుర్కొన్న మొదటి బంతిని ఫోర్ బాది వారిలో జోష్‌లో నింపాడు. మరోవైపు వ్యక్తిగత స్కోరు ఒక పరుగు వద్ద లైఫ్ పొందిన రోహిత్ యాన్సెన్ బౌలింగ్‌లో 4,4తో బ్యాటుకు పని చెప్పడంతో ఏడో ఓవర్లోనే జట్టు స్కోరు 50 దాటింది. ఆపై కోహ్లీ కూడా బర్గర్ బౌలింగ్‌లో 6,4తో కదం తొక్కడంతో స్టేడియం హోరెత్తింది. వీరిద్దరూ ప్రత్యర్థి బౌలర్లను ఓ ఆటాడుకొని ఫోర్లు, సిక్సర్లతో విరుచుకుపడడంతో స్కోరుబోర్డు రేసు గుర్రంలా పరిగెత్తింది. 14వ ఓవర్లోనే జట్టు స్కోరు సెంచరీ దాటగా..బాష్ బౌలింగ్‌లో చూడచక్కనైన సిక్సర్‌తో విరాట్ ఫిఫ్టీ మార్క్ చేరాడు. తర్వాత రోహిత్ కూడా 60వ అర్ధ శతకం పూరించినా..కొద్దిసేపటికే యాన్సెన్ బౌలింగ్‌లో ఎల్బీగా వెనుదిరిగాడు. దాంతో 136 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. రుతురాజ్ గైక్వాడ్ (8), సుందర్ (13) త్వరగా నిష్క్రమించగా.. కేఎల్ రాహుల్ జతగా జట్టు ఇన్నింగ్స్‌ను పునర్ నిర్మించే బాధ్యతను కోహ్లీ చేపట్టాడు. యాన్సెన్ బౌలింగ్ బౌండరీతో సెంచరీ పూరించిన విరాట్..స్టేడియం మొత్తం చప్పట్లతో హోరెత్తగా గాల్లోకి ఎగిరి సంబరాలు చేసుకున్నాడు. తదుపరి సుబ్రాయన్ బౌలింగ్‌లో కోహ్లీ 4,6,6,4తో రెచ్చిపోయాడు. అదే ఊపులో బార్ట్‌మన్ బౌలింగ్‌లో 2 ఫోర్లు కొట్టిన విరాట్..బర్గర్ బౌలింగ్‌లో భారీషాట్ కొట్టే యత్నంలో క్యాచవుటయ్యాడు. రాహుల్‌తో కలిసి ఐదో వికెట్‌కు విరాట్ 76 రన్స్ జోడించాడు. కోహ్లీ పెవిలియన్ చేరాక బ్యాట్ ఝుళిపించిన రాహుల్ అర్ధ శతకం పూర్తి చేశాడు. జడేజా (20 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 32) వేగంగా ఆడడంతో..ఈ జోడీ ఆరో వికెట్‌కు 36 బంతుల్లోనే 65 రన్స్ జోడించింది.

రోహిత్ సిక్సర్ల రికార్డ్



హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ మరో రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. వన్డేలలో అత్యధిక సిక్సర్లు బాదిన ఘనత సొంతం చేసుకున్నాడు. దక్షిణాఫ్రికాతో తొలి వన్డేకు ముందు 349 సిక్సర్లతో ఉన్న హిట్‌మ్యాన్ ఈ మ్యాచ్‌లో మూడు సిక్సర్లు బాది షాహిద్ అఫ్రీది (351 సిక్సర్లు) రికార్డును తిరగ రాశాడు. అయితే రోహిత్ కేవలం 277 మ్యాచ్‌ల్లోనే ఈ ఫీట్ అందుకోగా, అఫ్రీది 398 మ్యాచ్‌ల్లో ఆ రికార్డు సాధించాడు.

స్కోరుబోర్డు

భారత్: జైస్వాల్ (సి) డికాక్ (బి) బర్గర్ 18, రోహిత్ (ఎల్బీ) యాన్సెన్ 57, కోహ్లీ (సి) రికెల్టన్ (బి) బర్గర్ 135, గైక్వాడ్ (సి) బ్రేవిస్ (బి) బార్ట్‌మన్ 8, సుందర్ (సి) బాష్ (బి) బార్ట్‌మన్ 13, కేఎల్ రాహుల్ (సి) డికాక్ (బి) యాన్సెన్ 60, జడేజా (సి) మార్‌క్రమ్ (బి) బాష్ 32, హర్షిత్ (నాటౌట్) 3, అర్ష్‌దీప్ (బి) బాష్ 0, కుల్దీప్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 23; మొత్తం: 50 ఓవర్లలో 349/8; వికెట్లపతనం:** 1-25, 2-161, 3-183, 4-200, 5-276, 6-341, 7-347, 8-347; **బౌలింగ్:** యాన్సెన్ 10-0-76-2, బర్గర్ 10-0-65-2, బాష్ 10-0-66-2, బార్ట్‌మన్ 10-0-60-2, సుబ్రాయన్ 10-0-73-0.

దక్షిణాఫ్రికా: మార్‌క్రమ్ (సి) రాహుల్ (బి) అర్ష్‌దీప్ 7, రికెల్టన్ (బి) హర్షిత్ 0, డికాక్ (సి) రాహుల్ (బి) హర్షిత్ 0, బ్రీట్స్కే (సి) కోహ్లీ (బి) కుల్దీప్ 72, జోర్జి (ఎల్బీ) కుల్దీప్ 39, బ్రేవిస్ (సి) గైక్వాడ్ (బి) హర్షిత్ 37, యాన్సెన్ (సి) జడేజా (బి) కుల్దీప్ 70, బాష్ (సి) రోహిత్ (బి) ప్రసిద్ధ్ 67, సుబ్రాయన్ (సి) రాహుల్ (బి) కుల్దీప్ 17, బర్గర్ (సి) రాహుల్ (బి) అర్ష్‌దీప్ 17, బార్ట్‌మన్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 49.2 ఓవర్లలో 332; వికెట్ల పతనం:** 1-7, 2-7, 3-11, 4-77, 5-130, 6-227, 7-228, 8-270, 9-312, 10-332; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 10-1-64-2, హర్షిత్ 10-0-65-3, సుందర్ 3-0-18-0, ప్రసిద్ధ్ 7.2-1-48-1, కుల్దీప్ 10-0-68-4, జడేజా 9-0-66-0.

ముఖేష్‌కు స్వర్ణం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఖేలో ఇండియా యూనివర్సిటీ క్రీడల్లో గుంటూరు షూటర్ నేలవల్లి ముఖేష్ పసిడి పతకం కొల్లగొట్టాడు. రాజస్థాన్‌లో జరుగుతున్న ఈ పోటీల్లో కేఎల్ యూనివర్సిటీ తరఫున బరిలోకి దిగిన ముఖేష్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో 578/600 స్కోరుతో అగ్రస్థానంలో నిలిచాడు.

బిజినెస్

తగ్గింపా...తటస్థమా?

అందరి చూపు ఆర్‌బీఐ వైపే

ముంబై: వచ్చే శుక్రవారం ప్రకటించనున్న ద్రవ్య పరపతి విధానంలో ఆర్‌బీఐ మరోసారి రేట్లు తగ్గిస్తుందా లేక యథాతథ స్థితిని కొనసాగిస్తుందా అన్నదే ప్రస్తుతం అందరిలోనూ చర్చనీయాంశంగా ఉంది. ద్రవ్యోల్బణ ఒత్తిడి తగ్గినందు వల్ల ఈసారి 0.25% మేరకు రెపో రేటు తగ్గించవచ్చని నిపుణులు కొందరు వాదిస్తుండగా రెండో త్రైమాసికంలో బలమైన వృద్ధి రేటు నమోదైన నేపథ్యంలో ప్రస్తుతానికి యథాతథ స్థితిని కొనసాగించే ఆస్కారం ఉన్నదని మరి కొందరంటున్నారు. ప్రస్తుతం రిటైల్ ద్రవ్యోల్బణం ప్రభుత్వం ఆర్‌బీఐకి నిర్దేశించిన కట్టడి పరిధిలో (2% ఎగువకు లేదా దిగువకు సద్దుబాటుతో 4% వద్ద కట్టడి చేయడం) కనిష్ఠ స్థాయి 2% కన్నా దిగువకు వచ్చింది. ఇది రెపో రేటు తగ్గించేందుకు సానుకూలమైన అంశమేనన్నది తగ్గింపు వాదాన్ని బలంగా తెర పైకి తెస్తున్న వారి వాదం. అయితే రెపో రేటు తగ్గించే కన్నా ఆర్‌బీఐ ప్రకటించే వైఖరి ప్రధానమని కొందరంటున్నారు. ఈసారి ఆర్‌బీఐ రెపో రేటు తగ్గించడం కన్నా తగినంత లిక్విడిటీ మార్కెట్లో ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటూ మరింత రేటు తగ్గింపునకు అవకాశాలున్నాయన్న సంకేతాలతో తన వైఖరిని "తటస్థం నుంచి సరళం"గా మార్చవచ్చని కొందరి వాదన.

బుధవారం నుంచి ఎంపీసీ భేటీ

ఆర్‌బీఐ ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) 58వ సమావేశం బుధవారం నుంచి శుక్రవారం వరకు జరగనుంది.శుక్రవారం నాడు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఎంపీసీ నిర్ణయాలను వెల్లడించనున్నారు.

కార్పొరేట్ రుణాలకు పెరిగిన గిరాకీ

మార్చిలోగా రూ. 7 లక్షల కోట్లకు చేరే అవకాశం

ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి



న్యూఢిల్లీ: ఆర్థిక వృద్ధి జోరందుకోవడంతో కార్పొరేట్ రుణాలకూ గిరాకీ పెరుగుతోంది. దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) చివరి నాటికల్లా తమ బ్యాంకు పంపిణీ చేసే కార్పొరేట్ రుణాలు రూ.7 లక్షల కోట్లకు చేరుకుంటాయని భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి తెలిపారు. దీంతో సెప్టెంబరు త్రైమాసికంలో 7.1 శాతం మాత్రమే ఉన్న ఎస్‌బీఐ పరపతి వృద్ధి రేటు వచ్చే రెండు త్రైమాసికాల్లో రెండంకెలకు చేరే అవకాశం ఉందన్నారు. ఆర్థిక వ్యవస్థ గాడిలో పడడంతో కంపెనీల నుంచి వర్కింగ్ క్యాపిటల్ రుణాలతో పాటు టర్మ్ రుణాలు, ప్రాజెక్టు రుణాలకూ గిరాకీ పెరుగుతోందని ఆయన తెలిపారు.

బాండ్స్ ద్వారా రూ.12,500 కోట్లు

అయితే కాలపరిమితి తీరే డిపాజిట్లు, ఇతర చెల్లింపుల కోసం మాత్రం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రూ.12,500 కోట్ల విలువైన రుణ పత్రాలు జారీ చేసే అవకాశం ఉంద ని శెట్టి చెప్పారు. డిసెంబరు 5న వెలువడే ద్రవ్య, పరపతి విధానంలో ఆర్‌బీఐ రెపో రేటు పావు శాతం తగ్గించినా దాని ప్రభావం తమ నికర వడ్డీ లాభాల (ఎన్‌ఐఎం)పై ఏమాత్రం ఉండదని ఎస్‌బీఐ చైర్మన్ మరోసారి స్పష్టం చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ తమ ఎన్‌ఐఎంలు మూడు శాతానికి చేరతాయన్నారు. ఈ ద్రవ్య, పరపతి విధానంలోనూ ఆర్‌బీఐ కీలక రెపో రేటు పావు శాతానికి మించి తగ్గించకపోవచ్చని తెలిపారు.

పెరుగుతున్న వినియోగం

జీఎస్‌టీ రేట్ల సవరణ, పండగ సీజన్‌తో దేశంలో వినియోగం అమాంతం పుంజుకుంది. దీంతో కంపెనీలు తమకు మంజూరైన వర్కింగ్ క్యాపిటల్ రుణ పరిమితిని పూర్తి స్థాయిలో ఉపయోగించుకుంటున్నట్టు శెట్టి తెలిపారు. ఇప్పటికే ఆమోదం తెలిపిన టర్మ్ లోన్లనూ (కాలపరిమితి రుణాలు) వినియోగించుకుంటున్నట్టు చెప్పారు. కొత్త ప్రాజెక్టుల కోసం అవసరమయ్యే రుణాల కోసం కూడా కంపెనీల నుంచి డిమాండ్ పెరిగిందన్నారు.

సీఏఆర్ భళా

ప్రస్తుతం ఎస్‌బీఐ మూలధన సమృద్ధి నిష్పత్తి (సీఏఆర్) 15 శాతం వద్ద ఉందని శ్రీనివాసులు శెట్టి చెప్పారు. వచ్చే ఐదారు సంవత్సరాల వరకు సీఏఆర్ ఇదే స్థాయిలో కొనసాగే అవకాశం ఉందన్నారు. దీంతో పరపతి వృద్ధి కోసం కొత్తగా ఈక్విటీ షేర్లు జారీ చేయాల్సిన అవసరం ఉండకపోవచ్చన్నారు. ఎస్‌బీఐ ఈ ఏడాది జూలైలో క్యూఐపీ ద్వారా ఈక్విటీ షేర్లు జారీ చేసి రూ.25,000 కోట్లు సమీకరించింది. దీంతో బ్యాంకు సీఏఆర్ మరింత బలోపేతమైంది. ప్రస్తుతం ఉన్న 15 శాతం సీఏఆర్‌తో ఏటా రూ.12 లక్షల కోట్ల రుణ వితరణ సామర్థ్యం ఎస్‌బీఐకి ఉందన్నారు.

టాప్ గేర్‌లో ఐపీఓ మార్కెట్

● జనవరిలోగా మరో 24 ఐపీఓలు

● రూ.40,000 కోట్ల సమీకరణ

● మరో రికార్డు దిశగా ఐపీఓ మార్కెట్

న్యూఢిల్లీ: ఐపీఓ మార్కెట్లో జోరు కొనసాగుతోంది. వచ్చే ఏడాది జనవరిలోగా రూ.40,000 కోట్లు సమీకరించేందుకు మరో 24 కంపెనీలు పబ్లిక్ ఇష్యూల (ఐపీఓ)కు వస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో ఇప్పటికే 96 కంపెనీలు ఐపీఓల ద్వారా మార్కెట్ నుంచి రూ.1.6 లక్షల కోట్ల వరకు సమీకరించాయి. ఇందులో 40 శాతం నిధులను గత మూడు నెలల్లోనే సమీకరించాయి. గత ఆర్థిక సంవత్సరం మొత్తం 91 కంపెనీలు ఐపీఓల ద్వారా సమీకరించిన రూ.1.6 లక్షల కోట్లకు ఇది సమానం. ప్రస్తుత జోరు ఇదే విధంగా కొనసాగితే ఈ సంవత్సరం ప్రైమరీ మార్కెట్ ద్వారా కంపెనీలు సమీకరించే మొత్తం రికార్డు స్థాయిలో రూ.2 లక్షల కోట్లు మించిపోతుందని మర్చంట్ బ్యాంకింగ్ వర్గాలు చెబుతున్నాయి.

బారులు తీరుతున్న కంపెనీలు

సెకండరీ మార్కెట్ ఆటుపోట్లలో ఉన్నా ప్రస్తుతం ఐపీఓ మార్కెట్ మాత్రం మంచి జోరు మీద ఉంది. దీంతో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీతో పాటు మీషో, జునీపర్ గ్రీన్ ఎనర్జీ వంటి కంపెనీలన్నీ ఐపీఓల బాట పట్టాయి. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ రూ.10,721 కోట్ల సమీకరణ కోసం వచ్చే నెల రెండో వారంలో ఐపీఓకు వస్తోంది. రూ.5,421 కోట్ల సమీకరణతో మీషో డిసెంబరు 3న ఐపీఓకు వస్తోంది. వీటికి తోడు బెంగళూరు కేంద్రంగా పనిచేసే హోమ్ అండ్ స్లీప్ సొల్యూషన్స్ (వేక్‌ఫిట్) రూ.1,400 కోట్ల సమీకరణ కోసం డిసెంబరు 8-10 తేదీల మధ్య ఐపీఓ జారీ చేస్తోంది.

26,500 పైన బుల్లిష్

(డిసెంబరు 01-05 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

ట్రెండ్ లైన్

నిఫ్టీ గత వారం 25,843-26,310 పాయింట్ల మధ్యన కదలాడి 158 పాయింట్ల లాభంతో 26,203 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 26,500 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

● 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 25,810, 25,534, 25,215, 24,566 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 26,600 బ్రేక్‌డౌన్ స్థాయి: 25,800

నిరోధ స్థాయిలు: 26,400, 26,500, 26,600 (26,300 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు: 26,000, 25,900, 25,800 (26,100 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



1వ తేదీ			
హైదరాబాద్	635	విజయవాడ	665
వరంగల్	637	గోదావరి	635
చిత్తూరు	663	విశాఖపట్నం	625
		డజను గుడ్లు రూ. 90	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	110	విజయవాడ	113
వరంగల్	110	గుంటూరు	118
కరీంనగర్	110	ఒంగోలు	118
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	109
కర్నూలు	110	నెల్లూరు	114
విశాఖపట్నం	112	అనంతపురం	114
గోదావరి	113		

26,300 కీలకం

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

గత వారం నిఫ్టీ కీలక స్థాయి 26,000 వద్ద రియాక్షన్‌కు గురైనా తదుపరి బలమైన పునరుజ్జీవం సాధించి వారం మొత్తం మీద 320 పాయింట్ల లాభంతో 26,200 వద్ద ముగిసింది. రెండు వారాల పాటు 26,000 వద్ద కన్సాలిడేషన్, ఆటుపోట్ల అనంతరం జీవితకాల గరిష్ఠ స్థాయిలకు చేరువలో నిలకడగా ముగిసింది. గత రెండు వారాల్లో కొన్ని రియాక్షన్లు ఎదురైనా ఆల్‌టైమ్ హై వద్ద నిలకడగా ముగియడం ట్రెండ్‌లో సానుకూలతను సూచిస్తోంది. నెలవారీ చార్టుల ప్రకారం నవంబరులో మార్కెట్ నిలకడ ధోరణి ప్రదర్శించింది. మిడ్‌క్యాప్-100 సూచీ సైతం జీవితకాల గరిష్ఠ స్థాయిల్లో క్లోజయినా స్మాల్‌క్యాప్-100 సూచీ మైనర్ కరెక్షన్ సాధించింది. నిఫ్టీ మరోసారి 26,300 వద్ద పరీక్ష ఎదుర్కోబోతోంది.

బుల్లిష్ స్థాయిలు: మరింత అప్‌ట్రెండ్ కోసం 26,300 కన్నా పైన నిలదొక్కుకోవాలి. అప్పుడు మార్కెట్ కొత్త శిఖరాల వైపు అడుగులు వేస్తుంది. తదుపరి మానసిక అవధి 26,500.

బేరిష్ స్థాయిలు: 26,300 వద్ద విఫలమైతే మైనర్ అప్రమత్త ధోరణిగా భావించాలి. గతంలో నమోదైన కనిష్ఠ స్థాయి 26,150 కన్నా దిగజారితే మరింత బలహీనపడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 26,000. సానుకూలత కోసం ఇక్కడ నిలదొక్కుకుని తీరాలి. విఫలమైతే స్వల్పకాలిక బలహీనత మరింతగా కొనసాగుతుంది.

బ్యాంక్ నిఫ్టీ: గత వారం ఈ సూచీ సైతం జీవితకాల గరిష్ఠ స్థాయి 59,750 సమీపంలో క్లోజయింది. ఈ సూచీ గత నాలుగు వారాలుగా ర్యాలీలో ఉండి 3,000 పాయింట్ల మేరకు లాభపడింది. ట్రెండ్‌లో సానుకూలత కోసం ఈ సూచీ మానసిక అవధి 60,000 కన్నా పైన నిలదొక్కుకోవడం తప్పనిసరి. రియాక్షన్‌లో పడి మద్దతు స్థాయి 59,400 వద్ద విఫలమైతే మరింత బలహీనత తప్పదు. ప్రధాన మద్దతు స్థాయి 58,700.

పాటర్న్: మరింత అప్‌ట్రెండ్ కోసం మార్కెట్ 26,300 వద్ద "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్ వద్ద నిలదొక్కుకోవాలి. 26,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" కన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనతలో పడుతుంది. 26,300 దాటితే పుల్‌బ్యాక్ రియాక్షన్‌కు ఆస్కారం ఉన్నందు వల్ల స్వల్పకాలిక ట్రేడర్లు అప్రమత్తంగా ఉండాలి.

టైమ్ : ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	26,300, 26,390
మద్దతు	26,220, 26,150

ఆటుపోట్లకు అవకాశం!

ప్రస్తుతం జీవితకాల గరిష్ఠాల్లో ఉన్న మార్కెట్లు ఈ వారం తీవ్ర ఆటుపోట్లను ఎదుర్కొనే అవకాశం ఉంది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు వస్తుండటంతో పాటు జియో పొలిటికల్ పరిణామాలే ఇందుకు కారణం. అమెరికా డాలర్, ఫెడ్ వడ్డీ రేట్లు, బాండ్ ఈల్డ్స్ పెరుగుదల అంశాలు బెంచ్‌మార్క్ సూచీలను నడిపించనున్నాయి. ప్రస్తుతం ఐటీ, బ్యాంక్, ఆటో, మీడియా, హెల్త్‌కేర్, ఫైనాన్స్ రంగాలు బలంగా కనిపిస్తున్నాయి. మదుపరులు ఎంపిక చేసుకున్న స్టాక్స్‌లోనే పెట్టుబడులు పెట్టడం మంచిది.

స్టాక్ రికమండేషన్స్

మహీంద్రా అండ్ మహీంద్రా: కొన్ని నెలలుగా అప్‌ట్రెండ్‌లో కొనసాగుతున్న ఈ కౌంటర్‌లో నెల క్రితం 10 శాతం మేర దిద్దుబాటు జరిగింది. కన్సాలిడేషన్ పూర్తవగానే మళ్లీ క్రమంగా పెరుగుతోంది. జీవితకాల గరిష్ఠాన్ని బ్రేక్ చేసేందుకు సిద్ధంగా ఉంది. గత శుక్రవారం రూ.3,757 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.3,700 పై స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.3,950 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. రూ.3,660 వద్ద కచ్చితమైన స్టాప్‌లాస్ తప్పనిసరి.

ఎక్సైడ్ ఇండస్ట్రీస్: కొంతకాలంగా డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తున్న ఈ షేరు ప్రస్తుతం కీలకమైన మద్దతు స్థాయి వద్దకు చేరుకుంది. ఇక్కడ టర్న్ అరౌండ్ అయ్యే అవకాశం ఉంది. గత శుక్రవారం రూ.374 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.370 శ్రేణిలో ప్రవేశించి రూ.410 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. స్టాప్‌లాస్ రూ.355.

వరుణ్ బెవరేజెస్: జీవితకాల గరిష్ఠం నుంచి దాదాపుగా 40 శాతం పతనమైన ఈ కౌంటర్ మరోసారి కీలకమైన మద్దతు స్థాయి రూ.461 వద్ద బౌన్స్ అయ్యింది. రిలేటివ్ స్ట్రెంత్ క్రమంగా పెరుగుతోంది. గత శుక్రవారం 480 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.470 పై స్థాయిలో ప్రవేశించి రూ.530 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. స్టాప్‌లాస్ రూ.460.

ఐఐఎఫ్ఎల్: ఈ ఏడాది మార్చి నుంచి అప్‌ట్రెండ్‌లో కొనసాగుతున్న ఈ షేరు జీవితకాల గరిష్ఠం దగ్గర దిద్దుబాటుకు లోనయ్యాయి. కన్సాలిడేషన్ పూర్తవటంతో మరోసారి బ్రేకౌట్‌కి సిద్ధంగా ఉంది. రిలేటివ్ స్ట్రెంత్ మెరుగ్గా ఉంది. గత శుక్రవారం రూ.578 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.570 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.650/770 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. స్టాప్‌లాస్ రూ.540.

వేదాంత లిమిటెడ్: కొద్ది రోజుల క్రితం 15 ఏళ్ల గరిష్ఠాన్ని బ్రేక్ చేసిన ఈ షేరు ప్రస్తుతం జీవితకాల గరిష్ఠ స్థాయిలో కొనసాగుతోంది. అక్కడే కన్సాలిడేషన్ కొనసాగుతోంది. రిలేటివ్ స్ట్రెంత్ క్రమంగా పుంజుకుంటోంది. పైగా మెటల్స్‌కు మంచి డిమాండ్ ఉండటం సానుకూల అంశం. గత శుక్రవారం రూ.526 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.500 శ్రేణిలో ప్రవేశించి రూ.660 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. స్టాప్‌లాస్ రూ.485.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

ఎలాంటి చీరలు కట్టుకోవాలి?

పండుగ రోజుల్లో, వివాహాది శుభకార్యాలప్పుడు, ఆఫీసుకు వెళ్లేటప్పుడు కట్టుకోవడానికి వీలుగా రకరకాల చీరలు అందుబాటులో ఉంటున్నాయి. అందరికీ అన్ని రకాల చీరలు నప్పవు. చీరలను ఎంపిక చేసుకునేటప్పుడు కొన్ని ముఖ్యాంశాలను గుర్తుపెట్టుకోవాలంటున్నారు నిపుణులు.

- రెండు విభిన్న రంగులు అంటే పూర్తిగా కాంట్రాస్ట్ కలర్స్‌తో రూపొందించిన చీరలు ఎంపిక చేసుకోకూడదు. ఉదాహరణకు లేత గులాబీ-ఊదా, నీలం-పసుపు, తెలుపు-ఎరుపు లాంటి రంగుల కాంబినేషన్లను కొనకపోవడమే మంచిది. ఇలాంటి చీరలు కట్టుకుంటే ఎత్తు తక్కువగా కనిపిస్తారు. వీటి లుక్ కొత్తగా అనిపించదు.
- రఫెల్స్ చీరలు ప్రస్తుతం ట్రెండింగ్‌లో లేవు. ఈ చీరలు కట్టుకుంటే లావుగా ఉన్నట్లు కనిపిస్తుండడంతో మహిళలు వీటిని ఇష్టపడడం లేదు. వీటికి బదులు జార్జెట్, షిఫాన్ చీరలను ఎంపిక చేసుకుంటే నాజూగ్గా కనిపిస్తారు.
- మందపాటి కాటన్ చీరలను కట్టుకోవడం, హ్యాండిల్ చేయడం పెద్ద సవాలుగా అనిపిస్తుంది. ఇవి రోజువారీ కట్టుకోవడానికి అనువుగా ఉండవు. పలుచగా, మెత్తగా, కంటికి ఇంపుగా కనిపించే చీరలను కట్టుకుంటే సౌకర్యవంతంగా ఉంటుంది.
- చీరలను కొనేటప్పుడు వాటి ఫ్యాబ్రిక్‌ను తప్పనిసరిగా పరిశీలించాలి. చలికాలంలో ఉన్ని లేదా వెల్వెట్ మిళితమైన చీరలు, వేసవికాలంలో పలుచని కాటన్ చీరలు, వర్షాకాలంలో నీటిని పీల్చుకోని సిల్క్ చీరలు కట్టుకోవాలి. ఫంక్షన్లు, పండుగలు లాంటి ప్రత్యేక సందర్భాల్లో పట్టు, జార్జెట్, క్రేప్, ఎంబ్రాయిడరీ చీరలు ధరిస్తే బాగుంటుంది. రోజువారీ అయితే సింపుల్ డిజైన్ లేదా చిన్న బార్డర్ ఉన్న చీరలు కట్టుకోవచ్చు.
- బొద్దుగా ఉన్నవారు అడ్డ గీతలు, పెద్ద పెద్ద పూల డిజైన్లతో కూడిన చీరలు కట్టుకోకూడదు. వీరు పలుచని ఫ్యాబ్రిక్‌కు ప్రాధాన్యమిస్తూ సన్నని పొడవాటి కొమ్మల డిజైన్లు, చిన్న ప్రింట్లు, సన్నని బార్డర్ ఉన్న చీరలను ఎంపిక చేసుకోవాలి.
- సన్నగా పొడవుగా ఉన్నవారు.. పెద్ద బోర్డర్లు, చక్కని ఎంబ్రాయిడరీ ఉన్న డిజైనర్ చీరలు కట్టుకోవచ్చు.



ఇంట్లోనే నగలు పాలిష్ చేసుకోవచ్చు

కాలం గడిచే కొద్దీ వెండి, బంగారు నగలు వన్నె తగ్గుతుంటాయి. కొద్దిగా నల్లబడుతుంటాయి కూడా. అందుకే పండుగలు, శుభకార్యాలప్పుడు వీటిని ధరించే ముందు నగల దుకాణానికి తీసుకెళ్లి పాలిష్ చేయిస్తూ ఉంటారు. ఇది ఖర్చుతో కూడుకున్న పని. అలాకాకుండా నగలను ఇంట్లోనే పాలిష్ చేసే విధానాల గురించి తెలుసుకుందాం..





- పెద్ద గిన్నెలో సగానికి పైగా గోరువెచ్చని నీళ్లు పోసి అందులో ఒక చెంచా సర్ఫ్, రెండు చెంచాల బేబీ షాంపూ వేసి బాగా కలపాలి. అందులో బంగారు, వెండి నగలు ఉంచి పావు గంటసేపు నాననివ్వాలి. తరువాత పాత టూత్ బ్రష్‌తో నగలను మెల్లగా తోమి మంచినీటిలో ముంచి కడగాలి. అంతే! నగలు కొత్తవాటిలా కనిపిస్తాయి.
- మెత్తని టూత్ బ్రష్ మీద కొద్దిగా టూత్‌పేస్టు వేసి దానితో నగలను మెల్లగా తోమాలి. తరువాత గోరువెచ్చని నీటితో కడిగేస్తే మురికి పూర్తిగా వదిలి నగలు చక్కగా మెరుస్తాయి.
- వెడల్పాటి గిన్నెలో అర కప్పు వెనిగర్‌ను తీసుకుని అందులో ఒక కప్పు నీళ్లు పోసి కలపాలి. అందులో బంగారు, వెండి నగలను పావుగంటసేపు ఉంచాలి. తరువాత చేత్తో రుద్ది కడిగితే ఆభరణాలు తళతళలాడతాయి.
- బంగారు, వెండి నగలను కుంకుడుకాయల రసంలో అరగంటసేపు నానబెట్టాలి. తరువాత కుంకుడు కాయల పిప్పితో రుద్ది మంచినీళ్లతో కడిగితే మురికి, జిడ్డు వదిలిపోయి నగలు కొత్తవాటిలా మెరుస్తాయి.
- ఒక గిన్నెలో రెండు చెంచాల బేకింగ్ సోడా, రెండు చెంచాల లిక్విడ్ డిటర్జెంట్ వేసి గోరువెచ్చని నీళ్లు పోసి బాగా కలపాలి. అందులో నగలు వేసి పది నిమిషాలు కదల్చకుండా ఉంచాలి. తరువాత మెత్తటి స్క్రబ్బర్‌తో తోమి మంచినీళ్లలో ముంచి తీస్తే నగల మెరుపుదనం తిరిగి వస్తుంది.
- వెండి నగల మీద టూత్ పౌడర్ చల్లి చేతి రుమాలుతో రుద్దితే వాటి నలుపుదనం మాయమవుతుంది. బంగారు నగలను శుభ్రం చేసిన తరువాత పసుపు నీళ్లలో ముంచి తీస్తే ప్రకాశవంతంగా కనిపిస్తాయి. తరువాత వీటిని మెత్తటి గుడ్డతో తుడిచి తేమ లేకుండా పొడిగా ఆరిన తరువాత బాక్సుల్లో భద్రపరచుకోవాలి.

ఇప్పటికీ నమ్మలేకపోతున్నా



తల్లిదండ్రులు కూలి పని చేస్తేగానీ పూట గడవని కుటుంబం ఆమెది. పుట్టుకతోనే వచ్చిన అంధత్వం కారణంగా ఎన్నో అవహేళనలు ఎదుర్కొంది. అంధుల పాఠశాలలో చేరిన ఆమె.. అక్కడి వారి ప్రోత్సాహంతో క్రికెట్‌లో శిక్షణ ప్రారంభించింది. ఇప్పుడు అంధుల ప్రపంచకప్ గెలిచిన భారతజట్టు సభ్యురాలుగా సర్వత్రా ప్రశంసలు అందుకుంటోంది పదిహేనేళ్ల పాంగి కరుణకుమారి ప్రయాణం గురించి ఆమె మాటల్లోనే...

"ప్రస్తుత అల్లూరి సీతారామరాజు జిల్లా వంతలమామిడి మా స్వగ్రామం. అమ్మా నాన్న నా కంటి పాపలు. నాకు ఊహ తెలిసేంత వరకు వారి మాటలతోనే ఈ లోకాన్ని చూశాను. కొద్దిరోజుల క్రితం వరకు నన్ను కేవలం ఒక అంధురాలిగానే చూసిన ఈ సమాజం ఇప్పుడు దేశానికి టీ20 అంధుల ప్రపంచకప్ అందించిన భారత జట్టు సభ్యురాలిగా గుర్తించి.. అభిమానం చూపిస్తుంటే చెప్పలేనంత సంతోషంగా ఉంది. ఇన్నాళ్లూ నేను కార్చిన కన్నీళ్లు, పడిన కష్టాలు, ఎదుర్కొన్న అవమానాలను వరల్డ్‌కప్ విజయం మాయం చేసింది. అమ్మ సంధ్య, నాన్న రాంబాబుకు నేను రెండో సంతానం.. పుట్టుకతోనే నాకు రెండు కళ్లు కనిపించడం లేదని తెలిసి అమ్మ, నాన్న చాలా బాధపడ్డారు. నాకు పదేళ్లు వచ్చే వరకు వాళ్లు ఎక్కడికి వెళ్తే అక్కడికి నన్ను వెంట తీసుకువెళ్లేవారు. ఒక్క క్షణం కూడా నన్ను ఒంటరిగా విడిచిపెట్టి ఉండేవారు కాదు. నాకు కొంచెం ఊహ వచ్చాక నా చెల్లెలితో కలిసి బడికి వెళ్లేదాన్ని. పాఠశాలలో నన్ను తోటివారు ఏడిపించేవారు. నాతో ఎవరూ సరిగ్గా మాట్లాడే వారు కాదు. 'గుడ్డిది' అని హేళన చేసేవారు. ఆ బాధతో నేను "స్కూల్‌కు వెళ్లను" అని మొండికేసేదాన్ని. అమ్మ నన్ను సముదాయించేది. "నువ్వు మనుషుల దృష్టిలో గుడ్డిదానివి కావచ్చు కానీ, ఆ దేవుడి దృష్టిలో కాదు తల్లీ. నువ్వు బడికి వెళ్లి, చదువుకొని కొంచెం జ్ఞానం సంపాదిస్తే మేము లేని రోజు నువ్వు ఒంటరిగానైనా బతకగలవు" అని ధైర్యం చెప్పేది.

పుల్లలు, కట్టెలు ఏరుకొని..

అమ్మా నాన్న కూలికి వెళ్లి తెచ్చే నాలుగైదు వందల రూపాయలే మా ఐదుగురు కుటుంబ సభ్యులకు ఆధారం. కూలి పనులు లేనప్పుడు అడవిలో దొరికే పుల్లలు, కట్టెలు అమ్ముకొని పొట్ట నింపుకొంటూ ఉంటాం. వర్షా కాలం పనులు లేక పూట గడవడానికి కూడా ఇబ్బందిగా ఉంటుంది. చిన్న రేకుల షెడ్‌లో మా నివాసం. వర్షాలు పడినప్పుడు, చలి ఎక్కువగా ఉన్నప్పుడు తట్టుకోలేక అవస్థలు పడుతూ ఉంటాం. మా కుటుంబంలో నాకైనా కనీస సదుపాయాలు కల్పించాలనే ఉద్దేశంతో విశాఖపట్నంలోని ప్రభుత్వ అంధుల పాఠశాల గురించి తెలుసుకొని రెండేళ్ల క్రితం నన్ను అక్కడ చేర్పించారు. స్కూల్‌లో పీఈటీ సత్యవతి గారు, ప్రిన్సిపల్ విజయ మేడమ్ ప్రోత్సాహంతో క్రికెట్‌లో శిక్షణ ప్రారంభించా. గత ఏడాది జరిగిన రాష్ట్ర స్థాయి సెలెక్షన్స్‌లో భారత అంధుల క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ అజయ్‌రెడ్డి నా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించారు. నాకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. జాతీయ జట్టులో చోటు దక్కేలా నన్ను తీర్చిదిద్దారు. ఈ ఏడాది సెప్టెంబరులో టీ20 వరల్డ్‌కప్ కోసం బెంగళూరులో జరిగిన సెలక్షన్ మ్యాచ్‌లో సెంచరీ (114 పరుగులు) చేశా. ఆ ఇన్నింగ్స్‌తో సెలెక్టర్ల దృష్టిలో పడ్డాను. ప్రపంచకప్‌లో ఆడే భారత జట్టులో చోటు సంపాదించా.



అమ్మా నాన్న ఒప్పుకోలేదు..

భారత జట్టులో చోటు సంపాదించాలనే నా కల నిజమైంది. 15 ఏళ్లకే వరల్డ్‌కప్‌లో ఆడే అవకాశం లభించడంతో చాలా సంతోషపడ్డాను. అయితే అప్పటివరకు మా కుటుంబంలో ఎవరూ విశాఖపట్నం దాటి వెళ్లలేదు. "ఆడపిల్లను, అందులోనూ చూపులేని అమ్మాయిని శ్రీలంకకు ఎలా పంపించాలి?" అని అమ్మా నాన్న ఆందోళన పడ్డారు. దాంతో వరల్డ్‌కప్‌కు నన్ను పంపడానికి ఒప్పుకోలేదు. నాకు తెలుగు తప్ప మరే భాష రాదు. కాబట్టి వెంట తెలిసిన వాళ్లు లేకుండా అంత దూరం పంపేది లేదని భీష్మించుకొని కూర్చున్నారు. ఆ సమయంలో అజయ్ రెడ్డి సార్, కెప్టెన్ దీపిక అక్క వారితో మాట్లాడి నచ్చజెప్పారు. నా బాధ్యత తాము చూసుకుంటామని భరోసా ఇచ్చారు. నేను కూడా "మీరు ఒప్పుకున్నా లేకపోయినా నేను కచ్చితంగా వరల్డ్‌కప్‌లో ఆడతాను. కొలంబో వెళ్తాను" అని తెగేసి చెప్పడంతో చివరకు అమ్మా నాన్న అంగీకరించారు. కనీసం బస్సు ఎక్కే స్తోమత కూడా లేని నాకు విమానంలో ప్రయాణించే అవకాశం దక్కడం, నేను ప్రపంచకప్‌లో ఆడడం ఇప్పటికీ నమ్మలేకపోతున్నా. వరల్డ్‌కప్ ఫైనల్లో 42 కీలకమైన పరుగులు చేసి, జట్టును విజేతగా నిలపడంతో ముఖ్య భూమిక పోషించినందుకు చాలా సంతోషంగా ఉంది. వరల్డ్‌కప్ అందుకున్న క్షణాలను, ప్రధాని నరేంద్ర మోదీని కలిసిన సందర్భాన్ని నా జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేను. పారా, దివ్యాంగ క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తే నాలాంటి వారు మరింత మంది దేశం గర్వించేలా తయారవుతారు.

● ఎస్.ఎస్.బి.సంజయ్
హైదరాబాద్

వాటితో ఇబ్బందా?

వంటింటి సింక్‌లో, బాత్‌రూమ్ డ్రెయిన్ వద్ద, వాష్ బేసిన్ దగ్గర చిన్న చిన్న ఈగలు ఎగురుతూ కనిపిస్తుంటాయి. వీటినే డ్రెయిన్ ఫ్లయిస్ అంటారు. వీటివల్ల ఎన్నో రకాల వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. వీటిని ఎలా నివారించాలో తెలుసుకుందాం..

- ఒక గిన్నెలో అర కప్పు వెనిగర్‌ను తీసుకుని అందులో రెండు చెంచాల బేకింగ్ సోడా, ఒక చెంచా ఉప్పు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని వంటగది సింక్‌లో, వాష్‌బేసిన్‌లో, బాత్‌రూమ్ డ్రెయిన్ వద్ద కొద్దికొద్దిగా చిలకరించాలి. రెండు గంటల తరువాత వేడి నీళ్లతో శుభ్రం చేయాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తూ ఉంటే మంచి ఫలితం కనిపిస్తుంది.



- ఒక కప్పు నీటిలో రెండు చెంచాల మిరియాల పొడి వేసి బాగా కలిపి స్ప్రే బాటిల్‌లో పోసి ఉంచుకోవాలి. చిన్న ఈగలు కనిపించిన ప్రదేశాల్లో మిరియాల నీటిని స్ప్రే చేస్తూ ఉండాలి. రోజుకు మూడుసార్లు ఇలా చేస్తుంటే సమస్య తీరుతుంది.
- చిన్న గిన్నెలో ఒక కప్పు నీళ్లు పోసి అందులో ఒక చెంచా బేకింగ్ సోడా, అయిదు చెంచాల నిమ్మరసం వేసి బాగా కలపాలి. ఈ నీటిని వంటగది సింక్‌లో, వాష్ బేసిన్‌లో చల్లాలి. అరగంట తరువాత ఈగలన్నీ మాయమవుతాయి.
- వెడల్పాటి గిన్నెలో అర కప్పు యాపిల్ సైడర్ వెనిగర్‌ను తీసుకుని దానిని ప్లాస్టిక్ కవర్‌తో మూసివేయాలి. తరువాత కవర్ మీద చిన్న చిన్న రంధ్రాలు చేయాలి. ఈ గిన్నెను సింక్ లేదా వాష్‌బేసిన్‌లో ఉంచాలి. యాపిల్ సైడర్ వెనిగర్ వాసనకు ఈగలన్నీ గిన్నెలోకి చేరి మునిగిపోతాయి. అలాగే గిన్నెలో ఒక కప్పు నీళ్లు, రెండు చెంచాల చక్కెర, రెండు చెంచాల డిష్ వాషింగ్ లిక్విడ్ కలిపిన మిశ్రమాన్ని తీసుకున్నా ఫలితం కనిపిస్తుంది.

మిరియాల్లో కల్తీని ఇలా...



శీతాకాలంలో ఎదురయ్యే జలుబు, దగ్గు, ముక్కు దిబ్బడ లాంటి ఆరోగ్య సమస్యలకు సత్వర ఔషధంలా పనిచేస్తాయి మిరియాలు. వీటిలో ఉండే పైపరిన్ సమ్మేళనం శరీరంలో వేడిని పెంచి జీర్ణక్రియ సజావుగా జరిగేలా చేస్తుంది. మిరియాల్లో సి, కె విటమిన్లతోపాటు ఐరన్, మాంగనీస్ లాంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతాయి. అదే కల్తీ మిరియాలు తీసుకుంటే పలు ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. బజారు నుంచి తెచ్చిన మిరియాల్లో కల్తీని ఎలా గుర్తించాలో తెలుసుకుందాం...

- బొప్పాయి, బెర్రీ పండ్లలో ఉండే నల్లని గింజలను ఎండబెట్టి వాటికి చౌకబారు నూనెలు పట్టించి మిరియాల్లో కలిపేస్తూ ఉంటారు. ఇలాంటి వాటిని తీసుకోవడం వల్ల కడుపులో వికారంతోపాటు జీర్ణాశయం, కాలేయం, మూత్రపిండాల సమస్యలు ఎదురవుతాయి.
- నిజమైన మిరియాలను చేతిలోకి తీసుకుని చూస్తే అవన్నీ చిన్న నొక్కులతో ఒకే సైజులో కనిపిస్తాయి. అవి నలుపు లేదా ముదురు గోధుమ రంగుల్లో ఉంటాయి. నోట్లో వేసుకుని నమిలితే ఘాటైన రుచితోపాటు, పూలు లేదా మట్టి వాసన తెలుస్తుంది.
- కొన్ని మిరియాలను టేబుల్ మీద వేసి వేలితో గట్టిగా నొక్కాలి. అవి వెంటనే చితికితే కల్తీవని గుర్తించాలి. నిజమైన మిరియాలు అంత త్వరగా చితకవు, పగలవు.
- ఒక గాజు గ్లాసు నిండా నీళ్లు తీసుకుని అందులో అయిదారు మిరియాలను వేయాలి. అవి నీటిలో మునిగి గ్లాసు అడుగుకు చేరితే నిజమైనవిగా గుర్తించాలి. బొప్పాయి గింజలైతే నీటి మీద తేలుతాయి.
- రెండు మిరియాలను తీసుకుని వేళ్లతో బాగా నలిపి వాసన చూడాలి. వెంటనే ఘాటైన వాసనతో ముక్కు రంధ్రాలు పూర్తిగా తెరచుకున్న భావన కలిగితే అవి నిజమైన మిరియాలని తెలుసుకోవచ్చు. ఏ ఇతర గింజలకు ఇలాంటి వాసన ఉండదు.
- కొన్ని మిరియాలను అరచేతి మధ్యలో ఉంచుకుని మరో చేత్తో ఒత్తిపెట్టి గట్టిగా రుద్దాలి. చేతికి నూనె లేదా రంగు అంటుకున్నట్లు అనిపిస్తే అవి కల్తీవని భావించవచ్చు.
- చిన్న పోపు గరిటెలో అయిదారు మిరియాలు వేసి స్టవ్ మీద పెట్టి వేడి చేయాలి. ఘాటైన వాసన వస్తే మంచి మిరియాలని తెలుసుకోవచ్చు. అలాకాకుండా చేదు, పసరు కలిసిన వాసన వస్తే అవి కల్తీవని నిర్ధారించాలి.
- మిరియాలను చిన్న రోలులో వేసి దంచితే తొందరగా పొడి కావు. దంచుతున్నప్పుడు మంచి సువాసన కూడా వస్తుంది. అదే కల్తీ గింజలైతే వెంటనే పొడి అవుతాయి. అందులో నుంచి ఏ వాసనా రాదు.

వేగం ఆమె ట్రాక్

అతిరా మురళీ... కేరళకి చెందిన మొదటి మహిళా ర్యాలీ డ్రైవర్. బైక్‌ల నుంచి టిప్పర్ల వరకూ దేన్నయినా అవలీలగా నడిపేస్తారు. రెండుసార్లు నేషనల్ టైటిల్స్ సాధించి, మరో టైటిల్ కోసం సిద్ధమవుతున్న అతిర... "సాహసమే నా ఊపిరి" అంటున్నారు.





"వాహనాలతో నా సావాసం చాలా చిన్న వయసులోనే మొదలయింది. మాది కేరళలోని కొట్టాయం. మా నాన్న మురళీధరన్, అమ్మ ఉష. నాన్న ట్రాన్స్‌పోర్ట్ రంగానికి చెందినవారు. మా ఇంట్లో విల్లీస్ జీపు, ఒక లారీతో సహా అనేక వాహనాలు ఉండేవి. వాటిని నడపాలని నేను ముచ్చటపడేదాన్ని. పన్నెండేళ్ళకే బైక్ నడపడం నేర్చుకున్నాను. పదిహేను ఏళ్ళకల్లా మూడు టన్నుల మినీ ట్రక్ నడిపాను. వయసుతో పాటే వాహనాల మీద నా ఆసక్తి కూడా పెరుగుతూ వచ్చింది.

లైసెన్సుల్లో రికార్డు

బీసీఏ పూర్తి చేశాక... ఎక్కడా ఉద్యోగం చెయ్యాలని అనిపించలేదు. కేరళకు వచ్చే టూరిస్టులకు సౌకర్యవంతమైన, సురక్షితమైన పర్యటన అనుభవాలను అందించడం కోసం ఒక టూర్ కంపెనీ ప్రారంభించాను. అదే సమయంలో వాహనాల మరమ్మతులు నేర్చుకున్నాను. బైక్, త్రీవీలర్, కారు, ట్రక్కు, లారీ, బస్సుల్లాంటి హెవీ ప్యాసింజర్ వాహనాలు, హెవీ గూడ్స్ మోటార్ వాహనాలు... ఇలా ప్రతిదీ నడపడంతోపాటు లైసెన్సులు కూడా పొందాను. అతి చిన్న వయసులో ఇన్ని లైసెన్సులు పొందిన పిన్న వయస్కురాలిగా నా పేరు 'ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్' 'యూనివర్సల్ రికార్డ్ ఫోరమ్'లలో నమోదయింది. అప్పుడు నా వయసు 21 ఏళ్ళు. సాహసాలు చేయాలనే తపన నాలో రోజురోజుకూ పెరుగుతూ వచ్చింది. అదే మోటార్ స్పోర్ట్స్ వైపు నన్ను మళ్ళించింది.

ఆ వేగం ట్రాక్‌కే పరిమితం

2021, 2022 సంవత్సరాల్లో.. వరుసగా రెండేళ్ళు 'ఇండియన్ నేషనల్ ర్యాలీ ఛాంపియన్‌షిప్' (ఐఎన్ఆర్‌సి) పోటీల్లో లేడీస్ క్లాస్‌లో విజేతగా నిలవడంతో నా పేరు కార్ రేస్ సర్కిల్స్‌లో మారుమోగింది. ఈ పోటీలను 'ఫెడరేషన్ ఆఫ్ మోటార్ స్పోర్ట్స్ క్లబ్స్ ఆఫ్ ఇండియా' నిర్వహిస్తుంది. ప్రతి సంవత్సరం వివిధ ప్రాంతాల్లో జరిగే ఈ పోటీలు... నాలుగు విభాగాల్లో ఉంటాయి. పలు రౌండ్లలో జరుగుతాయి. సుమారు 300 కిలోమీటర్ల ట్రాక్‌ను తక్కువ సమయంలో పూర్తి చేసినవారిని విజేతలుగా గుర్తిస్తారు. పోటీల్లో ప్రయాణించాల్సిన మార్గాలు రకరకాలుగా ఉంటాయి. మొత్తం అన్ని దశలనూ రెండు రోజుల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ ఏడాది కూడా పోటీల్లో పాల్గొంటున్నాను. తాజాగా కూర్గ్‌లో నిర్వహించిన రౌండ్‌తో సహా.. ఇప్పటివరకూ జరిగిన మూడు రౌండ్లలో మొత్తంగా అయిదో స్థానంలో, మహిళా విభాగంలో మొదటి స్థానంలో ఉన్నాను. వచ్చే నెలలో కోయంబత్తూరులో జరిగే నాలుగో రౌండ్ కోసం, మధ్యప్రదేశ్‌లో నిర్వహించే ఫైనల్ రౌండ్ కోసం సిద్ధమవుతున్నాను. మూడోసారి టైటిల్‌ను కచ్చితంగా గెలుస్తాననే నమ్మకం నాకుంది. మరోవైపు ఆటోమొబైల్స్ గురించి, పర్యాటక ప్రాంతాల విశేషాల గురించి యూట్యూబ్‌లో పోస్ట్ చేస్తూ ఉంటాను. నాకు వేగం ఇష్టమే. కానీ అది కేవలం ర్యాలీ ట్రాక్ మీద మాత్రమే. పబ్లిక్ రోడ్ల మీద బాధ్యతాయుతంగా వాహనాలు నడపుతాను. ప్రమాదాలకు ఆస్కారం లేకుండా... అప్రమత్తంగా ఉంటాను. నాకు వీలైనంతవరకూ... ప్రయాణాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రచారం చేస్తున్నాను."



నేను మోటార్ స్పోర్ట్స్‌లో పాల్గొంటానని చెప్పినప్పుడు... ఎంతో మంది నిరుత్సాహపరిచారు. ఎందుకంటే అప్పటివరకూ కేరళలో మోటార్ స్పోర్ట్స్‌లో పాల్గొన్న మహిళలెవరూ లేరు. అది చాలా ప్రమాదాలతో కూడుకున్న వ్యవహారం. కానీ నా గురించి నేను చెప్పుకోవాలంటే.. "సాహసం నా ఊపిరి" అంటాను. అందుకే వెనక్కు తగ్గలేదు. మొదట ఆఫ్-రోడ్ ఈవెంట్స్‌లోకి అడుగుపెట్టాను. ఆ తరువాత మోటోక్రాస్ పోటీల్లో పాల్గొన్నాను. వాటి కోసం చాలా కష్టపడ్డాను. వేగం, కచ్చితత్వం, అప్రమత్తత, సెకన్ల వ్యవధిలో నిర్ణయం తీసుకొనే సామర్థ్యం... ఇలాంటివి ఎన్నో కావాలి. కొట్టాయానికి చెందిన జార్జి వర్గీస్ పర్యవేక్షణలో నా నైపుణ్యాలను పెంచుకున్నాను.

మూడేళ్ల విరామం

2000లో తొలిసారిగా జాతీయ ర్యాలీలో పాల్గొన్నాను. అయితే ఆ తరువాత మూడేళ్ళపాటు విరామం ఇవ్వాల్సి వచ్చింది. కారణం... ఆర్థిక పరిస్థితులు. మోటార్ స్పోర్ట్స్ శిక్షణకు, ప్రాక్టీస్‌కు, పోటీలకు సిద్ధం కావడానికి, పాల్గొనడానికి లక్షల్లో ఖర్చవుతుంది. నా వృత్తి ద్వారా నాకు వచ్చే ఆదాయంతో దాన్ని భరించే శక్తి నాకు లేదు. స్పాన్సర్ల కోసం చాలా ప్రయత్నించాను. చివరకు ఒక సంస్థ ముందుకు వచ్చింది. దాంతో మళ్ళీ రేస్ ట్రాక్ మీదికి వచ్చాను.

మట్టి ఇంట్లో ఉచిత బడి

వినూత్నం

చదివింది పన్నెండో తరగతి. అయితేనేం! తన దగ్గరున్న కొద్దిపాటి విద్యనే ఉచితంగా పంచాలనుకున్న ఒక గిరిజన మహిళ, సొంతగా ఒక బడినే నడుపుతోంది. పశ్చిమ బెంగాల్, మారుమూల గ్రామంలోని ఆ ఉచిత బడి, దాన్ని నడుపుతున్న ఏకైక ఉపాధ్యాయురాలు మాలతి ముర్ము గురించి తెలుసుకుందాం!

జిలిన్‌సెరంగ్, పశ్చిమ బెంగాల్‌లోని ఓ గిరిజన గ్రామం. ఈ మారుమూల గ్రామాన్ని బయటి ప్రపంచంతో అనుసంధానించే రోడ్డు, రవాణా సదుపాయాలు లేవు. ఆ గిరిజనుల అవసరాలన్నిటికీ నడకే ఆధారం. గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఉన్నప్పటికీ టీచర్ల కొరత కారణంగా ఆ పాఠశాల అరకొరగానే నడుస్తూ ఉంటుంది. దాంతో పది కిలోమీటర్ల దూరంలోని మరొక బడికి నడిచి వెళ్లలేక క్రమక్రమంగా ఆ గ్రామంలోని పిల్లలందరూ బడి మానేసి, ఇళ్లకే పరిమితమైపోయారు. 2019లో కొత్తగా పెళ్లైన మాలతి, పాతిక కిలోమీటర్ల దూరంలో ఉన్న తన గ్రామం బాగ్‌మండి నుంచి జిలింగ్‌సెరంగ్‌కు చేరుకుంది. ఆ ఊర్లో పిల్లలు బడి చదువు మానేసి, ఇంటి పనులకే పరిమితమవడాన్ని ఆమె గమనించింది. ఆరా తీస్తే, దగ్గర్లో ఎక్కడా ఒక్క బడి కూడా లేకపోవడం, కిలోమీటర్ల దూరం నడవవలసి రావడం, రోజంతా బడికే కేటాయించడం వల్ల వంటచెరకును సేకరించే సమయం లేకపోవడం లాంటి సమస్యలన్నీ ఆమె దృష్టికొచ్చాయి. అన్నిటికంటే ముఖ్యంగా ఆ నిరుపేద గిరిజనుల జీవనభృతి దెబ్బ తినకుండా ఉండాలంటే, వాళ్ల పిల్లలకు అదే గ్రామంలో బడిని ఏర్పాటు చేయడం అవసరమని ఆమె గ్రహించింది. అందుకు తానే ఎందుకు సంకల్పించకూడదని తనను తాను ప్రశ్నించుకుంది.

మట్టి గదులే తరగతి గదులుగా...

చదివింది పన్నెండో తరగతి. అయితేనేం.. ప్రాథమిక విద్యాబోధనకు ఆ చదువు సరిపోతుందని సర్దిచెప్పుకున్న మాలతి, మరో ఆలోచన లేకుండా పిల్లల కోసం ఇంటినే బడిగా మార్చింది. 'హయ్యర్ సెకండరీ స్కూలు పూర్తవగానే నాకు పెళ్లి చేశారు. 2019 ఏప్రిల్‌లో నేనీ గ్రామానికి వచ్చాను. పిల్లలు చదువుకోడానికి ఆసక్తి కనబరచడం లేదనే విషయాన్ని ఇక్కడికొచ్చిన కొద్ది రోజుల్లోనే గ్రహించాను. ఒకవేళ కిలోమీటర్ల దూరం నడిచి బడికి వెళ్లినా, కొద్ది రోజులకే బడి మానేస్తున్నట్టు కూడా కనిపెట్టాను. ఓ పక్క పేదరికం, మరోపక్క వాళ్లకు మార్గనిర్దేశం చేసేవాళ్లు లేకపోవడం వల్ల పిల్లలు బడి పట్ల ఆసక్తి కనబరచడం లేదు. అందుకే 2020, ఫిబ్రవరిలో నేనే చదువు చెప్పడం మొదలుపెట్టాను" అంటూ మీడియాకు వివరిస్తోంది మాలతి. కొవిడ్ సమయంలో ప్రభుత్వం నడిపే బడులు కూడా మూతపడ్డాయి. తరగతులన్నీ ఆన్‌లైన్ బాట పట్టాయి. కానీ అది కుగ్రామం. ఇంటర్నెట్ సదుపాయాలు లేకపోవడంతో కాస్త చదువు కాస్తా అటకెక్కింది. ఆ సమయంలో మాలతి బడి కీలకంగా మారింది. ఆ పరిస్థితిని సద్వినియోగం చేసుకున్న మాలతి, గ్రామీణుల సహాయంతో రెండు మట్టి గదులను నిర్మించి, వాటినే తరగతి గదులుగా మార్చేసుకుని కొత్త పాఠశాలకు శ్రీకారం చుట్టింది. మాలతి శ్రమ ఫలించింది. పిల్లలు బడిలో చేరడం మొదలుపెట్టారు. ఇప్పుడు ఏకంగా 45 మంది పిల్లలు ఆమె ఉచిత బడిలో చదువుకుంటున్నారు.





ప్రాథమిక పాఠాలు నేర్పిస్తూ...

మాలతీబాల స్కూల్ అనే పేరుతో నడుస్తున్న ఈ బడిలో మాలతి, ఇంగ్లీషు, గణితం, సైన్స్‌లో ప్రాథమిక పాఠాలు బోధిస్తోంది. ఎలాంటి బోధనార్హతలూ లేకపోయినా, ఎలాంటి ఉపాధ్యాయ శిక్షణా తీసుకోకపోయినా, గిరిజన బాలలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలనే మాలతి సంకల్పం అభినందనీయం.



కుంకీల సాయంతో చెరువు నుంచి ఏనుగును బయటకు తీయడానికి ప్రయత్నిస్తున్న అటవీశాఖ అధికారులు

కాలు విరిగిన ఏనుగుకు కుంకీల సాయం..!

- ఎస్వీ జూకు తరలించే ఏర్పాటు చేస్తున్న అటవీ అధికారులు

యాదమరి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వారం రోజుల క్రితం తమిళనాడు నుంచి చిత్తూరు జిల్లాలోకి ప్రవేశించిన ఓ ఏనుగు.. యాదమరి మండలం తెల్లరాళ్లపల్లె పంచాయతీ డీకే చెరువు అటవీ ప్రాంతంలోని నీటికుంటలో కాలు విరిగి కదల్లేని స్థితిలో పడి ఉంది. అటవీ శాఖ అధికారులు దీన్ని తిరుపతిలోని ఎస్వీ జూ పార్కుకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏనుగు వారం క్రితం తమిళనాడు నుంచి సరిహద్దు ప్రాంతమైన యాదమరి మండలంలోని కమ్మపల్లె అటవీ బీట్‌లోకి ప్రవేశించింది. కాలుజారి పడటంతో కుడికాలు తొడభాగంలో ఎముక విరిగింది. అలాగే తిరుగుతూ శనివారం రాత్రి డీకే చెరువు సమీపంలోని గుడ్డివాని చెరువు వద్దకు వచ్చి బురదలో ఇరుక్కుంది. ఆదివారం స్థానికుల సమాచారంతో అటవీశాఖ అధికారులు వచ్చి పరిశీలించారు. పలమనేరు సమీపంలోని ముసలిమడుగు నుంచి రెండు కుంకీ (కృష్ణ, అభిమన్యు)లను రప్పించి మధ్యాహ్నం మూడు గంటల నుంచి సహాయక చర్యలు చేపట్టారు. చెరువు నుంచి దీన్ని బయటకు తీశాక తిరుపతిలోని ఎస్వీ జూ పార్కుకు తరలిస్తామని అనంతపురం సర్కిల్ సీసీఎఫ్ యశోదాబాయి తెలిపారు.

వైసీపీ హయాంలో అభివృద్ధి సున్నా!

- అన్ని వ్యవస్థల విధ్వంసం.. ఇరిగేషన్ నిర్వీర్యం
- గాడిలో పెడుతున్న కూటమి ప్రభుత్వం: మంత్రి నిమ్మల



పశ్చిమగోదావరి జిల్లా పీఎంలంక వద్ద నల్లిక్రీక్‌ను పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

నరసాపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో అన్ని వ్యవస్థలు ధ్వంసమయ్యాయని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. అభివృద్ధి గుండు సున్నా అన్నారు. ఆదివారం పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మండలం పీఎంలంక వద్ద రూ.12.50 కోట్లతో నల్లిక్రీక్ తవ్వకం పనులకు ఎమ్మెల్యే నాయకర్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఉప్పుటేరులోకి వెళ్లి నల్లిక్రీక్ పాయను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ వైసీపీ హయాంలో ఇరిగేషన్ వ్యవస్థ నిర్వీర్యమైందన్నారు. డ్రెయినేజీలు, కాల్వల పూడికతీత పనులు చేపట్టకపోవడం వల్ల రైతులు సాగుకు దూరమయ్యారని చెప్పారు. కూటమి అధికారంలోకి రాగానే వీటిన్నంటిని గాడిలో పెడుతోందన్నారు. ఇటు శ్రీశైలం డ్యామ్ వద్ద ధ్వంసమైన పంజ్‌పూల్, సైడ్ వాల్ నిర్మాణానికి రూ.200 కోట్లు, ధవళేశ్వరం బ్యారేజ్ ఆధునికీకరణ పనులకు రూ.150 కోట్లు, తుంగభద్ర గేటు మరమ్మతులకు రూ.54 కోట్లు కేటాయించామని తెలిపారు. రానున్న రోజుల్లో పెండింగ్ పనులకు దశల వారీగా నిధులు కేటాయించి పూర్తి చేస్తామని చెప్పారు.

ఇదేంది సారూ..

ఇలా చేశారు?!

సబ్‌రిజిస్ట్రార్ ఆనందరెడ్డికి పోస్టింగుపై వివరణ పేరిట అసలు గుట్టు రట్టు!

- రిజిస్ట్రేషన్ ఐజీ అంబేడ్కర్ వివరణపై అనేక అనుమానాలు
- వేర్వేరు జిల్లాల డీఐజీలు ఆనందరెడ్డి అక్రమాలు నిర్ధారించారు
- ఆయన సస్పెన్షన్‌ను హైకోర్టు ఆపేస్తే ఎందుకు అప్పీల్‌కు వెళ్లలేదు?
- ఏ ప్రాతిపదికన నిర్ణయం తీసుకోవాలని చిత్తూరు డీఐజీకి లేఖ రాశారు?
- రిజిస్ట్రేషన్ శాఖ వర్గాల్లో చర్చ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

సబ్‌రిజిస్ట్రార్ ఆనందరెడ్డికి రేణిగుంటలోనే డిప్యుటేషన్‌పై పోస్టింగ్ ఇవ్వడం వెనక ఏం జరిగింది? అక్కడే ఆయనకు పోస్టింగ్ ఇవ్వాలని ఎవరు నిర్ణయించారు? ఎవరు ఆదేశించారు? ఆయనపై ఉన్న సస్పెన్షన్‌ను హైకోర్టు కొట్టివేసినప్పుడు.. రిజిస్ట్రేషన్ ఎందుకు అప్పీల్‌కు వెళ్లలేదు..? ..ఆరాతీస్తే తెరవెనుక చాలా పరిణామాలే చోటుచేసుకున్నట్లు స్పష్టమవుతోంది. దీనికి తోడు ఆయన పోస్టింగ్‌కు ముందు, తర్వాత జరిగిన వ్యవహారాలపై రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్-ఐజీ అంబేడ్కర్ ఇచ్చిన వివరణ పరిశీలిస్తే ఎక్కడా లేని అనుమానాలు, సందేహాలు వెల్లువెత్తుతున్నాయి. రిజిస్ట్రేషన్ల శాఖలో బరితెగింపు 'పోస్టింగ్‌పై 'మంత్రి చెబితే మాకేంటి' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' గత శుక్రవారం (28వ తేదీన) ప్రచురించిన కథనంపై ఓ ప్రభుత్వ ఉన్నతాధికారి వివరణ ఇస్తే.. అందులో హేతుబద్ధత ఉండాలి. కానీ ఐజీ వివరణ సరికొత్త సందేహాలను లేవనెత్తుతోంది. ప్రభుత్వంతో సంబంధం లేకుండా జరిగిన నిర్ణయాల వెనుక ఏదో దాచినట్లు కనిపిస్తోంది. పైగా ఆయన ఓ విభాగాధిపతిగా చేయాల్సిన పనిచేయలేదని, అది ఆనందరెడ్డికి భారీ ప్రయోజనం కలిగించిందని స్పష్టమవుతోంది.

ప్రభుత్వ నిర్ణయం రాకముందే జాయినింగ్ రిపోర్టా?

ఆనందరెడ్డి తన సస్పెన్షన్‌ను సవాల్ చేస్తూ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో తొలి ప్రతివాదిగా రెవెన్యూ శాఖ (రిజిస్ట్రేషన్) స్పెషల్ సీఎస్ ఉన్నారు. రెండో ప్రతివాదిగా రిజిస్ట్రేషన్ కమిషనర్-ఐజీ, మూడో ప్రతివాదిగా చిత్తూరు డీఐజీ ఉన్నారు. నిబంధనల ప్రకారం.. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో సబ్‌రిజిస్ట్రార్ ఆనందరెడ్డిపై విధించిన సస్పెన్షన్‌ను తొలగించి.. పోస్టింగ్ ఇవ్వాల్సింది స్పెషల్ సీఎస్. అంటే ప్రభుత్వమే ఆ పనిచేయాలి. దాని నిర్ణయం రాకముందే ఆనందరెడ్డి 20వ తేదీనే చిత్తూరు డీఐజీ ముందు జాయినింగ్ రిపోర్టు ఎలా ఇచ్చారు? తర్వాత తనకు ఇంతకుముందు ఇచ్చిన రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్ పోస్టు తిరిగి ఇవ్వాలంటూ 24వ తేదీన రిజిస్ట్రేషన్ ఐజీ, స్పెషల్ సీఎస్‌కు విడివిడిగా వినతి పత్రాలు సమర్పించారు. సస్పెన్షన్ ఎత్తివేయకుండానే 20నే ఆయన ఎలా జాయినింగ్ రిపోర్టు ఇచ్చారనేది ప్రశ్న.

- తనకు పోస్టింగ్ ఇవ్వాలన్న ఆనందరెడ్డి వినతిపత్రంపై ఫైలు తయారు చేసి 24వ తేదీన స్పెషల్ సీఎస్‌కు ఐజీ ఫైలు పంపారు. ఇక ఆయన చేయడానికి ఏమీలేదు. ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూడాలి. కానీ.. అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం ఆనందరెడ్డి విషయంలో చర్యలు తీసుకోవాలని చిత్తూరు ఇన్‌చార్జి డీఐజీకి అంబేడ్కర్ లిఖితపూర్వక ఆదేశాలిచ్చారు. ఏ నిబంధన కింద ఈ ఆదేశాలిచ్చారు? కోర్టు ఉత్తర్వులపై ప్రభుత్వం (స్పెషల్ సీఎస్) నిర్ణయం తీసుకోకుండానే.. నిర్ణయం తీసుకోవాలని జిల్లా స్థాయి అధికారిని ఐజీ ఎలా ఆదేశిస్తారు? ఇదే అసలు విషయం. ఇలా ఆదేశం ఇవ్వడం వెనకున్న కారణం ఏమిటన్నదే చర్చనీయాంశంగా మారింది.

మంత్రి తిరస్కరించారుగా..!

రేణిగుంటలో ఆనందరెడ్డిని డిప్యుటేషన్‌పై సబ్‌రిజిస్ట్రార్‌గా నియమించాలన్న ప్రతిపాదనను 26వ తేదీన రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ తిరస్కరించారు. ఫైలును వెనక్కి పంపించారు. కానీ రేణిగుంట డిప్యుటేషన్‌ను తిరస్కరించాలని తాను 24నే ప్రతిపాదన పంపించానని ఐజీ తెలిపారు. అదే నిజమైతే ఆనందరెడ్డికి రేణిగుంటలో పోస్టింగ్ ఇవ్వాలన్న ప్రతిపాదనను ప్రభుత్వానికి పంపించింది ఎవరు? మంత్రి ఎందుకు తిరస్కరించారు..?

- ఆనందరెడ్డికి రేణిగుంటలో డిప్యుటేషన్ ఇవ్వకూడదనుకుంటే.. అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకోవాలని చిత్తూరు డీఐజీని 26వ తేదీన ఐజీ ఎలా ఆదేశించారు? మరుసటి రోజునే.. అంటే 27వ తేదీన ఆనందరెడ్డి కోరుకున్నట్లుగా రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్‌గా డిప్యుటేషన్ ఇస్తూ చిత్తూరు ఇన్‌చార్జి డీఐజీ ఉత్తర్వులు ఇచ్చారు. ఇదెలా సాధ్యమైందో ఐజీ చెప్పాల్సి ఉంది. నిబంధనలు, బిజినెస్ రూల్స్ ప్రకారం.. ప్రభుత్వం వద్దన్నా ఓ జిల్లా స్థాయి అధికారి ఎలా ఉత్తర్వులు ఇచ్చారు? పైగా ఆ ఉత్తర్వులో ఐజీ లేఖను ప్రస్తావించారు కూడా. అంబేడ్కర్ చెబుతున్న ప్రకారం.. డిప్యుటేషన్ రద్దుచేయాలని 24నే ఆయన ప్రతిపాదన పంపిస్తే.. అందుకు పూర్తి విరుద్ధంగా.. 26న ఐజీ రాసిన లేఖను ఉటంకిస్తూ చిత్తూరు డీఐజీ రేణిగుంటలో ఆనందరెడ్డికి పోస్టింగ్ ఎలా ఇచ్చారు? అంటే ఈ విషయంలో ఇంకేదో జరిగిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తన పై అధికారి నిర్ణయానికి విరుద్ధంగా.. ప్రభుత్వ నిర్ణయం రాకుండానే ఆనందరెడ్డికి రేణిగుంటలోనే పోస్టింగ్ ఇవ్వడంలో ఒక్క చిత్తూరు ఇన్‌చార్జి డీఐజీ పాత్ర మాత్రమే ఉందా?
- ఇందులో మరో కీలకమైన కోణం ఉంది. ఇద్దరు డీఐజీలు వేర్వేరుగా జరిపిన విచారణల్లో ఆనందరెడ్డి అక్రమాలకు పాల్పడ్డారని తేలింది. ఆయనపై విధించిన సస్పెన్షన్‌ను హైకోర్టు సింగిల్ బెంచ్ కొట్టివేస్తే.. ఆ వెంటనే అప్పీల్‌కు ఎందుకు వెళ్లలేదు? ఆ పని చేయకుండా స్పెషల్ సీఎస్, ఐజీని ఎవరైనా ఆపారా? ఈ వ్యవహారంలో నిజంగా ప్రభుత్వం తప్పుచేసిందా.. లేక ఆనందరెడ్డిని కాపాడేందుకే ఉన్నతాధికారులు అప్పీల్‌కు వెళ్లకుండా ఆగిపోయారా అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రభుత్వం నిష్పాక్షిక విచారణ జరిపిస్తేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని సీనియర్ అధికారులు చెబుతున్నారు.

ఇదీ ఆనందరెడ్డి కథ..

రిజిస్ట్రేషన్ శాఖలో చిత్తూరు జిల్లా ఆడిట్ విభాగంలో ఉద్యోగం చేస్తున్న ఆనందరెడ్డికి ఈ ఏడాది మార్చి 10న తిరుపతి జిల్లా రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్‌గా డిప్యుటేషన్‌పై పోస్టింగ్ ఇచ్చారు. ఆయన అక్కడ అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని అక్టోబరు 14న ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం అనంతపురం రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీని అక్టోబరు 16న ఆదేశించింది. ఆనందరెడ్డి అక్రమాలకు పాల్పడ్డారని నిగ్గుతేలుస్తూ ఆయన 18న నివేదిక ఇచ్చారు. ఇంకా ఈ విషయంలో సమగ్ర విచారణ అవసరమని సిఫారసు చేశారు. దీంతో రెండో దఫా నెల్లూరు డీఐజీని విచారణకు నియమించారు. ఆనందరెడ్డి అక్రమాలకు పాల్పడ్డారని ఆయనా నిర్ధారిస్తూ నివేదిక ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆయన్ను సస్పెండ్ చేయాలని రిజిస్ట్రేషన్ ఐజీ నవంబరు 11న చిత్తూరు రిజిస్ట్రేషన్ డీఐజీని ఆదేశించారు. ఆయన ఆనందరెడ్డిని సస్పెండ్ చేశారు.

హైకోర్టు సస్పెండ్ చేశాక..

తనను సస్పెండ్ చేయడాన్ని ఆనందరెడ్డి హైకోర్టులో సవాల్ చేశారు. సస్పెన్షన్ ఉత్తర్వును కోర్టు సస్పెండ్ చేసింది. దీంతో తన సస్పెన్షన్ ఉత్తర్వును రద్దుచేయాలని ఆనందరెడ్డి నవంబరు 24న రెవెన్యూ (రిజిస్ట్రేషన్) స్పెషల్ సీఎస్, రిజిస్ట్రేషన్ ఐజీకి వినతిపత్రం సమర్పించారు. ఆ విన్నపాన్ని ప్రభుత్వ పరిశీలనకు అదే రోజు (24వ తేదీ) పంపించినట్లు ఐజీ తన వివరణలో పేర్కొన్నారు. రేణిగుంట సబ్ రిజిస్ట్రార్‌గా డిప్యుటేషన్‌ను రద్దుచేయాలని తాను ప్రభుత్వానికి అదే రోజు సిఫారసు చేశానన్నారు. అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం ఆనందరెడ్డి విషయంలో చర్యలు తీసుకోవాలని చిత్తూరు డీఐజీని ఆదేశిస్తూ 26వ తేదీన లేఖ రాశానని సుస్పష్టంగా తెలియజేశారు. 'ఆంధ్రజ్యోతి' కథనంలో పేర్కొన్న అంశాల్లో అధికారుల వైఫల్యం లేదని.. ఎవరి తప్పూ లేదని, అన్నీ కాకతాళీయంగానే జరిగిపోయాయన్నట్లుగా ఆయన వివరణ ఉంది. కానీ ఆయన సదరు వివరణ ద్వారా అనేక అనుమానాస్పద అంశాలను ప్రభుత్వాన్ని, విభాగాధిపతిని ఇరకాటంలో పడేసే ప్రశ్నలుగా మలిచారు.

సమస్యలు చెప్పండి.. పార్లమెంటులో ప్రస్తావిస్తా!

- యువతకు ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు పిలుపు

అమరావతి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): నరసరావుపేట ఎంపీ, టీడీపీ పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణదేవరాయలు వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టారు. సోమవారం నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఏపీ యువతకు సంబంధించిన సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, వాటిని సహచర టీడీపీ ఎంపీలతో కలిసి పార్లమెంటులో ప్రస్తావిస్తానని తన 'ఎక్స్' ఖాతా ద్వారా పిలుపునిచ్చారు. రాష్ట్రాభివృద్ధితో పాటు యువత భవిష్యత్తుకు సంబంధించిన సమస్యలను తెలియజేయాలని కోరారు. టీడీపీ నాయకులుగా.. తాము భాగస్వామ్య ప్రజాస్వామ్యాన్ని విశ్వసిస్తామని, రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ ముఖ్యంగా యువత దానిలో భాగం కావాలని కోరుకుంటున్నామని తెలిపారు. జాతీయ వేదిక అయిన పార్లమెంటు ద్వారా రాష్ట్ర యువతకు సంబంధించి ముఖ్యమైన సమస్యలపై దేశం దృష్టిని ఆకర్షించే ప్రయత్నం చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. సమస్యలను తనకు కామెంట్స్ రూపంలో తెలియజేయాలని కోరారు.

అక్క కళ్లల్లో ఆనందం కోసం బావ హత్య

- అడ్డొచ్చిన అతని తల్లినీ నరికేసిన మైనర్
- మరో ఇద్దరు మైనర్లతో కలిసి ఘాతుకం
- ధూళిపాళ్లలో తల్లీ కొడుకుల దారుణ హత్య

సత్తెనపల్లి రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అక్క కళ్లల్లో ఆనందం కోసం ఓ మైనర్ బాలుడు సొంత బావతో పాటు అతని తల్లినీ కిరాతకంగా నరికి చంపేశాడు. మరో ఇద్దరు మైనర్లతో కలిసి ఈ ఘాతుకానికి ఒడిగట్టాడు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం ఈ దారుణం చోటుచేసుకుంది. ధూళిపాళ్ల గ్రామానికి చెందిన దొప్పలపూడి సాంబశివరావు (36)కు నాదెండ్ల మండలం గణపవరం గ్రామానికి చెందిన సాహితీతో రెండేళ్ల క్రితం వివాహమైంది. అప్పటి నుంచి సాహితీని సాంబశివరావు వేధిస్తూ ఉండేవాడు. దీంతో ఆరు నెలల క్రితం సాహితీ భర్త నుంచి విడాకులు తీసుకుంది. పాలిటెక్నిక్ చదువుతున్న సాహితి సోదరుడు రోహిత్ చౌదరి.. దీన్ని మనసులో పెట్టుకుని సాంబశివరావుపై కక్ష పెంచుకున్నాడు. ఎలాగైనా అతన్ని హతమార్చాలని భావించాడు. ఈ క్రమంలో తన స్నేహితులైన సాతులూరి రవికుమార్, షేక్ జావెద్ ఇస్లాంతో కలసి ఆదివారం సాంబశివరావు ఇంటికి వెళ్లారు. మంచంపై పడుకున్న సాంబశివరావును కత్తులతో అత్యంత కిరాతకంగా నరికి చంపారు. అడ్డువచ్చిన సాంబశివరావు తల్లి కృష్ణకుమారి (55)ని కూడా నరికి అక్కడి నుంచి పారిపోయారు. వారిని గమనించిన స్థానికులు వెంబడించి నకరికల్లు మండలం చాగల్లు వద్ద పట్టుకొని దేహశుద్ధి చేశారు. సమాచారం అందుకున్న సత్తెనపల్లి రూరల్ పోలీసులు అక్కడకు చేరుకుని ఆ ముగ్గురినీ అదుపులోకి తీసుకున్నారు. తీవ్రగాయాల పాలైన కృష్ణకుమారిని సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించగా ఆమె చికిత్స పొందుతూ మృతిచెందారు. నిందితుల్లో రోహిత్ చౌదరి పాలిటెక్నిక్, రవికుమార్, జావెద్ ఇస్లాంలు ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నారు. ముగ్గురూ మైనర్లే కావడం, తన అక్కను వేధించాడనే కక్ష పెంచుకుని అక్క కళ్లల్లో ఆనందం చూడడం కోసమే సాంబశివరావును హత్య చేసినట్టు రోహిత్ చౌదరి చెప్పడం సంచలనంగా మారింది.

> నిరంతరం ప్రజల్లో ఉంటేనే మంచి రాజకీయ నేతలుగా రాణించగలుగుతాం. టీడీపీ నేతలు, శ్రేణులు వారి కష్టనష్టాలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి. - సీఎం చంద్రబాబు

17 నెలల్లో 50,763 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

రూ.1.80 లక్షల చొప్పున అందిస్తున్నామని చెప్పారు. మరే రాష్ట్రమూ ఈ స్థాయిలో లబ్ధిదారులకు ఆర్థిక సాయం చేయడం లేదన్నారు. 'పింఛన్ల పంపిణీలో మన నేతల భాగస్వామ్యం గతంలో కేవలం 16 వేలే ఉండేది. తరచూ దాని ప్రాధాన్యం వివరిస్తూ రావడం.. నేరుగా నేనూ పేదల సేవలో పాల్గొంటుండడంతో మిగిలిన నేతలు కూడా పాల్గొనడం ప్రారంభించారు. ఇప్పుడు సుమారు 25వేల మంది నాయకులు భాగస్వాములవుతున్నారు. రానున్న రోజుల్లో ఇది 35వేలకు చేరాలి' అని ఆకాంక్షించారు. త్వరలోనే ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఎఫ్‌బీఎంఎస్) ద్వారా ఉమ్మడి కుటుంబాలకు మరింత లబ్ధి చేకూర్చే విధానం అమలు చేస్తామన్నారు. కొన్నిచోట్ల అనర్హులకు పింఛన్లు అందుతున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయని, వాటిని పరిశీలిస్తామని తెలిపారు. అర్హులు ఏ పార్టీకి చెందిన వారైనా అన్యాయం జరగనివ్వబోమని స్పష్టంచేశారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

కార్యకర్తలకు అన్యాయం జరగనివ్వను..

మన ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజలకు వివరించి చెబితే కూటమిని కాదని పక్క పార్టీలకు వారు ఓటేయరు. సంక్షేమ కార్యక్రమాలు అందించడంతోపాటు ప్రజలతో నేతలు మమేకం కావాలి. కార్యకర్తల అభిప్రాయాల మేరకే నాయకత్వం ముందుకెళ్లాలి. 12 లక్షల మంది కుటుంబ సాధికార సారథులు, 46వేల మంది బూత్ ఇన్‌చార్జులు, 8వేల మంది యూనిట్ వ్యవస్థల బలం పార్టీకి ఉంది. వీరంతా కలిసి కూటమి చేస్తున్న మంచిని జనంలోకి తీసుకెళ్లాలి. కార్యకర్తలు పార్టీయే సర్వస్వంగా తమ ఆస్తులు, ప్రాణాలు త్యాగం చేశారు. పనిచేసిన కార్యకర్తలకు నామినేటెడ్ పదవులిచ్చి గౌరవిస్తున్నాం. ఏ ఒక్కరికీ అన్యాయం జరగనివ్వం. సోమవారం నుంచి ప్రారంభమయ్యే శిక్షణ కార్యక్రమాలను పార్టీ శ్రేణులు సద్వినియోగం చేసుకోవాలి. గత పాలకుల విధ్వంసంతో రాష్ట్రానికి చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనిపై ప్రజల్లో ఇంకా చర్చ జరగాలి. రాజకీయ కక్షతో నీరు-చెట్టు, ఉపాధి హామీ బిల్లులు కూడా నిలిపివేశారు. కేంద్రంతో మాట్లాడి ఈ బిల్లులను మంజూరు చేయించారు. ఇళ్ల పథకంలోనూ నిధులను దారి మళ్లించారు. ఉగాది నాటికి మరో 5 లక్షల ఇళ్లను ప్రజలకు అందిస్తాం. అర్హుడైన ప్రతి పేదవాడికీ సొంత ఇల్లు ఉండాలన్నది మన ప్రభుత్వ లక్ష్యం.

నేటి నుంచి పార్టీ డిసెంబరు క్యాలెండర్..

టీడీపీ కార్యక్రమాలకు సంబంధించి డిసెంబరు క్యాలెండర్ రూపొందించాం. 1న పింఛన్ల పంపిణీ, 3న రైతుసేవా కేంద్రాల్లో వర్క్ షాపుల ద్వారా రైతులకు అవగాహన కార్యక్రమాలు, 5న మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహిస్తున్నాం. వీటన్నిటిలోనూ నాయకత్వం, కార్యకర్తలు పాల్గొనాలి.

నేడు గోపీనాథపట్నంలో సీఎం పింఛన్ల పంపిణీ

ఏలూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు డిసెంబరు 1న ఏలూరు జిల్లా ఉంగుటూరు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఉదయం 10.30గంటలకు ఉండవల్లి నుంచి హెలికాప్టర్లో బయల్దేరి ఉంగుటూరు మండలం నల్లమాడు వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డుమార్గాన గోపీనాథపట్నం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేస్తారు. తిరిగి నల్లమాడుకు చేరుకుని.. అక్కడ ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను సందర్శిస్తారు. అక్కడే ప్రజావేదిక వద్ద బహిరంగ సభలో ప్రసంగిస్తారు. ఉంగుటూరు నియోజకవర్గ మార్గదర్శకులు, బంగారు కుటుంబాలతో ముఖాముఖి నిర్వహించి సత్కరిస్తారు. అనంతరం టీడీపీ శ్రేణులతో సమావేశమవుతారు. ఆపై ఉండవల్లికి తిరుగుపయనమవుతారు.

నెల్లూరు, ప్రకాశంకు రెడ్ అలెర్ట్

- తుఫాన్ ముసురుతో వర్షం.. జనం అవస్థలు
- నెల్లూరులో నేడు బడులకు సెలవు
- విద్యుత్ ఉద్యోగులకు సెలవుల రద్దు

నెల్లూరు(హరనాథపురం), ఒంగోలు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావంతో ఆదివారం నెల్లూరు జిల్లా వ్యాప్తంగా ముసురేసింది. ఆగాగి రోజంతా వర్షం కురుస్తూనే ఉంది. సాగరతీరం కల్లోలంగా మారింది. కావలి మండలం తుమ్మలపెంట, కొత్తసత్రం సముద్రతీరం 50 అడుగుల మేర ముందుకు రావటంతోపాటు 5 అడుగులమేర అలలు ఎగసి పడుతున్నాయి. దీంతో మెరైన్ పోలీసులు పర్యాటకులను సముద్ర స్నానాలకు రాకుండా గస్తీ నిర్వహిస్తున్నారు. సోమ, మంగళవారాల్లో భారీ నుంచి అతి భారీవర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. ప్రజలకు విద్యుత్ ఇబ్బందులు ఏర్పడకుండా ఉండేందుకు సిబ్బందికి సెలవులు రద్దు చేశామని ఎస్ఈ రాఘవేంద్రం తెలిపారు. అలాగే, జేసీ వెంకటేశ్వర్లు ఆదేశాలతో సోమవారం అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించినట్లు డీఈవో బాలాజీరావు, ఆర్ఐవో వరప్రసాద్‌రావు తెలిపారు. తుఫాన్ ప్రభావంతో ఎగువ నుంచి ఏక్షణమైనా వరద వచ్చే సూచనలు ఉండడంతో సోమశిలలో ఉన్న నీటినిల్వను తగ్గించేలా చర్యలు తీసుకున్నారు.

అప్రమత్తంగా ఉండాలి: మంత్రులు

తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని దేవదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం జిల్లా ప్రత్యేకాధికారి యువరాజ్‌తో కలిసి ఆయన కలెక్టరేట్‌లో సమీక్షించారు. వ్యవసాయ అనుబంధ రంగాలు, రోడ్లు, భవనాల శాఖ, విద్యుత్‌శాఖ అధికారులంతా అప్రమత్తంగా ఉంటూ, జిల్లాలో నష్ట నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. పెన్నా పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మరో మంత్రి నారాయణ కోరారు.

ప్రకాశం జిల్లాలో..

తుఫాన్ నేపథ్యంలో ప్రకాశం జిల్లాకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. వచ్చే 24 గంటలు భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ఆదివారం ఉదయం నుంచి గాలుల తీవ్రత అధికమైంది. చిరుజల్లులు కురుస్తున్నాయి. సముద్రంలో అలలు ఎగసిపడుతున్నాయి. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లాలోని తీర ప్రాంతాలతోపాటు సమీప 14 మండలాల్లోని 168 గ్రామాలపై తుఫాన్ ప్రభావం ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఒంగోలులోని కలెక్టరేట్‌లో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. కీలక శాఖలతోపాటు తీర ప్రాంత అధికారులను కలెక్టర్ పి.రాజాబాబు అప్రమత్తం చేశారు.

అన్నదాతల్లో ఆందోళన

- ఉమ్మడి గోదావరి జిల్లాలపై తుఫాను ప్రభావం

అమలాపురం, భీమవరం రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఖరీఫ్ మాసూళ్లు ముమ్మరంగా జరుగుతున్న సమయంలో తుఫాను ప్రభావంతో ఈదురుగాలులకుతోడు చిరుజల్లులు పడుతుండడంతో రైతులు వణికిపోతున్నారు. తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాల వ్యాప్తంగా ఇప్పటికే కోతలు ప్రారంభం కావడంతో వరి పనలను ఒడ్డుకు చేర్చడం, ధాన్యపు రాశులను సంరక్షించుకునే పనిలో ఉండగా, ఇప్పుడు చిరుజల్లులు కంటిమీద కునుకు ఉండనివ్వడంలేదు. పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగానూ ఎడతెరిపి లేకుండా చిన్నపాటి చినుకులు పడుతున్నాయి. రైతుల్లో కంగారు మొదలైంది. సార్వా పంట లక్షా 27వేల ఎకరాల్లో ఉంది. మాసూళ్లు అయిన 30 వేల టన్నుల ధాన్యం రహదారుల పక్కన పంటచేల దిబ్బలపై ఉండి పోయింది. అధిక వర్షాలు కురిస్తే కోత దశలోని చేలకు నష్టం. ధాన్యం రాశులే తడిసిపోతాయేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉప్పాడలో సముద్రం అల్లకల్లోలంగా మారింది.

తమిళనాట భారీ వర్షాలు

- ఆరుగురి మృతి.. నీట మునిగిన రామేశ్వరం రైల్వే స్టేషన్



తమిళనాడులోని ఎన్నూరు తీరంలో ఎగసిపడుతున్న అలలు

చెన్నై, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన దిత్వా తుఫాను ప్రభావంతో తమిళనాడులోని తీరప్రాంత జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. జనజీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. తంజావూరు, తిరువారూర్, మైలాడుదురై, నాగపట్టణం తదితర డెల్టా జిల్లాల్లో గత రెండు రోజులుగా భారీ వర్షం కురుస్తుండడంతో వేలాది ఎకరాల పంట నష్టం వాటిల్లింది. భారీ వర్షాల కారణంగా ప్రమాదాలబారిన పడి రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ఆరుగురు మృతి చెందారు. రామనాథపురం జిల్లా రామేశ్వరంలో శని, ఆదివారాల్లో అతి భారీ వర్షం కురిసింది. రామేశ్వరం రైల్వే స్టేషన్ నీట మునిగింది. రైల్వే ప్లాట్‌ఫారాలపైకి వర్షపునీరు చొచ్చుకువచ్చింది. వందలాది గృహాలు వరదనీటిలో తేలియాడుతున్నాయి. తంజావూరు, తిరువారూర్, నాగపట్టణం, మైలాడుదురై జిల్లాల్లో 100కుపైగా గృహాలు కూలిపోయినట్టు అధికారులు వెల్లడించారు. భారీ వర్షాల కారణంగా తంజావూరుతో సహా నాలుగు జిల్లాలకు చెందిన జాలర్లు వారం రోజులుగా సముద్రంలోకి చేపల వేటకు వెళ్లలేదు. దీంతో 60 వేలకుపైగా జాలర్లు ఉపాధిని కోల్పోయారు. కన్యాకుమారిలో సముద్రపు నీరు వందడుగుల మేర వెనక్కి వెళ్లింది. దీంతో సముద్రగర్భంలోని పెద్దపెద్ద రాళ్లు బయటపడ్డాయి. ఇక దిత్వా తుఫాను కారణంగా చెన్నై, కడలూరు, పుదుచ్చేరిలలో సముద్రం ఆదివారం అల్లకల్లోలంగా మారింది. కడలూరు, పుదుచ్చేరిలో లోతట్టు మత్స్యకార గ్రామాల్లోకి సముద్రపు చొచ్చుకువచ్చింది. దీంతో జాలర్లను సురక్షిత ప్రాంతాలతో పాటు తుఫాను సహాయక కేంద్రాలకు తరలించారు. ఎన్నూరు హార్బరులో రాక్షస అలలు ఆరు మీటర్ల ఎత్తున ఎగసిపడ్డాయి. మరోవైపు మెరీనా, బీసెంట్ నగర్ బీచ్‌లలోకి ఆదివారం పర్యాటకులను అనుమతించలేదు. కడపటి వార్తలు అందేసరికి చెన్నై నగరానికి 100 కిలోమీటర్ల దూరంలో దిత్వా తుఫాను కేంద్రీకృతమైవున్నట్టు వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. ఈ తుఫాను చెన్నై మీదుగా ఆంధ్రప్రదేశ్ వైపు పయనించి రాగల 24 గంటల్లో తీరం దాటవచ్చని వాతావరణ శాఖ అంచనా వేసింది.

బలహీనపడిన 'దిత్వా' తుఫాన్

(మొదటి పేజీ తరువాయి)

తీవ్ర వాయుగుండంగా బలహీనపడింది. శనివారం రాత్రి నుంచి తమిళనాడుకు సమాంతరంగా పయనించి ఆదివారం మధ్యాహ్నానికి ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరికి చేరువగా వచ్చింది. ఆ తరువాత వాతావరణం అనుకూలించకపోవడంతో మధ్యాహ్నం నుంచి జోరు తగ్గింది. అయితే తుఫాన్ ఆవరించిన ప్రాంతం ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరికి మరింత చేరువై వాయుగుండంగా మారుతుందని భారత వాతావరణశాఖ తెలిపింది. ఈ క్రమంలో తీవ్ర వాయుగుండంగా మారి సాయంత్రానికి పుదుచ్చేరికి తూర్పు ఆగ్నేయంగా 90, చెన్నైకు దక్షిణ ఆగ్నేయంగా 140 కి.మీ.ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఇది ఆదివారం రాత్రి లేదా సోమవారం ఉదయానికి పుదుచ్చేరికి 20, చెన్నైకు 40 కి.మీ. దూరంలో సముద్రంలోకి రానున్నదని తెలిపింది. ఉత్తర దిశ నుంచి తుఫాన్ వైపుగా పొడి చలిగాలులు రావడం, తుఫాన్ పరిసరాల్లో మేఘాలు విచ్ఛిన్నం కావడంతో దాని తీవ్రత తగ్గిందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఆదివారం ఉదయానికి తీవ్ర వాయుగుండంగా బలహీనపడిందని ఇస్రో వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. తీవ్ర వాయుగుండం సోమవారం ఉదయానికి వాయుగుండంగా బలహీనపడినా... చెన్నైకు చేరువగా రానున్నందున మేఘాలు ఉత్తర తమిళనాడు, దానికి ఆనుకుని దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ వైపుగా రానున్నాయి. దీంతో వర్షాలు పెరగనున్నాయి. రానున్న 24గంటల్లో దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడా భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

చలిగాలులు.. చిరుజల్లులు

తుఫాన్ ప్రభావంతో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో మేఘాలు ఆవరించి చలిగాలులు వీస్తున్నాయి. ఆదివారం ఉదయం నుంచి దక్షిణ కోస్తా, రాయలసీమలో వర్షాలు కురుస్తున్నాయి. తుఫాన్ ఉత్తర తమిళనాడుకు మరింత చేరువగా రానున్న నేపథ్యంలో రాత్రి నుంచి వర్షాలు పెరుగుతాయని, సోమవారం ఉదయం 8గంటల వరకు కోస్తా, రాయలసీమలో అనేకచోట్ల వర్షాలు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో అక్కడక్కడా కుంభవృష్టి వర్షాలు, బాపట్ల, తిరుపతి, అన్నమయ్య, కడప జిల్లాల్లో అతిభారీ, కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, పల్నాడు, చిత్తూరు, నంద్యాల, శ్రీసత్యసాయి, నంద్యాల, అనంతపురం జిలాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ, విపత్తుల నిర్వహణ శాఖలు తెలిపాయి. మత్స్యకారులు సముద్రంలో చేపలవేటకు వెళ్లరాదని, రైతులు పంటల ఉత్పత్తుల రక్షణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణశాఖ సూచించింది. కృష్ణపట్నం, నిజాంపట్నం, ఓడరేవు, మచిలీపట్నం ఓడరేవుల్లో మూడో నంబరు, కోస్తాలో మిగిలిన రేవుల్లో రెండో నంబరు భద్రతా సూచికలు ఎగురవేశారు. కాగా, ఆదివారం ఉదయం నుంచి రాత్రి 10 గంటల వరకు కావలిలో 103.5, కావలి దరి అరుంధతి పురంలో 84.5, జలదంకిలో 66.25, చామదాలలో 63.0 మి.మీ.ల వర్షపాతం నమోదైంది.

మరో 48 గంటలు అలర్ట్‌గా ఉండాలి: హోంమంత్రి అనిత

అమరావతి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ పట్ల ఆది, సోమవారాల్లో అధికారులు మరింత అలర్ట్‌గా ఉండాలని హోం మంత్రి అనిత స్పష్టం చేశారు. ఆదివారం రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ నుంచి తుఫాన్ పరిస్థితిని మంత్రి సమీక్షించారు. తుఫాన్ ప్రభావం ఉండే నెల్లూరు, తిరుపతి, కడప, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 'తుఫాన్ వల్ల ప్రాణ నష్టం లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిది. క్షేత్రస్థాయిలో ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలి. ప్రమాదకర ప్రదేశాల వద్ద అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులను నియమించాలి. విద్యుత్ అంతరాయం కలిగితే వెంటనే పునరుద్ధరించాలి' అని ఆదేశించారు. కాగా, తుఫాను ప్రభావిత ప్రాంతాల్లోని అధికారులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కోరారు. దిత్వా తుఫాను నేపథ్యంలో ఆదివారం ఆయన దక్షిణ కోస్తా, రాయలసీమ విద్యుత్తు శాఖ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడితే వెంటనే పునరుద్ధరించాలన్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులను ఎప్పటికప్పుడు తనకు నివేదించాలని ఆదేశించారు.

ఐటీలో హెచ్ఐవీ బగ్!

- ఆ రంగానికి చెందినవారిలో ఇటీవల పెరుగుతున్న వైరస్ కేసులు
- విచ్చలవిడి వీకెండ్ పార్టీలు, డ్రగ్స్ మత్తు ఇంజెక్షన్ల వినియోగంతో సమస్య
- జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ హెచ్చరిక
- మొత్తం కేసుల్లో మహారాష్ట్ర తర్వాత రెండో స్థానంలో ఏపీ

హైదరాబాద్/అమరావతి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): నిత్య నూతన సాంకేతికతలతో ఆధునిక పోకడలకు చిరునామా అయిన ఐటీ రంగంలో హెచ్ఐవీ బగ్ ప్రవేశించింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఐటీ రంగానికి చెందినవారిలో హెచ్ఐవీ సంక్రమణ శాతం పెరుగుతోందని 'జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (న్యాకో)' తాజాగా హెచ్చరించింది. అన్ని రాష్ట్రాల ఎయిడ్స్ నియంత్రణ సొసైటీలు అప్రమత్తంగా ఉండాలని.. ఈ రంగానికి సంబంధించి హెచ్ఐవీ పరీక్షల సంఖ్యను పెంచాలని సూచించింది. మొత్తంగా హెచ్ఐవీ వ్యాప్తి తగ్గినా.. ఐటీ రంగంతోపాటు వ్యవసాయ కూలీల్లో మాత్రం స్వల్పంగా పెరుగుతోందని వెల్లడించింది.

హెచ్ఐవీ విస్తృతికి ఏమిటీ కారణం?

నేడు వరల్డ్ ఎయిడ్స్ డే

ఐటీ రంగంలో హెచ్ఐవీ వ్యాప్తి పెరగడానికి కొంతకాలంగా విదేశీ తరహా ఆధునిక జీవనశైలికి అలవాటు పడటం కారణమవుతోందని న్యాకో వర్గాలు చెబుతున్నాయి. కొందరు వారాంతాల్లో పార్టీల పేరుతో విచ్చలవిడిగా వ్యవహరిస్తుండటం, ఎక్కువ మందితో శారీరక సంబంధాలు, డ్రగ్స్, మద్యం మత్తులో అరక్షిత శృంగారంలో పాల్గొనడం, ఒకరు వాడిన డ్రగ్స్ ఇంజెక్షన్లను మరొకరు వాడటం వంటివి హెచ్ఐవీ వ్యాప్తికి కారణం అవుతున్నాయని అంటున్నాయి. ఇక గర్భం రాకుండా ఉండేందుకు చాలా మంది కండోమ్‌లు వాడేవారని.. కానీ శృంగారం తర్వాత కూడా వేసుకోగల ఐపిల్ తరహా తక్షణ గర్భనిరోధక మాత్రలు అందుబాటులోకి రావడంతో అరక్షిత శృంగారం పెరిగిందని చెబుతున్నాయి. ఇక వ్యవసాయ కూలీల్లో హెచ్ఐవీపై అవగాహన తక్కువగా ఉండటం, అరక్షిత శృంగారం, వారు తరచూ పని కోసం ఇతర ప్రాంతాలకు వలసలు వెళుతుండటం వంటివి వ్యాప్తికి కారణమని వివరిస్తున్నాయి. వారి జీవనశైలి కారణంగా రిస్క్ పీపుల్ కేటగిరీలో ఉంటారని న్యాకో వర్గాలు వివరిస్తున్నాయి.

హెచ్ఐవీ నియంత్రణలో టాప్‌లో ఏపీ

హెచ్ఐవీ కేసుల నియంత్రణలో ఏపీ ప్రథమ స్థానంలో ఉందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. న్యాకో నిర్దేశించిన 80 శాతం లక్ష్యంలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ (ఏపీ శాక్స్) 76.96 శాతం సాధించిందని తెలిపారు. హెచ్ఐవీ పాజిటివిటీ రేటు 2015-16లో 2.34 శాతం ఉండగా 2024-25 నాటికి 0.58 శాతానికి తగ్గిందని వెల్లడించారు. గర్భిణుల్లో పాజివిటీ రేటు 2015-16లో 0.10 శాతం నుంచి 2024-25నాటికి 0.04 శాతానికి తగ్గిందని చెప్పారు. 2015-16లో కొత్తగా 24,957 కేసులు, 2018-19లో 21,982 చొప్పున కేసులు వచ్చాయన్నారు. 2024-25లో కొత్త కేసులు 13,383 వచ్చినట్లు మంత్రి తెలిపారు. బాధితుల్లో అవగాహన కల్పించడం, ఉచితంగా మందులు ఇవ్వడం ద్వారా ఎయిడ్స్ సంబంధిత మరణాలు తగ్గించామని చెప్పారు. కాగా, ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉన్న హెచ్ఐవీ కేసుల్లో మహారాష్ట్ర (3,62,392) తరువాత ఏపీ (2,75,528) రెండో స్థానంలో ఉంది. అయితే కొత్త కేసులు పెరగకుండా నిరోధించడంలో రాష్ట్ర ప్రభుత్వం మంచి పురోగతిని సాధిస్తోంది. మరోవైపు ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల్లో 42,008 మంది ప్రభుత్వ పింఛన్లు పొందుతున్నారు. ఇంకొంతమంది పింఛన్ల దరఖాస్తులు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి. ఎయిడ్స్ బాధితులకు మందులు ఇప్పించడంలో జాతీయ స్థాయి లక్ష్యం 88శాతం కాగా ఏపీలో 87 శాతం వరకు నమోదైనట్లు ఏపీ శాక్స్ ప్రాజెక్టు డైరెక్టర్ నీలకంఠారెడ్డి తెలిపారు. న్యాకో వెల్లడించిన 2024-25 స్కోర్ కార్డులో ఏపీ రెండోస్థానంలో ఉంది. హెచ్ఐవీ నియంత్రణకు సంబంధించిన అన్ని రకాల కార్యక్రమాల్లో పురోగతి ఉన్నట్లు న్యాకో తెలిపింది.. రాష్ట్ర వ్యాప్తంగా 59 ఏఆర్టీ కేంద్రాల ద్వారా ప్రతినెలా 2,38,760 మంది మందులు తీసుకుంటున్నారు.

వామ్మో.. లేడీ డాన్లు!

(మొదటి పేజీ తరువాయి)

పుష్పగుచ్ఛం ఇస్తూ ఆమె దిగిన ఫొటోలు వెలుగులోకి వచ్చాయి. నెల్లూరు జైలులో యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్న శ్రీకాంత్ అనే ఖైదీని భర్తగా చెబుతూ ఆమె ఎన్నో దందాలు చేసింది. నెల్లూరు, తిరుపతి, గుంటూరు, విజయవాడలో అనేకం ఉన్నాయి. తాడేపల్లి ప్యాలెస్ పరిసరాల్లో ఇల్లు అద్దెకు తీసుకుని గత వైసీపీ హయాంలో నేరసామ్రాజ్యంలో ఎదిగింది. ఇద్దరు ఎస్పీలు, జైలు సూపరింటెండెంట్, హోంశాఖ ఉన్నతాధికారులు వ్యతిరేకించినా ప్రభుత్వంలోని అత్యున్నత స్థాయి అధికారి సిఫారసుతో శ్రీకాంత్‌ను పెరోల్‌పై బయటికి తీసుకొచ్చింది. అతడితో కలిసి అరుణ బెదిరింపులకు పాల్పడుతున్న బాగోతం వీడియోలతో సహా బయటపడింది. బాధితుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. శ్రీకాంత్ బెయిల్‌ను రద్దు చేశారు. అయినా ఆమె ఆగడాలు ఆపలేదు. జైలు అధికారులను సైతం.. 'వచ్చే ఎన్నికల తర్వాత హోం మంత్రిని అవుతా.. మీ సంగతి చెబుతా' అంటూ బెదిరించింది. విజయవాడ కోర్టు ప్రాంగణంలోనే బయటికి వచ్చాక అంతు చూస్తానని బాధితులను బెదిరించింది. ఆమె ఉన్న ఇల్లు సైతం ఒక బిల్డర్‌ను బెదిరించి రాయించుకున్నట్లు తేలింది. అరుణకు ఖరీదైన కార్లు ఉన్నాయి. వెనుక యువకుల గ్యాంగ్ ఉంది.

అరవ కామాక్షి గ్యాంగ్

సమాజాన్ని నిర్వీర్యం చేస్తున్న గంజాయికి వ్యతిరేకంగా పోరాడిన నెల్లూరు జిల్లాకు చెందిన సీపీఎం నాయకుడు పెంచలయ్యను 28వ తేదీన కత్తులతో నరికి చంపారు. దర్యాప్తు చేసిన పోలీసులకు అసలు నిజం తెలిసి విస్తుపోయారు. నెల్లూరులో పాత చెత్త సేకరించే వ్యాపారం చేసే అరవ కామాక్షి కొందరు యువకులను చేరదీసి గంజాయి దందా నిర్వహిస్తోంది. యువత పెడదారి పట్టడంతో పెంచలయ్య పోలీసులకు సమాచారం ఇచ్చారు. తమ గంజాయి విక్రయాలకు అడ్డు వస్తున్నారని కక్షకట్టిన కామాక్షి తన భర్త, సోదరులు, మరిదితో కలిసి పెంచలయ్యను దారుణంగా హత్య చేయించిందని నెల్లూరు పోలీసులు చెబుతున్నారు. తాజాగా ఆమెను పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక రాజకీయ నాయకుల అండతోనే కామాక్షి నేర సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నారని అంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో గంజాయి వ్యాపారంతో పెరిగిన ఆమె ఇప్పటికీ అదే దందా కొనసాగిస్తోందని చెబుతున్నారు. గతంలో రైల్వే ఆస్తులు దోచుకోవడం, సస్పెక్ట్ షీట్లలో ఉన్న కామాక్షి ఇప్పుడు రాజకీయ నాయకుడి హత్యతో సంచలనం సృష్టించింది.

చీరాల మరియమ్మ ముఠా

బాపట్ల జిల్లా చీరాలకు చెందిన మరియమ్మ గ్యాంగ్ కన్ను పడిందంటే బస్సుల్లో ప్రయాణించే మహిళల మెడలో చైన్ మాయమైపోతుంది. జాతర్లు, ఆలయాలు, ఫంక్షన్లలో మహిళల మెడలో చైన్లు రెప్పపాటులో కత్తిరించేస్తారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు తిరుగుతూ బస్సుల్లో బ్యాగులు తెరిచి బంగారం ఆభరణాలు కొట్టేయడం వృత్తిగా పెట్టుకున్నారు. తాడేపల్లిలో ప్రమీల గ్యాంగ్, విజయవాడలో సరోజినీ గ్యాంగ్‌తో కలిసి వరుస నేరాలకు పాల్పడుతున్నట్టు చెబుతున్నారు. పలు జిల్లాల పోలీసులకు మోస్ట్ వాంటెడ్ లిస్టులో ఉన్నారు. పొరుగు రాష్ట్రాల్లోని పోలీసులు సైతం ఈ ముఠా కోసం ఆరా తీశారు. ఒకప్పుడు స్టూవర్టుపురం దొంగలకన్నా ఇప్పుడు చీరాల మరియమ్మ గ్యాంగే ఎక్కువ దోపిడీలు చేస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు.

బ్యాంకర్ లీలలు

ఏలూరు జిల్లా నూజివీడుకు చెందిన ఒక మహిళ విజయవాడలోని ఓ బ్యాంకులో ఉన్నత స్థాయి ఉద్యోగిని. ఆమెకు విదేశాల్లో ఉద్యోగం చేసే వ్యక్తితో వివాహం జరిగింది. జీవితం సాఫీగా సాగిపోతున్న సమయంలో ఆ మహిళ తిరిగొచ్చి మరో వ్యక్తితో ఇక్కడ పరిచయం పెంచుకుంది. ఆ పరిచయం కాస్త సన్నిహితంగా మారింది. తాను పనిచేసే బ్యాంకులోనే అతడి బంగారం తాకట్టు పెట్టించింది. తర్వాత అతడికి తెలియకుండా ఫోర్జరీ సంతకం చేసి బంగారం తీసుకుంది. విషయం తెలిసిన ఆమె సన్నిహితుడు నిలదీయడంతో బెదిరింపులకు దిగింది. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు కావడంతో పాటు ఆమె ఉద్యోగం పోయింది. ఆమె ఇంతటితో ఆగకుండా సొంత బంధువుల ఆస్తులు కూడా కబ్జా చేసింది. సొంత పిన్నిపైనే దాడి చేసినట్లు కేసు నమోదైంది. పలువురితో డబ్బులు అప్పుగా తీసుకుని తిరిగి ఇవ్వలేదు. అడిగిన వారిని బెదిరించింది. వరుస పోలీసు కేసులు నమోదు కావడంతో ప్రభుత్వంలోని ఓ స్థాయి పెద్దల పంచన చేరింది. వివాదాలు మరీ ఎక్కువ కావడంతో కొన్ని నెలలుగా అజ్ఞాతంలోకి వెళ్లిపోయింది.

సరిహద్దులు దాటిన నేరాలు

కొన్ని నేరాలు అయితే సరిహద్దులు దాటుతున్నాయి. శ్రీకాళహస్తిలో ఒక రాజకీయ పార్టీ నాయకురాలి డ్రైవర్ హత్య కేసులో తమిళనాడు పోలీసులు వచ్చి ఆమెతో పాటు భర్తను అరెస్ట్ చేశారు. తెలంగాణలోని గద్వాలకు చెందిన సర్వేయర్ కర్నూలు జిల్లాలో హత్యకు గురికాగా, తెలంగాణ పోలీసులు వచ్చి మృతుడి భార్య, ప్రియుడిని అరెస్ట్ చేశారు. విజయవాడ పోలీసులు అరెస్ట్ చేసిన ఓ యువతి డ్రగ్స్ మూలాలు బెంగళూరులో తేలాయి.

తెనాలి బుజ్జి బాగోతం

తెనాలికి చెందిన ముడియాల వెంకటేశ్వరి అలియాస్ బుజ్జి తెలివైన క్రిమినల్. పరిచయాలు పెంచుకోవడం, వారికి సైనైడ్ కలిపిన పానీయాలు తాగించడం, బంగారం, డబ్బు కోసం హత్య చేయడం ఆమె విధానం. 30 ఏళ్లు దాటకుండానే కాంబోడియాకు వెళ్లి అక్కడ సైబర్ నేరాల్లో పాల్గొంది. కొన్నాళ్ల తర్వాత స్వదేశానికి తిరిగొచ్చి వైసీపీ హయాంలో వార్డు వలంటీర్‌గా పనిచేసింది. ఆ సమయంలో మునగప్ప రజని, గొంటు రమణమ్మతో ఏర్పడిన పరిచయం సైనైడ్ హత్యల పథకానికి బీజం పడింది. ఏడాది క్రితం తెనాలి సమీపంలో ఓ మహిళ మృతి కేసును దర్యాప్తు చేసిన పోలీసులు వారి నేరాలను వెలికితీశారు. బంగారం కోసం చేసిన 4 హత్యలు వెలుగులోకి వచ్చాయి. గుంటూరు పోలీసులు గత ఏడాది చివర్లో వారిని జైలుకు పంపారు.

బెజవాడలో లేడీ గ్యాంగ్

విజయవాడలోని రాజరాజేశ్వరిపేటలో 2017లో రాష్ట్రప్రభుత్వం నిర్మించిన పేదల పక్కా గృహ సముదాయాల్లోకి ఒక మహిళ వచ్చి చేరింది. అక్కడి పరిస్థితులు గమనించి గ్యాంగ్‌ను తయారు చేసుకుని ఖాళీగా ఉన్న ఇళ్లపై కన్నేసింది. అసలు లబ్ధిదారులకు తెలీకుండానే కొన్నింటిని అద్దెకు ఇవ్వడంతో పాటు మరికొన్ని ఇళ్లలో తన అనుచరులను దించింది. ఇలా పదుల సంఖ్యలో ఇళ్లు ఆక్రమించి లక్ష, రెండు లక్షలకు విక్రయించేసింది. కత్తులతో బెదిరించడంతో స్థానికులు, బాధితులు వణికిపోయారు. రోజు రోజుకూ ఆమె అరాచకాలు పెరిగిపోవడంతో బాధితులు రోడ్డెక్కారు. మీడియాలో వార్తలు రావడంతో పోలీసులు ఆమెను అరెస్ట్ చేశారు. ఆ లేడీ గ్యాంగ్‌ను అదుపు చేశారు.



అరవ కామాక్షి ఇంటి నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

గంజాయి డాన్ కామాక్షి అరెస్ట్

- 25 కేజీల గంజాయి, పత్రాలు.. బ్యాంకు పాస్‌బుక్‌లు స్వాధీనం
- పెంచలయ్య హత్య కేసులో ఏడుగురు నిందితులు కూడా
- మరో ఐదుగురి కోసం గాలింపు



పెంచలయ్య హత్యకు వాడిన ఆయుధాలు

నెల్లూరు(క్రైం)/నెల్లూరు (రూరల్), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లాలో గంజాయికి వ్యతిరేకంగా పోరాటం చేసిన సీపీఎం నాయకుడు పెంచలయ్య హత్య కేసులో ప్రధాన నిందితురాలు, గంజాయి డాన్ అరవ కామాక్షిని అరెస్టు చేశారు. నెల్లూరు నగరంలోని నవాబుపేట పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఆమె ఇంట్లో అక్రమ రవాణా కోసం దాచిన 25 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇంట్లోని విలువైన పత్రాలు, బ్యాంకు పాస్‌బుక్‌లను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం నెల్లూరు నగర ఇన్‌చార్జ్ డీఎస్పీ ఎం.గిరిధర్ మీడియాకు వివరాలు వెల్లడించారు. శుక్రవారం నెల్లూరు రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలో కల్లూరుపల్లి వద్ద జరిగిన పెంచలయ్య హత్య కేసులో కామాక్షి ప్రధాన నిందితురాలు. పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఆమె కోసం గాలింపు చేపట్టారు. శనివారం రాత్రి నవాబుపేట స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి.వేణుగోపాల్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఇన్‌స్పెక్టర్ జి.వేణు ప్రత్యేక బృందంగా ఏర్పడి నవాబుపేట పరిధిలోని కిన్నెర ప్రసాద్ లేఅవుట్‌లో ఉన్న కామాక్షి ఇంటి వద్ద కాపు కాశారు. ఆ సమయంలో కామాక్షి ఇంటికి రావడంతో ఆమెను పోలీసులు అదుపులోకి తీసుకుని, ఇంటి తాళాలు ఇవ్వాలని అడిగారు. ఆమె తాళాలు లేవని చెప్పడంతో తహసీల్దారు సమక్షంలో ఇంటి తాళాలను పగులగొట్టి తనిఖీలు చేశారు. ఇంట్లో దాచిన గంజాయి, విలువైన పత్రాలు, బ్యాంకు పాస్‌బుక్‌లను స్వాధీనం చేసుకొని, కామాక్షిని స్టేషన్‌కు తరలించారు. ఆదివారం గంజాయి కేసులో కామాక్షి అరెస్టు చూపించారు. త్వరలో నెల్లూరు రూరల్ పోలీసులు ఆమెను పీటీ వారెంట్‌పై పెంచలయ్య హత్య కేసులో అరెస్టు చూపించనున్నారు.

గంజాయి బ్యాచ్ అదుపులోకి

సీపీఎం నాయకుడు పెంచలయ్యను కిరాతకంగా హత్య చేసిన గంజాయి బ్యాచ్‌ను పోలీసులు పట్టుకున్నారు. అరవ కామాక్షి తన అనుచరులతో కలసి ఆయన్ను దారుణంగా చంపింది. ఆ తర్వాత నిందితులను పట్టుకునే క్రమంలో పోలీసులపై కత్తితో దాడి చేయడంతో ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. అరవ కామాక్షి అనుచరులు ఏడుగురిని నెల్లూరు రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. మరో ఐదుగురి కోసం గాలిస్తున్నారు. పోలీసు కాల్పుల్లో గాయపడ్డ నిందితుడు జేమ్స్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. డిశ్చార్జి అయ్యాక అతడి అరెస్టు చూపించనున్నారు. గంజాయి బ్యాచ్ చేతిలో గాయపడ్డ పోలీసు హెడ్‌కానిస్టేబుల్ ఆదినారాయణ కోలుకుంటున్నారు.

తెలీదు.. గుర్తులేదు.. మరిచిపోయా!

- కస్టడీలో జోగి బ్రదర్స్ సమాధానాలు
- 4 రోజుల్లో 250 ప్రశ్నలడిగిన అధికారులు
- ప్రతి ప్రశ్నకు డొంక తిరుగుడు సమాధానం
- ఎఫ్ఎస్ఎల్ సిబ్బంది ఎదురుగా ఫోన్లు ఓపెన్
- ముగిసిన కస్టడీ.. 9వ తేదీ వరకు రిమాండ్

విజయవాడ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): 'గుర్తులేదు, తెలీదు, మరిచిపోయా..' ఎక్సైజ్ పోలీసుల కస్టడీలో ఉన్న వైసీపీ నేత, మాజీమంత్రి జోగి రమేశ్ బ్రదర్స్ అధికారులు అడిగిన ప్రశ్నలకు చెప్పిన సమాధానాలు ఇవి!. నకిలీ మద్యం తయారీ కేసులో నిందితులుగా ఉన్న జోగి రమేశ్, ఆయన సోదరుడు జోగి రాము నాలుగు రోజుల కస్టడీ ఆదివారంతో ముగిసింది. వారిని విజయవాడ గురునానక్ కాలనీలోని ఎక్సైజ్ తూర్పు పోలీసుస్టేషన్‌లో విచారించారు. జోగి రమేశ్‌ను పైఅంతస్తులోను, రామును కింది అంతస్తులోను ప్రశ్నించారు. వారిని నాలుగు రోజుల్లో మొత్తం 250 ప్రశ్నలు అడిగారు. అయితే, ప్రతి ప్రశ్నకూ దాటవేత ధోరణిలోనే సమాధానాలిచ్చారు. నకిలీ మద్యం సూత్రధారి అద్దేపల్లి జనార్దనరావు లక్షలాది రూపాయలను ఇచ్చినట్టుగా చెబుతున్నారని ప్రశ్నించగా, ఆయన తనకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని రమేశ్ చెప్పినట్టు సమాచారం. జనార్దనరావుతో ఎలాంటి ఆర్థిక లావాదేవీలు నిర్వహించలేదని వాదించినట్టు తెలిసింది. ఆయనతో కలిసి మద్యం వ్యాపారం చేశారు కదా.. అని ప్రశ్నించగా దానికి ఎలాంటి సమాధానం చెప్పలేదు. అధికారులు మొత్తం 250 ప్రశ్నలు వేస్తే వాటిలో పదుల సంఖ్యలో ప్రశ్నలకే జవాబులు ఇచ్చినట్టు తెలిసింది.

ఫోన్లు తెరిచిన బ్రదర్స్

కస్టడీలో ఉన్న జోగి బ్రదర్స్ తమ ఫోన్లను అన్‌లాక్ చేశారు. అరెస్టు చేసినప్పుడు జోగి రమేశ్, ఆయన సోదరుడు రాము ఫోన్లను ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం, సాంకేతిక విశ్లేషణ కోసం ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌కు పంపారు. ఎఫ్ఎస్ఎల్ సిబ్బంది ఆ ఫోన్లను స్టేషన్‌కు తెచ్చారు. ఆ ఫోన్ల పాస్‌వర్డ్‌లు చెప్పాలని అధికారులు అడగ్గా.. తామే తెరుస్తామని ఫోన్లు తీసుకుని అన్‌లాక్ చేశారు. ఆఫ్రికా వెళ్లడానికి ముందు తాను జోగి రమేశ్‌ను ఇంటి వద్ద కలిశానని ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దనరావు పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు. దీనికి సంబంధించి రమేశ్ ఇంటి నుంచి డీవీఆర్‌ను స్వాధీనం చేసుకుని ఫుటేజీని పరిశీలించాలని భావించారు. దీనికి పాస్‌వర్డ్‌లు ఉండటంతో తెరుచుకోలేదు. రమేశ్ తన ఇంటి సీసీ కెమెరాలను సెల్‌ఫోన్‌కు అనుసంధానం చేసుకున్నారు. ఫోన్లను అన్‌లాక్ చేశాక దానిలో నిక్షిప్తమైన ఫుటేజీలను పరిశీలించారు. జోగి రమేశ్ ఇంటి ముందు అద్దేపల్లి అటూఇటూ తిరగడం ఫుటేజీల్లో కనిపించినట్టు తెలిసింది.



విజయవాడ జైలు వద్ద జోగి రమేశ్, ఆయన సోదరుడు

విజయవాడకు మార్చండి

నెల్లూరులోని కేంద్ర కారాగారంలో ఉంటున్న తనను విజయవాడలోని జిల్లా జైలుకు తరలించాలని జోగి రమేశ్ న్యాయాధికారి జి. లెనిన్‌బాబుకు విన్నవించుకున్నారు. దీంతో విజయవాడలో ఖాళీ ఉందో లేదో తెలుసుకోమని సిబ్బందిని ఆదేశించారు. జైలు అధికారులు ఇక్కడ ఖాళీ లేదని చెప్పడంతో అదే విషయాన్ని న్యాయాధికారి తెలియజేశారు. జైలులో సదుపాయాల గురించి ప్రశ్నించగా, బాగానే ఉన్నాయని జోగి బ్రదర్స్ సమాధానం ఇచ్చారు. కస్టడీలో పోలీసులు ఇబ్బంది పెట్టారా.. అని ప్రశ్నించగా అటువంటిదేమీ లేదని చెప్పారు. అనంతరం తొమ్మిదో తేదీ వరకు రిమాండ్‌ను పొడిగించారు. దీంతో వారిని నెల్లూరు జైలుకు తరలించారు.



గుడివాడలో విలేకరులతో మాట్లాడుతున్న ఐజీ రవికృష్ణ. చిత్రంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

డ్రగ్స్‌పై రాష్ట్ర ప్రభుత్వ యుద్ధం

- ఇప్పటివరకు 34 వేల కిలోల గంజాయి సీజ్
- ఈగల్ టీమ్ ఐజీ రవికృష్ణ వెల్లడి

గుడివాడ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఈగల్ వ్యవస్థను తీసుకొచ్చి పెద్ద యుద్ధమే చేస్తోందని ఈగల్ టీమ్ ఐజీ రవికృష్ణ అన్నారు. ఆదివారం నిర్వహించిన గుడివాడ సైక్లోథాన్-2025 సైకిల్ ర్యాలీకి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈగల్ టీమ్‌లో అందరినీ భాగస్వాములను చేస్తూ పాఠశాల, కళాశాలల్లో ఇప్పటికే 40 వేల ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు చేశామని చెప్పారు. తెలిసీ తెలియక కేసుల్లో ఇరుక్కుపోయి చాలా మంది జైలు జీవితం గడుపుతున్నారని, ఇలాంటి వారిని కేసు స్టడీగా తీసుకుని తల్లిదండ్రులు తమ చిన్నారుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆపరేషన్ చైతన్యంలో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎక్కడా గంజాయి సాగు లేకుండా చేశామని చెప్పారు. గంజాయి నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను రెండు నెలల కిందట ఢిల్లీలో జరిగిన సమావేశంలో కొనియాడారని గుర్తుచేశారు. ఒడిశా నుంచి గంజాయి సరఫరా జరుగుతున్నట్లు గుర్తించామని, రవాణా వ్యవస్థపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 34 వేల కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, 1,400 కేసులు నమోదు చేశామని, 18,336 అవగాహన కార్యక్రమాలు చేపట్టామని రవికృష్ణ వివరించారు. పొగాకు రహిత విద్యాసంస్థల కోసం ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్‌ను ప్రారంభించామని తెలిపారు. మత్తు పదార్థాల నిర్మూలనపై రాష్ట్ర ప్రభుత్వం ఆపరేషన్ గరుడను ప్రారంభించిందన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో రూ.12 కోట్ల విలువైన స్మగ్లర్ల ఆస్తులను సీజ్ చేశామని, మరో 200 మందిని గుర్తించామని ఐజీ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మద్యం కేసులో మరో అరెస్టు

- ఏ14 రంగయ్యను అరెస్టు చేసిన ఎక్సైజ్
- ఈ నెల తొమ్మిదో తేదీ వరకు రిమాండ్
- 2023 నుంచి 2 లక్షల 'నకిలీ' లేబుళ్ల ముద్రణ
- అసలు లేబుళ్లను పరిశీలించి నకిలీల తయారీ
- ఒక్కో షీట్‌కు రూ.45 చెల్లించిన అద్దేపల్లి
- రంగయ్యకు డబ్బు సమకూర్చిన తిరుమలశెట్టి
- 'మంజీర' పేరుతో ముద్రణ.. రిపోర్టులో వెల్లడి

విజయవాడ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం కేసులో 14వ నిందితుడి(ఏ-14)గా ఉన్న తలారి రంగయ్యను ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. ఆయనను విజయవాడలోని ఆరో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో ఆదివారం హాజరుపరచగా న్యాయాధికారి ఈ నెల 9వ తేదీ వరకు రిమాండ్ విధించారు. అనంతరం నెల్లూరులోని కేంద్ర కారాగారానికి తరలించారు. అద్దేపల్లి జనార్దనరావు సోదరులను అరెస్టు చేశాక ఎక్సైజ్ పోలీసులు తలారి రంగయ్యను నిందితుడిగా చేర్చారు. దీంతో తనను అరెస్టు చేయకుండా ఆదేశాలు ఇవ్వాలని రంగయ్య హైకోర్టులో వేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణలో ఉంది. ఈలోగా రంగయ్యను పోలీసులు అరెస్టు చేశారు.

అధిక ఆదాయం కోసం..

తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం దండుమైలారం గ్రామానికి చెందిన తలారి రంగయ్య ఇంటర్మీడియెట్ వరకు చదువుకున్నారు. తర్వాత కంప్యూటర్ గ్రాఫిక్ వర్క్ నేర్చుకుని, హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్‌లో 2018 నుంచి ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేశారు. తర్వాత 'ఆర్‌జే డిజైనర్స్ అండ్ ప్రింటింగ్' పేరుతో డీటీపీ సెంటర్ ఏర్పాటు చేసుకున్నారు. తిరుమలశెట్టి శ్రీనివాసరావు అనే వ్యక్తి 2022లో రంగయ్యను కలిసి, నకిలీ మద్యం సీసాలపై అతికించేందుకు లేబుళ్లు డిజైన్ చేసి తయారు చేయాలని కోరారు. తొలుత రంగయ్య అంగీకరించలేదు. ఆ తర్వాత తర్వాత శ్రీనివాసరావు షీట్‌కు రూ.45 ఇస్తామని చెప్పడంతో ఒక్కో లేబుల్‌పై 70 పైసలు లాభం వస్తుండటంతో నకిలీ లేబుళ్లను డిజైన్ చేసి ముద్రించడానికి రంగయ్య తలూపారు.

మొదటి ఆర్డర్ 15 వేల లేబుల్స్

రంగయ్య నకిలీ లేబుళ్లు డిజైన్ చేయడానికి అంగీకరించాక మంజీర బ్రాండ్ లేబుళ్లు 15వేలు తయారు చేయాలని ఆర్డర్ ఇచ్చారు. డిజైన్ చేయడంతోపాటు బ్యాచ్ నంబరు, తయారు చేసిన తేదీని వాటిపై ముద్రించాలని చెప్పారు. డిపోల నుంచి సరుకు బయటకు వచ్చిన తర్వాత వాటి బ్యాచ్ నంబర్లు, తయారీ తేదీలను పరిశీలించి నకిలీ లేబుళ్లపై వాటిని ముద్రించేవారు. ఇలా తయారైన లేబుళ్లను అద్దేపల్లి జనార్దనరావు, తిరుమలశెట్టి శ్రీనివాసరావు అసలు లేబుళ్లను దగ్గర పెట్టుకుని పరిశీలించుకునేవారు. అసలు లేబుళ్లకు దగ్గరగా ఉన్న తర్వాత నకిలీ లేబుళ్లను ముద్రణ చేయించుకునేవారు. డిపోల నుంచి సరుకు బయటకు వచ్చాక ఎప్పటికప్పుడు బ్యాచ్ నంబర్లు, తయారీ తేదీలను గమనించి నకిలీ లేబుళ్లను తయారు చేసేవారు. మంజీర లేబుళ్లను ముద్రించిన తర్వాత ఆంధ్రా గోల్డ్ విస్కీ, ట్రోపికానా, రాయల్ లాన్సర్ బ్రాండ్లతో నకిలీ లేబుళ్లను ముద్రించారు. ఇవన్నీ 2023 నుంచి ములకలచెరువులో నకిలీ మద్యం తయారీ కేంద్రం బయటపడే వరకు తయారు చేశారు. ఆర్‌జే డిజైనర్స్‌లో సుమారుగా 10-12 బ్యాచ్‌లకు సంబంధించిన 1.50 నుంచి 2 లక్షల నకిలీ లేబుళ్లను డిజైన్ చేసి ముద్రించారు. వాటికి సంబంధించిన ఆర్డర్లను తిరుమలశెట్టి శ్రీనివాసరావు ఇచ్చేవారు. తర్వాత నకిరికంటి రవి అనే వ్యక్తి ఒక ఆర్డర్‌కు సంబంధించి రూ.6,500ను రంగయ్యకు ఫోన్‌పే ద్వారా చెల్లించారు.



తలారి రంగయ్య

హైదరాబాద్‌లో అరెస్టు!

రంగయ్య తరపు న్యాయవాది చేతన్ న్యాయాధికారి లెనిన్‌బాబు వద్ద తన వాదనను వినిపించారు. ఎక్సైజ్ పోలీసులు రంగయ్యను శనివారం రాత్రి హైదరాబాద్‌లో అరెస్టు చేశారని తెలిపారు. అక్కడి నుంచి ఇక్కడికి తీసుకొచ్చి విజయవాడలో అరెస్టు చేసినట్టు చూపించారని, రిమాండ్ రిపోర్టులోను ఆవిధంగా రాశారని వాదించారు. దీనిపై నిందితుడిని న్యాయాధికారి ప్రశ్నించారు. ఎక్కడ అరెస్టు చేశారని అడిగారు. తనను హైదరాబాద్‌లో అరెస్టు చేశారని నిందితుడు రంగయ్య జవాబు ఇచ్చారు. ఆవిధంగా వాంగ్మూలం ఇస్తావా.. అని అడిగారు. దీనికి రంగయ్య చెప్పలేనని సమాధానం ఇచ్చారు. నిందితుడు వాంగ్మూలం ఇవ్వకపోయినా తాను ఇస్తానని న్యాయవాది చేతన్ చెప్పారు. రంగయ్యను న్యాయాధికారి చాంబర్‌లోకి తీసుకురావడానికి ముందే ఎక్సైజ్ అధికారులు రిమాండ్ రిపోర్టు ఇచ్చి సంతకాలు చేయించుకున్నారని, కనీసం దాన్ని చదువుకునే సమయం ఇవ్వలేదన్నారు. పైగా తనను చాంబర్‌లోకి రాకుండా ఏపీపీ జి. రాధిక అడ్డుకున్నారని చెప్పారు. ఎఫ్ఐఆర్ కాపీ, నిందితుడి వాంగ్మూలం కాపీని ఇవ్వలేదని వాదించారు. దీంతో వాటిని అందజేయాలని న్యాయాధికారి లెనిన్‌బాబు ఏపీపీని ఆదేశించారు. ఇదిలావుంటే, ప్రతి కేసులో కొత్తగా గుర్తించిన నిందితులను ఎఫ్ఐఆర్‌లో చేర్చినప్పుడు కోర్టులో యాడింగ్ మెమో దాఖలు చేస్తారు. రంగయ్య పేరును నిందితుడిగా చేర్చుతున్నట్టు యాడింగ్ మెమో రికార్డుల్లో కనిపించలేదు. దీంతో అప్పటికప్పుడు కంప్యూటర్ నుంచి ప్రింట్ తీసుకుని హడావుడిగా దాఖలు చేశారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar**, RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.